సాహితీ
గత వారం పుస్తకాలపై విశ్లేషణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

గుంటూరు
: fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

18-9-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 228 పేజీలు: 12 వెల: 6.50

## అమెరికాకు తగ్గుతున్న భారత్ ఎగుమతులు

## టిక్‌టాక్‌పై నిషేధం పొడిగించిన ట్రంప్

9లో




బుధవారం విశాఖలో జరిగిన జిఎస్టీ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కేంద్రమంత్రి నిర్మల సీతారామన్

### జిఎస్టీ సంస్కరణలతో

# కొత్త అధ్యాయం

### వికసిత్ భారత్‌కు అవి పునాదులు

### ప్రజలలో పెరగనున్న కొనుగోలు శక్తి

### కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్

**మధురవాడ, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** దేశంలో అన్ని వర్గాల ప్రజల పై ప్రభావం చూపేది జి.ఎస్.టి మాత్రమేనని, అందుకే ప్రజలందరికీ భారం తగ్గించేలా, అందరికి ఆమోదయోగ్యమైన సంస్కరణలను చేపట్టడం జరిగిందని కేంద్ర ఆర్థికశాఖామంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఈ సంస్కరణలు ప్రధాని ఆశయసాధనకు తోడ్పాటును అందిస్తామని, వికసిత్ భారత్‌కు పునాదులు వేస్తామని తెలిపారు. మధురవాడలో వి.కన్వెన్షన్స్ నందు జరిగిన జి.ఎస్.టి అవగాహనా సదస్సులో >>2

# ప్రజారోగ్యమే లక్ష్యం

### ప్రధాని మోడీ నాయకత్వంలో దేశం 4వ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా మారింది

### 2047కు నం-1కు ఎదుగుతుంది

### మంచి ఆరోగ్యం కోసం ఉప్పు, చక్కెర, నూనె వాడకం తగ్గించండి

### అక్టోబర్ 2 దాకా రాష్ట్రమంతా హెల్త్‌క్యాంపులు: సిఎం చంద్రబాబు




బుధవారం విశాఖలో జరిగిన స్వస్త్ నారీసశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు జ్ఞాపికను అందచేస్తున్న సిఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రులు పయ్యావుల కేశవ్, సత్యకుమార్ తదితరులు

**విశాఖ, సెప్టెంబరు 17, ప్రభాత వార్త:** ఆరోగ్యం విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వ్యవహరించాలని, ప్రజారోగ్యానికి ఎన్డీఏ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. విశాఖలో ఏర్పాటు చేసిన స్వస్త్ నారీసశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ప్రధాని మోదీ ప్రసంగాన్ని లైవ్‌లో వీక్షించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ "పేదల అభ్యున్నతి, మహిళల ఆరోగ్యం పై ప్రధాని మోదీ ప్రత్యేక దృష్టి పెట్టారు. మోదీ పుట్టినరోజు సందర్భంగా ఆయన సుదీర్ఘకాలం ప్రధానిగా ఉండి మంచి పాలన అందించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. నరేంద్ర మోదీ నాయకత్వంలో 11 ఏళ్లలో మనదేశం 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తయారైంది. 2038 నాటికి ప్రపంచంలో రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి నెంబర్ వన్ గా తయారవుతుంది. వికసిత్ భారత్ కల సాకారంతో పేదరిక నిర్మూలన మనం చూడబోతున్నాం. జీఎస్టీ సంస్కరణలతో ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుంది. అలాగే దేశానికి సమర్థవంతమైన ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ పనిచేస్తున్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం అంతా ఆరోగ్యంగా ఉంటుంది. తద్వారా రాష్ట్రం బాగుంటుంది. మంచి ఆరోగ్యం కోసం చక్కెర, ఉప్పు, నూనె వాడకాలను తగ్గించాలని కోరుతున్నాను. కేంద్రప్రభుత్వం స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రతి మహిళ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఈరోజు నుంచి అక్టోబర్ 2 తేదీ వరకూ 15 రోజుల పాటు వైద్య పరీక్షలు నిర్వహిస్తాం. రాష్ట్రమంతటా >>2

## గుర్తులతోపాటు అభ్యర్థుల కలర్ ఫోటోలు, ఇవిఎం బ్యాలట్లలో మార్పులు : ఇసి

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 17:** ఈవీఎంలపై కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఈవీఎం బ్యాలెట్ పత్రాల రూపకల్పనలో కీలక మార్పులు చేసింది. ఈవీఎంలపై గుర్తులతోపాటు అభ్యర్థుల కలర్ ఫొటోలను ముద్రించనుంది. ఈ మేరకు ఈవీఎం బ్యాలెట్ పత్రాలను రూపకల్పన, ముద్రణకు సంబంధించిన మార్గదర్శకాలను సవరించింది. ఎన్నికల నిర్వహణ నియమాలు, 1961లోని నియమం 49బి ప్రకారం, వాటిని మరింత చదవగలిగేలా, ఓటర్లకు అనుకూలంగా మార్చినట్లు కేంద్ర ఎన్నికల సంఘం బుధవారంనాడొక ప్రకటనలో తెలిపింది. త్వరలో జరుగనున్న బీహార్ అసెంబ్లీ ఎన్నికల నుంచి అమలు చేయనున్నట్లు వెల్లడించింది.
ఈసీ కథనం ప్రకారం, కొత్త బ్యాలెట్ పత్రాలలో గుర్తులతోపాటు అభ్యర్థుల కలర్ ఫోటోలు ఉంటాయి. ఈవీఎంలపై కేటాయించిన స్థలంలో అభ్యర్థుల ఫొటోలు చాలాస్పష్టంగా కనిపించేలా ముద్రించనున్నారు. ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో గత ఆరుమాసాల్లో 28 అంశాల్లో మార్పులు తీసుకొచ్చామని, అందులో ఇదొకటిని ఈసీ వివరించింది. అలాగే అభ్యర్థుల క్రమ సంఖ్యలు, నోటా ఎంపికను మరింత ప్రముఖంగా ప్రదర్శించాలని కూడా కమిషన్ నిర్ణయించింది. స్పష్టత కోసం ఫాంట్ సైజు 30 బోల్డ్‌లో ఉంటుంది. ఏకరూపతను కొనసాగించడానికి అభ్యర్థుల పేర్లు, నోటా ఒకే ఫాంట్ రకం, పరిమాణంలో కనిపిస్తాయి. అదనంగా, బ్యాలెట్ పత్రాలను 70జీఎస్ఎం కాగితంపై ముద్రిస్తారు. అసెంబ్లీ ఎన్నికలకోసం పేర్కొన్న ఆర్‌జీబీ విలువలతో కూడిన గులాబీరంగు కాగితంఉపయోగించనున్నట్లు ఈసీ పేర్కొంది.

## రాష్ట్రంలో నిలిచిన ఆరోగ్యశ్రీ సేవలు

**విజయవాడ, సెప్టెంబరు 17, ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో ఆరోగ్యశ్రీ సేవలుప్రైవేట్ ఆస్పత్రుల్లో బుధవారం ఉదయం నుంచి నిలిచిపోయాయి. ప్రభుత్వం నెలకు వంద కోట్ల రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చింది. అయినా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్ పట్టువీడం లేదు. నెలకు కనీసం రూ.500 కోట్లు విడుదల చేయాలని అసోసియేషన్ పట్టుబడుతున్నట్లు సమాచారం. దీనిపై ప్రభుత్వ విజ్ఞప్తి చేసినప్పటికి నెట్‌వర్క్ ఆస్పత్రులు స్పందించలేదని సమాచారం. ఈ క్రమంలో ఏపీలో ఆరోగ్యశ్రీ పథకం కింద ఓపీడీ సేవల నిలిపివేత కొనసాగుతోందని నెట్‌వర్క్ ఆస్పత్రులు వెల్లడించాయి. తమతో ప్రభుత్వం చర్చలు జరిపేంత వరకు ఆరోగ్యశ్రీ సేవలు పునరుద్ధరించబోమని నెట్‌వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్ తేల్చి చెప్పింది. అసోసియేషన్ తెలిపిన వివరాల మేరకు సీఎంఎఫ్ఎస్‌లో పెండింగ్‌లో ఉన్న రూ.674 కోట్లు కలిపి మొత్తం రూ.3,800కోట్ల బకాయిలు ఉన్నాయి. అయితే, త్వరలో బకాయిలు చెల్లిస్తామని ఆరోగ్యశ్రీట్రస్ట్ సీఈవో హామీ ఇచ్చారు. సీఎం సమక్షంలోనే సమావేశం జరగాలని నెట్‌వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్ పట్టుబడుతుంది. మరోపక్క ఆరోగ్యశ్రీ సేవల నిలిపివేతపై ఏపీ ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. నెట్‌వర్క్ యాజమాన్యాలతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. దీంతో గురువారానికి సేవలు పునరుద్ధరించబడతాయంటున్నారు. ప్రస్తుతం అత్యవసరవైద్యసేవలను ఆస్పత్రులు కొనసాగిస్తున్నట్లు సమాచారం.

### పాఠశాలల్లో ఇక

# నైతిక విద్యాబోధన

### అన్ని తరగతులకు వేర్వేరు పాఠ్యాంశాలతో పుస్తకాలు

### ప్రభుత్వం కీలక నిర్ణయం

**విజయవాడ, సెప్టెంబరు 17, ప్రభాతవార్తప్రతినిధి:** విద్యతో పాటు నైతిక విలువలు ఉంటేనే విద్యార్థులు ఉన్నత స్థానానికి ఎదుగుతారనే వ్యక్తిత్వ వికాస నిపుణుల అభిప్రాయం. ఇందుకు అనుగుణంగా పాఠశాల స్థాయి నుంచే వారి మోరల్ ఎడ్యుకేషన్(విలువలతో కూడిన విద్య అందించాలనే ఆలోచన ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అందుకు తగినట్లుగా పిల్లలకు విలువలతో కూడిన పుస్తకాలను పాఠ్యాంశాలతో పాటు అందిస్తోంది. ప్రస్తుతం పిల్లలపై సామాజిక మాధ్యమాల ప్రభావం పడుతోంది. వాటి కారణంగా వారి ప్రవర్తనలో మార్పు వచ్చే అవకాశం ఉంది. అందుకే పాఠశాల స్థాయిలోనే నైతిక విలువల పెంచేందుకు విలువల విద్య పుస్తకాలను ప్రభుత్వం సరఫరా చేసింది. ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోయాయి. అమ్మమ్మ, నాన్నమ్మ, తాతయ్య పిల్లలకు నీతి, నిజాయతీ, సేవ, విలువల గురించి కథల రూపంలో చెప్పేవారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితి అన్ని చోట్లా లేదు. ఉద్యోగ, వ్యాపారాలు, అవసరాల రీత్యా వివిధ ప్రాంతాల్లోతల్లిదండ్రులు, పిల్లలు మాత్రమే ఉంటున్నారు.
భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేయడం, పని ఒత్తిడి ఇతర కారణాల వల్ల పిల్లలకు సమయం కేటాయించలేక పోతున్నారు. ఫలితంగా వారు సోషల్ మీడియా, టీవీలకే పరిమితమవుతున్నారు. నైతిక విలువలు తగ్గిపోతున్నాయి. కోపం, ఆందోళన, అశాంతి నెలకొంటోంది. అందుకే పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు నైతిక విలువలు నేర్పించాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (నైతిక విలువలు) చాగంటి కోటేశ్వరరావు సూచనలతో రాష్ట్ర విద్య, పరిశోధన శిక్షణ మండలి విలువల విద్య పుస్తకాలు రూపొందించింది.
ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న >>2

### 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'

# చేతల్లో చూపుతున్నాం

### గత 15 నెలల్లో రాష్ట్రానికి రూ.10లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించాం

### రాష్ట్రంలో సుస్థిరమైన ప్రభుత్వం

### త్వరలో విశాఖకు అతిపెద్ద డేటా సెంటర్

### లండన్‌లో జరిగిన బిజినెస్‌ఫోరం రోడ్‌షోలో మంత్రి లోకేష్



లండన్‌లో టెక్ మహీంద్ర యూరప్ బిజినెస్ హెడ్ హర్షుల్ అస్నానీ సంధానకర్తగా జరిగిన సదస్సులో మంత్రి నారా లోకేష్

**విజయవాడ, సెప్టెంబరు 17, ప్రభాతవార్తప్రతినిధి:** స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ను మాటల్లో కాకుండా చేతల్లో చూపుతున్నామని ఏపీ మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్ పునరుద్ఘాటించారు. గత 15నెలల్లో రాష్ట్రానికి 10లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించగలిగినట్లు వివరించారు. విజనరీ లీడర్ చంద్రబాబు గారి సమర్థ నాయకత్వం వల్లే ఇది సాధ్యమైందని తెలిపారు. నవంబర్ 14, 15తేదీల్లో విశాఖపట్నంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న పార్టనర్ షిప్ సమ్మిట్ 2025కు గ్లోబల్ పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం పలికేందుకు లండన్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరక్టర్స్, పాల్‌మాల్ కన్వెన్షన్ వేదికగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యుకె బిజినెస్ ఫోరం నిర్వహించిన రోడ్ షోలో మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. అనుసరణగా టెక్ మహీంద్ర యూరప్ బిజినెస్ హెడ్ హర్షుల్ అస్నానీ సంధానకర్తగా వ్యవహరించి సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ వేగంగా అభివృద్ధి సాధించడానికి మూడు ప్రధాన కారణాలు ఉన్నాయి. అందులో మొదటిది లీడర్ షిప్ ట్రాక్ రికార్డ్. మాకు సుస్థిరమైన నాయకత్వం ఉంది. మా ముఖ్యమంత్రి చంద్రబాబు గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరమే లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను ఆయన అద్భుతంగా అభివృద్ధి చేశారు. ఇప్పుడు కొత్త రాష్ట్రాన్ని కూడా అదేవిధంగా అభివృద్ధిచేస్తున్నారు. 2వది స్పీడ్ ఆఫ్ డూయింగ్‌కు మేం ప్రాధాన్యత నిస్తున్నాం. ప్రాజెక్టు ఆరునెలలు ఆలస్యమైతే మొత్తం >>2




## నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

### మధ్యాహ్నం కేబినెట్ భేటీ

**విజయవాడ, సెప్టెంబరు 17, ప్రభాతవార్త ప్రతినిధి:** నేటి నుంచి అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. గురువారం ఉదయం 9 గంటలకు శాసనసభ సమావేశాలు, ఉదయం 10 గంటలకు శాసనమండలి సమావేశాలు ప్రారంభమవుతాయి. అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు, శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో సీఎస్, డీజీపీతో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశాల సందర్భంగా పటిష్ట భద్రతా ఏర్పాట్లపై ఈ భేటీలో చర్చ జరిగింది. రేపటి ఉభయసభలు ప్రశ్నోత్తరాలతో ప్రారంభమవుతాయి. అనంతరం శాసనసభ వ్యవహారాల సలహా కమిటీ సమావేశం జరుగుతుంది. శాసనసభ సమావేశాల నిర్వహణపై తుది >>2

## మాజీ మంత్రి జోగి రమేష్ అరెస్టు

### ఇబ్రహీంపట్టణంలో ఉద్రిక్తత

**విజయవాడ, సెప్టెంబరు 17, ప్రభాతవార్తప్రతినిధి:** బూడిద మాఫియాకు వ్యతిరేకంగా బుధవారం ఆందోళన చేపట్టిన వైసిపి నేత, మాజీ మంత్రి జోగి రమేష్‌ని పోలీసులు అరెస్టు చేయడంతో ఇబ్రహీంపట్నంలో ఉద్రిక్తత నెలకొంది. బూడిద డంపు వద్దకు వెళ్లడానికి అనుమతి ఇవ్వాలని వైసిపి డిమాండ్ చేసింది. అయితే పోలీసులు 144 సెక్షన్‌ను విధించారు. నలుగురికి మాత్రమే అనుమతినిచ్చారు. ఈ నేపథ్యంలో ఈరోజు మూలపాడులో బూడిద డంపుకు వెళ్లకుండా జోగి రమేష్ ఇంటి వద్ద పోలీసులు భారీగా మోహరించారు. బూడిద రవాణా ద్వారా ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ అక్రమార్జన చేశారని జోగి రమేష్ ఆరోపిస్తున్నారు. అయితే జోగి రమేష్ వ్యాఖ్యలను వసంత కృష్ణ ప్రసాద్ తీవ్రంగా ఖండించారు. దీంతో మూలపాడులో ఉద్రిక్తత ఏర్పడింది. ఈరోజు బూడిద డంపుకు వెళ్లడానికి వైసిపి సన్నద్ధమవ్వగా పోలీసులకు వైసీపీ శ్రేణులకు మధ్య వాగ్వివాదం నెలకొంది. ఇబ్రహీంపట్నంలో ఉద్రిక్తతల నడుమ మాజీమంత్రి జోగి రమేష్, వారి >>2

### మద్యం దుకాణాల్లో

# 100% డిజిటల్ చెల్లింపులు

### ఎర్రచందనానికి విలువపెంచి మనమే అమ్ముదాం: అధికారులతో సిఎం చంద్రబాబు

**విజయవాడ, సెప్టెంబరు 17, ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం దుకాణాల్లో 100 శాతం డిజిటల్ చెల్లింపులు అమలు చేసేందుకు ఏపీ ప్రభుత్వం సన్నద్ధమవుతుంది. సచివాలయంలో రెండు రోజుల పాటు జరిగిన కలెక్టర్ల సదస్సులో ఎక్సైజ్ శాఖకు సీఎం చంద్రబాబు ఆ దిశలో ఆదేశాలు జారీ చేసారు. బెల్ట్ దుకాణాలు పెరగడానికి ఇదొక కారణంగా సీఎం చంద్రబాబు అభిప్రాయం అభిప్రాయపడ్డారు. ఒక రకంగా ఇలా చేయకపోవడం వల్ల మనమే అవకాశం ఇచ్చి మళ్లీ నిఘా పెట్టి లేని పోని సమస్యలు తెచ్చుకుంటున్నామని సీఎం వ్యాఖ్యానించారు. ఇకపై పూర్తిగా డిజిటల్ చెల్లింపులు చేపట్టిన దుకాణాలకు తదుపరి కేటాయింపుల్లోనూ ప్రాధాన్యం ఇద్దామని చంద్రబాబు కలెక్టర్ల సదస్సులో అధికారులకు సూచించారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో పెరుగుదల రాబడిలోనూ కనిపించాలి. ఇకపై జిల్లా కలెక్టర్లు ఈ అంశాన్ని పరిశీలించి తదుపరి సమావేశానికి ఫలితాలు సాధించాలని సీఎం అన్నారు. ఎర్రచందనం నుంచి తగిన ఆదాయం పొందలేకపోయాం. మంచి బొమ్మలు తయారు చేసేవారిని తీసుకువచ్చి తిరుపతి ఎర్రచందనం డిపోలోనే తయారు చేయిద్దాం. దీనివల్ల అధికంగా ఆదాయం వచ్చే ఆస్కారం ఉంది. ఎర్రచందనం రూ.లక్ష కోట్ల ఆస్తి. సరిగా ఉపయోగించుకోవాలి. ఎర్రచందనంపై ఎంతో ఆశ పెట్టుకున్నా నిరాశపరిచారు. ఎర్రచందనానికి విలువ పెంచి మనమే అమ్ముదాం, ఆదాయం పెంచుకుందాం, పరిశీలించండని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ఆదాయార్జన శాఖలపై సమీక్షించిన సందర్భంగా అనేక అంశాలు ప్రస్తావనకు వచ్చాయని సీఎం వెల్లడించారు. ఇదే సందర్భంలో బార్లఏర్పాటుకు సంబంధించి ఏమిటి ఇబ్బందని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. దుకాణాల కన్నా బార్లకు సరఫరా చేసే మద్యం ధర 16శాతం ఎక్కువనీ, ఇది సమస్యగా ఉందని ముఖ్య కార్యదర్శి మీనా వివరించారు. పర్మిట్ రూమ్‌లకు అనుమతి ఇచ్చి ఆ తర్వాత బార్ల ఏర్పాటుకు ముందుకు రావడంతో సమస్య ఏర్పడిందని ఒకరిద్దరు అధికారులు అభిప్రాయపడ్డారు. కారణాలు అన్వేషించి తన వద్దకు రావాలని, పరిష్కారాలు వెదుకుదామని సీఎం చంద్రబాబు వివరించారు. జీఎస్టీ కొత్త శ్లాబులు ఈ నెల 22 నుంచి అమల్లోకి వస్తున్నాయి. ఎంఆర్‌పీలో అది ప్రతిబింబిస్తోందో లేదో పరిశీలించాలని సీఎం కోరారు. జీఎస్టీ తగ్గింపు, ప్రజలకు ప్రయోజనాలు, ఇతర అంశాలపై నెల రోజుల పాటు ప్రచారం చేపడదామనీ, యోగా విషయంలో ఎలా చేశామో అలాగే చేద్దామనీ బీమాపై జీఎస్టీ తగ్గించినందున ప్రభుత్వం కడుతున్న బీమా విషయంలోనూ ఆ ఫలితాలు పొందేందుకు ఉన్న అవకాశాలను అన్వేషించండి అని >>2



## ఇసుక టిప్పర్‌ను ఢీకొన్న కారు

### సంగం వద్ద ఘోర ప్రమాదం

### ఏడుగురు దుర్మరణం

### దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి ఆనం

**సంగం (నెల్లూరు), సెప్టెంబరు 17, ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లా సంగం మండలం ముంబాయి హైవే రోడ్డుపైన పెరమన సమీపంలో ఇసుక టిప్పర్ కారును ఢీకున్న సంఘటనలో 7 మంది అక్కడిక్కడే దుర్మరణం చెందారు. మృతి చెందిన వారిలో చిన్న పాప కూడా ఉందని పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని జిల్లా ఎస్పి అజితా వేజెండ్లా పరిశీలించారు. పోలీసుల కథనం మేరకు నెల్లూరు గుర్రల మడుగు సంఘంకి చెందిన వారు ఆత్మకూరులో ఉన్న తమ బంధువులను పరామర్శించేందుకు కారులో వెళుతుండగా పెరమనవద్ద ఆత్మకూరు వైపు నుండి వస్తున్న ఇసుక లారీ అతి వేగంగా వచ్చి కారును ఢీకొట్టింది. కారును ఢీకొట్టి 2 వందల మీటర్లు వెనుకకు నెట్టి వేసింది. కారు టిప్పర్ కింద ఇరుకొని పోయింది. పోలీసులు కనీసం మృతదేహాలను తీసేందుకు కూడా లేకుండా పోయింది. సంగం సిఐ వేమారెడ్డి, ఎస్ఐ రాజేష్ జెసిబి తీసుకొని వచ్చి టిప్పర్‌లో ఇరుకొని పోయి వున్న కారును తీశారు. అందులో వున్న మృతదేహాలు రక్తపు ముద్దగా మారిపోయాయి. సంఘటనా స్థలాన్ని ఆత్మకూరు ఆర్‌డిఒ పావనీ పరిశీలించారు. మృతులు తాళ్లూరు శ్రీనివాసులు (40), తాళ్లూరు రాధ, (38)' శేషం సారమ్మ (40), చల్లగుండ్ల శ్రీనివాసులు, చల్లగొండ్ల లక్ష్మి (40), శేషం వెంగయ్య (38), వీరంతా బంధువులేకారు డ్రైవర్ కత్తి బ్రహ్మయ్య (24) నెల్లూరు కరెంటు ఆఫీస్ సెంటర్ కాగా పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టంకి పంపించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రమాదంపై దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దిగ్భ్రాంతి >>2

18-09pg2exHMNWJQE 2_18-09pg2exHMNWJQE.qxd 9/18/2025 12:56 AM Page 1



# ప్రజారోగ్యమే లక్ష్యం

>> 13,944 హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నాం. తల్లిబిడ్డా ఆరోగ్య రక్షణ కోసం కార్డులు జారీ, గర్భిణీ స్త్రీల సంరక్షణతో పాటు పిల్లలకు టీకాలు వేయడంపై దృష్టి పెట్టాం. రక్తహీనత, పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తాం. హైబీపీ, షుగర్, ఓరల్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్, టీబీ తదితర అన్నిరకాల వైద్య పరీక్షలు ఈ కార్యక్రమంలో ఉచితంగా చేస్తాం. గైనకాలజీ, ఈఎన్‌టీ, నేత్ర, డెర్మటాలజీ, సైకియాట్రీ, డెంటల్ సర్జన్, పీడియాట్రిషన్ డాక్టర్లు ఈ శిబిరాల్లో వైద్య సేవలు అందిస్తారు" అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ప్రజారోగ్యానికి ప్రాధాన్యకేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాయని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ ఏడాది ఆరోగ్యరంగానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.19,264 కోట్ల వ్యయం చేస్తోందని తెలిపారు. దీనిపై మాట్లాడుతూ "ఇంట్లో ఎవరికి ఆరోగ్యం బాగో లేకపోయినా ఆ కుటుంబమంతా ఇబ్బంది పడుతుంది. నేటి కాలంలో వైద్య ఖర్చుల కంటే ఆస్పత్రి ఖర్చులే ఎక్కువయ్యాయి. అందుకే ప్రతి కుటుంబానికి యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమ్ తీసుకువచ్చాం. రాష్ట్రంలో అందరికీ రూ.2.5 లక్షల వరకూ ఉచితంగా ఆరోగ్య భీమా కల్పిస్తున్నాం. పేదలకు రూ.25 లక్షల వరకూ వైద్య చికిత్సలకు అయ్యే ఖర్చును ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్టు భరిస్తుంది. ఈ రోజు నుంచి వచ్చే నెల 16 వరకు 8వ రాష్ట్రీయ పోషణ మాసంగా పాటిస్తున్నాం. ప్రత్యేక థీమ్‌తో ఆరోగ్య పద్ధతులను పాటించేలా చూస్తున్నాం. రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరి ఆరోగ్య రికార్డులను డిజిటల్‌గా రూపొందించేందుకు టాటా, గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి ప్రాజెక్ట్ సంజీవని చేపట్టాం. విశాఖలోని మెడ్ టెక్‌జోన్ ద్వారా వైద్య పరికరాలు ఉత్పత్తి అవుతున్నాయి. ఇవి ప్రపంచవ్యాప్తంగా ఎగుమతి అవుతున్నాయి అని సీఎం అన్నారు.

**మహిళాభ్యున్నతికి కట్టుబడి ఉన్నాం**

మహిళలకు ఓ వైపు సంక్షేమం అందిస్తూనే మరోవైపు వారి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టామని ముఖ్యమంత్రి తెలిపారు. ఇంట్లో ఎందరు పిల్లుంటే వారందరికీ తల్లికి వందనం ఇచ్చాం. దీపం పథకం కింద మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నాం. స్త్రీశక్తి కింద మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించాం. డ్వాక్రా,మెప్మా సంఘాలతో మహిళల ఆర్థిక స్థితిగతులు మార్చాం. డ్వాక్రా మహిళల పొదుపు రూ. 20 వేల కోట్ల పైనే ఉంది. డ్వాక్రా రుణాలు కట్టని వారు 2 పర్సంట్ మాత్రమే ఉన్నారంటే వారి ఆర్థిక క్రమశిక్షణ ఎలా ఉందో అర్థంచేసుకోవచ్చు. లక్షమంది మహిళలను లక్షాధికారులను చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. మొదటిసారిగా ఎన్టీఆర్ మహిళలకు ఆస్తిలో హక్కు ఇవ్వగా ప్రధాని మోదీ మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించారు.

కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. విశాఖ వాసులది మంచి మనసు. హుద్ హుద్ విపత్తు సమయంలో వారు చూపిన చొరవ, సేవను నేను మర్చిపోలేను. విశాఖ బెస్ట్ సిటీ అని నేను ఎక్కడికి వెళ్లినా చెబుతాను. దేశంలోనే మహిళలకు సురక్షిత ప్రాంతం విశాఖ. ఇక్కడకు త్వరలో గూగుల్‌వస్తోంది. భవిష్యత్‌లో దేశంలోనే గొప్ప నగరంగా విశాఖ తయారుచేస్తామని సీఎం చంద్రబాబు అన్నారు.

# జిఎస్టీ సంస్కరణలతో కొత్త అధ్యాయం

>> మంత్రి పాల్గొన్నారు. తొలుత పలు వాణిజ్య సంస్థల ప్రతినిధుల సందేహాలకు, ప్రశ్నలకు ఆమె సమాధానాలు ఇచ్చారు. అనంతరం జి.ఎస్.టి పై గత స్లాబ్ లు ప్రస్తుత స్లాబ్ లు, ఏయే వస్తువులపై ఎంతెంత పన్ను తగ్గించారు, పన్నునుండి పూర్తిగా మినహాయింపు పొందిన వస్తువులు తదితర అంశాలపై సమగ్రంగా పవర్ పాయింట్ పై వివరించారు. గతం లో 5,12,18,28 శాతంగా ఉండే పన్నులు ప్రస్తుతం 5, 18 శాతం మాత్రమే అమలులోకి వస్తున్నాయని తెలిపారు. ఈ నెల 22 నుండి కొత్త జి.ఎస్.టి అమలులోకి వస్తుందని, 12 శాతం జి.ఎస్.టి ఉండే వస్తువులు 99 శాతం వరకు 5 శాతం జి.ఎస్.టి లోకి వెళ్లాయని, అలాగే 28 శాతం ఉన్న వస్తువులు 90 శాతం వరకు 18 శాతం పన్ను లోకి వెళ్లాయని, దీని వలన పేద, మధ్య తరగతి వారి ఖర్చు తగ్గి, వారి కొనుగోలు శక్తి పెరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. ప్రధానంగా వైద్య, ఆరోగ్యానికి సంబంధిన ఎక్విప్మెంట్, మందులపై ఎటువంటి జి.ఎస్.టి లేదని తెలిపారు. రైతులకు సంబంధించిన పరికరాలు, ఎం.ఎస్.ఎం.ఈ తదితర రంగాలపై జి.ఎస్.టి ని తగ్గించడం జరిగిందన్నారు. ప్రజలు చెల్లించే పన్నులను సక్రమంగా ఖర్చు చేసే బాధ్యత ప్రభుత్వంపై ఉండాలని, జి.ఎస్.టి నుండి దేశానికి వచ్చే ఆదాయాన్ని తిరిగి ప్రజలకే అభివృద్ధి, సంక్షేమ పథకాల రూపంలో అందించడం జరుగుతోందన్నారు. జాతీయ రహదారుల, ఎయిర్పోర్ట్ లు, పోర్ట్ లు, తదితర మోలిక వసతుల కల్పనకు ఈ పన్నులు ఉపయోగ పడతాయన్నారు. వినియోగదారులు, వాణిజ్యవేత్తలు, తయారీదారు, ఎగుమతిదారులు, ప్రభుత్వం కూడా లబ్ది పొందడమే సంస్కరణల ప్రధాన లక్ష్యమని అన్నారు. రాష్ట్ర ఆర్థికశాఖామంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ జి.ఎస్.టి సంస్కరణలు అకస్మాత్తుగా తీసుకున్న నిర్ణయం కాదని, అంతకు ముందు కౌన్సిల్ సమావేశంలో అన్ని రాష్ట్రాల సమక్షంలో మేధో మధనం చేసి, ప్రజలకోసం, దేశం కోసం తీసుకున్న గొప్ప నిర్ణయమని అన్నారు. కోవిడ్ కాలంలో కూడా ఆర్థిక సంక్షోభం తలెత్తకుండా దేశాన్ని నడిపిన ప్రధాని మోడీ ఐ.సి.యు లో నున్న మన రాష్ట్రానికి ఆక్సిజన్ అందించారని పేర్కొన్నారు.

రాష్ట్ర వైద్య శాఖామంత్రి వై.సత్యకుమార్ మాట్లాడుతూ క్లిష్ట పరిస్థితుల్లో ఆర్థిక శాఖను పటిష్ఠగా నిర్వహించిన మంత్రి నిర్మలా సీతారామన్ సంస్కరణలు పేదలకు మేలు చేసేవిగానే ఉంటాయని అన్నారు. ప్రపంచంలో నే అత్యధిక జిడిపి నమోదైన దేశంగా భారత్‌ను నిలిపారని, అతి తక్కువ కాలం లోనే మోడీ నిర్మాణాత్మక చర్యల వలన ప్రపంచంలో 11వ స్థానం లో నున్న భారత్ ప్రస్తుతం 4వ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచిందని తెలిపారు. త్వరలోనే 1వ స్థానం లోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఎం.ఎల్.ఏ మరియు ఫ్లోర్ లీడర్ విష్ణుకుమార్ రాజు, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్,విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు పరశురామ్, జి.ఎస్.టి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, బి.ఎన్.ఐ, టెక్స్టైల్స్, పాప్సి, హోటల్స్, స్టీల్, క్రెడాయ్, టాక్స్ పేయర్స్ తదితర వాణిజ్య సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# చేతల్లో చూపుతున్నాం

>> బిజినెస్ ప్లాన్ దెబ్బతింటుంది. భారతదేశంలో అతిపెద్ద స్టీల్ ప్లాంట్ ను ఆర్సెలర్ మిట్టల్ సంస్థ ఆంధ్రప్రదేశ్ లో ఏర్పాటుచేయబోతోంది. గత ఏడాది జూన్ లో వారితో చర్చలు జరిపినపుడు, వారు మూడు ప్రత్యేక అభ్యర్థనలు చేయగా, కేవలం 12గంటల్లోనే పరిష్కరించాం. నవంబర్ లో ఆర్సెలర్ స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులు ప్రారంభం కాబోతున్నాయి. దేశంలో అతిపెద్ద డాటా సెంటర్ త్వరలో విశాఖపట్నానికి రాబోతోంది. టిసిఎస్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలను రాష్ట్రానికి రప్పించేందుకే మేం ఎకరా 99 పైసలకే భూములు ఇచ్చాం. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ను మాటల్లో కాకుండా చేతల్లో చూపిస్తున్నాం. 3వది మావద్ద ఉత్సాహవంతంగా పనిచేసే కొత్తతరం యువనాయకత్వం ఉంది. మొత్తం శాసనసభలో 50శాతం తొలిసారి గెలిచినవారు. మంత్రివర్గంలోని 25మందిలో 17మంది కొత్తవారే. వారందరికీ స్టార్టప్ మైండ్ సెట్ ఉంది. ఆంధ్రప్రదేశ్ ఒక స్టార్టప్ స్టేట్. మేమంతా రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయలన్న తపన, పట్టుదలతో పనిచేస్తున్నాం. విజనరీ లీడర్ చంద్రబాబు గారి నాయకత్వాన గత 15నెలల్లో రూ.10లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించగలిగాం. ఎంఓయులతో సరిపెట్టకుండా ప్రాజెక్టులను గ్రౌండింగ్ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. రాబోయే అయిదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు కల్పిం చాలన్నది మా లక్ష్యం. ఇటువంటి సాహసోపేతమైన హామీని దేశంలో మేం మాత్రమే ఇచ్చాం. దక్షిణ ఆసియాలో తొలి 158 బిట్ క్వాంటమ్ కంప్యూటర్ జనవరిలో అమరావతికి రాబోతోంది. ప్రధాని మోడీ క్వాంటమ్ మిషన్ ను ముందుండి నడిపించేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. దీనిద్వారా అమరావతిలో అద్భుతమైన ఎకో సిస్టమ్ ఏర్పాటు కాబోతోంది. విశాఖలో డాటా సిటీ నిర్మాణం వల్ల అక్కడ కేబుల్స్ ల్యాండ్ అవుతాయి. ముంబాయి కన్నా రెట్టింపు సామర్థంతో 1.5 గిగావాట్ల డేటా సెంటర్స్ విశాఖకు రాబోతున్నాయి. రాబోయే మూడేళ్లలో అవి పూర్తవుతాయి. ఇది ఆరంభం మాత్రమే. ఇంకా ఎన్నో ప్రతిష్టాత్మక సంస్థలతో చర్చలు జరుపుతున్నాం. క్వాంటమ్ వ్యాలీ, డాటా సిటీలతో ఎపి దేశంలోనే ప్రత్యేక స్థానాన్ని సాధించబోతోంది. క్వాంటమ్ వ్యాలీ, డాటా సిటీలతో ఆంధ్రప్రదేశ్ రూపురేఖలు మారబోతున్నాయి. ఐటి విప్లవం వల్ల భారతదేశం లబ్ధి పొందింది. ఇప్పుడు ఎఐ సాంకేతికత శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఎఐ ద్వారా వచ్చే అవకాశాలను అందిపుచ్చుకునేందుకు మేం స్కిల్ అప్ గ్రేడేషన్ కు ప్రాధాన్యత నిస్తున్నాం. కళాశాలలు, యూనివర్సిటీల్లో ఎఐ పాఠ్యాంశాలను ప్రవేశపెడుతున్నాం. రాబోయే రోజుల్లో ఎఐ గేమ్ చేంజర్ కాబోతోంది. వివిధ పరిశ్రమలకు అవసరమైన వర్క్ ఫోర్స్ ను సిద్ధం చేసేందుకు రాష్ట్రప్రభుత్వం తరపున స్కిల్ ఇంటర్వెన్షన్ ను అమలు చేస్తున్నాం. యువతలో నైపుణ్యాలను పెంపొందించి, ఉద్యోగావకాశాలు కల్పించేందుకు అక్టోబర్ లో నైపుణ్యం పోర్టల్ ను ప్రారంభించబోతున్నాం.

విజన్ - 2047 లక్ష్యంలో ప్రధానమైన 2.4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీకి చేరుకోవడానికి ప్రతిఏటా సగటున 15శాతం వృద్ధి రేటు సాధించాల్సి ఉంది. ఇందుకు అనుగుణంగా మేం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాం. ఆంధ్రప్రదేశ్ లో 5వేల ఎకరాల్లో మేం స్పేస్ సిటీని నిర్మించబోతున్నాం. భారత్ లో స్పేస్ ఎక్స్ కు సమానమైన స్కైరూట్ అనే సంస్థకు 300 ఎకరాలు కేటాయించాం. భూమి ధరకు సంబంధించి ఆ సంస్థ విజ్ఞాపనను పరిశీలించి, కేబినెట్ లో చర్చించి కేవలం వారంరోజుల్లో ఆ సంస్థకు భూకేటాయింపులు పూర్తిచేశాం. యుఎస్ అదనపు సుంకాల నేపథ్యంలో సవాళ్లను అవకాశాలుగా మలుచుకుని ముందుకు సాగుతాం. యుకె, రష్యా, యూరప్ లలో కొత్త మార్కెట్లను వెదుక్కుంటాం. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే పెట్టుబడి దారులకు సహకరించేందుకు మేం వందరోజుల ప్రణాళికను అమలు చేస్తున్నాం. అయిదుగురు ప్రఖ్యాత పారిశ్రామికవేత్తలతో సలహామండలిని ఏర్పాటు చేశాం. పరిశ్రమలస్థాపనలో ప్రతిబంధకంగా ఉన్న కొన్ని నిబంధనలను సవరిస్తున్నాం. ఎపిలో కార్మిక సంస్కరణలు, ల్యాండ్ కన్వర్షన్, నాలా టాక్స్ వంటివి సవరించాలని కేంద్రమంత్రి అశ్వనీ వైష్టవ్ సూచించగా, కేవలం 45రోజుల్లో ఆ సవరణలు పూర్తిచేశామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

ఈ రోడ్ షోలో యుకె డిప్యూటీ హై కమిషనర్ సుజిత్ ఘోష్, టెక్ మహీంద్రా యూరప్ విభాగం ప్రెసిడెంట్ హర్షుల్ అస్నానీ, ఐసిఐసిఐ బ్యాంకు యుకె విభాగం సిఇఓ రాఘవ్ సింఘాల్, ఎపిఐఐసి వైస్ చైర్మన్ ఎండి అభిషిక్త్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.ప్రస్తుతం లండన్‌లో ఉన్న లోకేష్, రేపటికి ఇండియాకు తిరిగిరానున్నారు.

# నెత్తురోడిన ఛత్తీస్‌గఢ్

## ఇన్‌ఫార్మర్ల నెపంతో ఇద్దరు పౌరులను హతమార్చిన మావోయిస్టులు

## ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు నక్సల్స్ హతం

**రాయ్‌పూర్, సెప్టెంబరు 17:** ఆయుధాలు వదిలేస్తాం శాంతి చర్చలకు సిద్ధం, ఓ నెల రోజుల పాటు యాంటీ- మావోయిస్టుల ఆపరేషన్ నిలిపివేయాలని కోరుతూ మావోయిస్టులు ప్రకటించిన 24 గంటల్లోనే నక్సల్స్ దుశ్చర్యకు పాల్పడారు. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, దంతేవాడ జిల్లాల్లో ఇద్దరు పౌరులను పోలీస్ ఇన్‌ఫార్మర్ల నెపంతో హతమార్చారు. ఈ రెండు ఘటనలు మంగళవారం అర్ధరాత్రి జరిగినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. అటు బీజాపూర్ జిల్లాలో భద్రతా బలగాలు కూంబింగ్ నిర్వహిస్తుండగా బుధవారం మధ్యాహ్నం 3గం.ల సమయంలో మావోయిస్టులు ఎదురుపడగా, కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందినట్లు బీజాపూర్ పోలీసులు తెలిపారు. ఘటనా స్థలం నుంచి ఒక 303 రైఫిల్, ఒక బ్యారెల్ గ్రెనేడ్ లాంచర్(బీజీఎల్), పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వివరించారు.



సిఎస్ విజయానంద్‌తో చర్చిస్తున్న జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు సయాని విజయ భారతి

# సిఎస్‌ను కలిసిన జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు

## పోలవరం నిర్వాసితుల సమస్యలపై సమీక్ష

విజయవాడ, సెప్టెంబర్ 17,ప్రభాతవార్తప్రతినిధి:జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు సయాని విజయ భారతి బుధవారం సీఎస్ కె.విజయానంద్ ను విజయవాడ సీఎస్ క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా పోలవరం నిర్వాసితుల సమస్యలతో పాటు గుండ్లకమ్మ ప్రాజెక్టు తదితర అంశాలపై సీఎస్ తో సమీక్షించారు. పోలవరం ప్రాజెక్టు లో భూములు కోల్పోయిన నిర్వాసితుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు చేపట్టిన చర్యలు చేపట్టిందని సీఎస్ వివరించారు.భవిష్యత్తులో వారి కోసం తీసుకునే చర్యలు తదితర అంశాలపై ఒక రోడ్ మ్యాప్ తయారు చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని, ఇదే విషయాన్ని జాతీయ మానవ హక్కుల కమిషన్ కు కూడా అందించాలని సీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ డిప్యూటీ రిజిస్ట్రార్ ( న్యాయ విభాగం) ఇంద్రజిత్ కుమార్, నీటి పారుదల శాఖ ప్రభుత్వ సలహాదారు వెంకటేశ్వర రావు, పోలవరం ప్రాజెక్ట్ పరిపాలన అధికారి అభిషేక్, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. స్మరణ్ రాజ్,నీటిపారుదల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ నరసింహ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



ప్రధాని మోడీ బర్త్‌డే సందర్భంగా న్యూఢిల్లీలో పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించిన కేంద్రహోంమంత్రి అమిత్‌షా

# నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

>> నిర్ణయం బీఏసీ సమావేశంలో తీసుకోనున్నారు. కాగా సీఎం చంద్రబాబు అధ్యక్షతన గురువారం మధ్యాహ్నం సచివాలయంలో మంత్రి మండలి సమావేశం జరుగుతుంది.ఈ సమావేశంలో అసెంబ్లీ చర్చించే అంశాలు,ప్రవేశపెట్టే బిల్లులు, ఇతర విషయాలపై కీలక నిర్ణయాలు తీసుకుంటారు.త

# పాఠశాలల్లో ఇక నైతిక విద్యాబోధన

>> 6-10 తరగతుల విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం నుంచి విలువల విద్య పుస్తకాలను అందించనున్నారు. విద్యారంగ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు సూచనలతో రాష్ట్ర విద్య పరిశోధన, శిక్షణ మండలి (ఎస్‌సీఇఆర్‌టీ) ఈ పాఠ్య పుస్తకాలను రూపొందించింది. ఆరో తరగతికి తోరణాలు, ఏడో తరగతికి మనోవికాసం, ఎనిమిది, తొమ్మిది తరగతులకసూక్తి సుధ, పదో తరగతికి అమృతధార పేరుతో ఈ పుస్తకాలను తీసుకువచ్చారు. ఇవి దాదాపు 39 పేజీల వరకు ఉన్నాయి. పుస్తకాల్లో క్యూఆర్ కోడ్ పెట్టారు. ఆయా పాఠ్యాంశాల వీడియోలు కావాలనుకునేవారు వాటిని స్కాన్ చేయవచ్చు. ఆయా జిల్లాల విద్యా శాఖ ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీకి చర్యలు తీసుకున్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వాటిని పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నామని ఎన్టీఆర్ జిల్లా, డీఈవో, సుబ్బారావు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 2500 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. సుమారు రెండు లక్షల యాభై వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆరు నుంచి పది విద్యార్థులకు ఒక్కో పుస్తకం ఇవ్వనున్నారు. ఇప్పటికే వాటిని పాఠశాలలకు సరఫరా చేశారు.

# 100% డిజిటల్ చెల్లింపులు

>> చంద్రబాబు అన్నారు. జీఎస్టీ వల్ల ప్రజలకు ప్రతి ఏటా నేరుగా రూ.8,000 కోట్ల మేర ప్రయోజనం దక్కుతుందని వాణిజ్య పన్నులశాఖ కమిషనర్ బాబు చెప్పారు.

జీఎస్టీ లైసెన్సుల రిజిస్ట్రేషన్లను సులభతరం చేశారు. జీఎస్టీ రిజిస్ట్రేషన్ 3 రోజుల్లో పూర్తి చేస్తున్నందున మిగిలిన శాఖలూ అలాంటి అవకాశాలు పరిశీలించాలి అని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఏలూరు జిల్లాలో గనుల నుంచి ఆదాయం ఎందుకు బాగా తగ్గిందో చూడాలి. గనులు అన్ని చోట్లా ఒకే తరహాలో ఉండవు. జిల్లాలను 3 గ్రూపులుగా విభజించి పరిశీలించాలి. ఉచిత ఇసుక వల్ల రూ.1,000 కోట్లు ప్రతి ఏటా కోల్పోతున్నా ప్రజలకు సంతృప్తి స్థాయి తక్కువగా ఉంది. అవసరమైన మార్పులు చేయాలి.

**నేరాలను పూర్తి స్థాయిలో అదుపు చేయాలి:** ఏపీలో ఏడాది వ్యవధిలో 33 శాతం మేర నేరాల్ని తగ్గించాలని, అదే సమయంలో ప్రజల్లో సంతృప్తి శాతం పెరగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పోలీసు యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు ఆదేశాలపై ఏపీ డీజీపీ కార్యాలయం ప్రత్యేక సమాచార పత్రాన్ని విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే నివేదికలు, రికార్డుల్లో ఏపీలో నేరాలు తగ్గాయనే విషయం ప్రస్ఫుటంగా కనిపించాలన్నారు. శిక్షల శాతం పెంపుపై దృష్టి సారించడంతో పాటు నేరం జరిగిన గంటలోగా ఘటనా స్థలానికి చేరుకుని ఫోరెన్సిక్ ఆధారాలన్నీ సేకరించాలని సూచించారు. ఇకపై జిల్లాలవారీగా ఏయే నేరాలు జరుగుతున్నాయి? శిక్షల శాతం ఎంత మెరుగుపడిందనే దానిపై సమీక్షిస్తానని తెలిపారు. విజయవాడ, ఏలూరుల్లో అమలు చేసిన సాంకేతిక పోలీసింగ్ కార్యక్రమాలను మిగతా జిల్లాల్లో ఎందుకు చేయలేకపోతున్నారని ప్రశ్నించారు. నిర్దేశిత కాలవ్యవధి పెట్టుకుని రాష్ట్రమంతటా వాటిని అమలు చేయాలని తేల్చిచెప్పారు. ఎన్టీఆర్ కమిషనరేట్ పరిధిలో అమలు చేస్తున్న 'సురక్ష 360 డిగ్రీ కార్యక్రమం'లో ప్రజల్ని భాగస్వాములను చేయాలని వారు కూడా స్వచ్ఛందంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకొచ్చేలా చూడాలని చెప్పారు. ఏయే జిల్లాల్లో ఏ తరహా నేరాలు జరుగుతున్నాయో సవివరంగా విశ్లేషణలు తయారు చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

# మాజీ మంత్రి జోగి రమేష్ అరెస్టు

>> అనుచరులను వైసిపి నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి విజయవాడ వైపు తరలించారు.

**డంపింగ్ యార్డ్ టెండర్లలో అక్రమాలు:జోగి రమేష్:** మైలవరం నియోజకవర్గం ఇబ్రహీంపట్నంలోని ఫ్లయాష్ (బూడిద) డంపింగ్ యార్డ్ టెండర్లలో అక్రమాలు జరిగాయని మాజీ మంత్రి జోగి రమేష్ ఆరోపించారు. ఈ డంపింగ్ యార్డు వల్ల పరిసర ప్రాంతాలు మొత్తం కాలుష్యం అవుతాయని అన్నారు.నేడు ఆయన ఆ బూడిద డంపింగ్ యార్డు సందర్శనకు వెళ్తుండగా పోలీసులు అరెస్ట్ చేసిన పోలీసు స్టేషన్‌కి తరలించారు. మధ్యాహ్నం భవానీ పురం పోలీస్ స్టేషన్ నుంచి ఆయన విడుదల అయ్యారు. ఈ సందర్భంగా జోగి రమేష్ మీడియాతో మాట్లాడుతూ.. వీటీపీఎస్‌లో ఫ్లయాష్ టెండర్లు రద్దు చేయాలని, అక్రమంగా బూడిద నిల్వ చేసి హైదరాబాద్‌కి తరలించే ప్రక్రియను నిలిపివేయాలని మాజీ మంత్రి జోగి రమేష్ డిమాండ్ చేశారు. ఈ బూడిద డంపింగ్ యార్డు వల్ల ఇబ్రహీంపట్నం పరిసరాల్లోని గ్రామాల్లో నీరు, గాలి కాలుష్యం బారిన పడే అవకాశం ఉంది. గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు పూర్తిగా దెబ్బ తింటాయి. కాలుష్యం నుంచి సురక్షితంగా ఉండాలంటే చెట్లను పెంచాలి. తక్షణమే అక్రమ డంపింగ్ ను స్వాధీనం చేసుకోకపోతే మా పోరాటం కొనసాగిస్తాం అని ఆయన హెచ్చరించారు. లోకల్ లారీ ఓనర్స్ ను ఆదుకునే విధంగా టెండర్లు రద్దు చేసే వరకు పోరాటం చేస్తామన్నారు. అలాగే, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పై కఠినచర్యలు తీసుకోవాలని అధికారులకు చెబితే మమ్మల్ని అరెస్ట్ చేస్తున్నారని జోగి రమేష్ మండిపడ్డారు.

# దరఖాస్తుల సమయంలో ఐచ్ఛికాన్ని అడగటం సరికాదు

## డీఎస్సీపై సింగిల్ జడ్జికి హైకోర్టు ధర్మాసనం సూచన

**విజయవాడ,సెప్టెంబరు 17,ప్రభాతవార్త ప్రతినిధి:** డీఎస్సీ దరఖాస్తు దాఖలు సమయంలోనే అభ్యర్థుల నుంచి పోస్టుల ప్రాధాన్యం(ప్రిఫరెన్స్) ఐచ్ఛికాన్ని కోరడం సరికాదని హైకోర్టు ధర్మాసనం అభిప్రాయపడింది. సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్‌జీటీ),స్కూల్ అసిస్టెంట్(ఎస్‌ఏ) పోస్టుల భర్తీ విషయంలో మెరిట్ లిస్ట్ తయారీ అనంతరం అభ్యర్థుల నుంచి ఐచ్ఛికాలు కోరి ఉండాల్సిందని పేర్కొంది. ప్రస్తుతం ఈ వ్యవహారం సింగిల్ జడ్జి వద్ద పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో ఇరుపక్షదల వాదనలూ విని 4 వారాల్లో ఈ అంశాన్ని తేల్చాలని పేర్కొంది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్,జస్టిస్ హరిహరనాథ్ శర్మతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

# మోడీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సీఎం చంద్రబాబు

**విజయవాడ,సెప్టెంబరు 17,ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రధాని నరేంద్రమోడీ 75వ పుట్టినరోజు సందర్భంగా ఏపీ సిఎం చంద్రబాబు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. సరైన సమయంలో సరైన నాయకుడు దొరకడం మన అదృష్టమన్నారు. నిబద్ధత,ధృఢ సంకల్పంతో దేశాన్ని నడిపిస్తున్నారని చంద్రబాబు కొనియాడారు. 'సబ్ కా సాథ్,సబ్ కా వికాస్' ఆయన చేపట్టిన సాహసోపేతమైన సంస్కరణ అని పేర్కొన్నారు. ప్రజలు,దేశ శ్రేయస్సు పట్ల మోడీకి ఉన్న నిబద్ధత ఎంతో మంది జీవితాలను ప్రభావితం చేసిందన్నారు. ఆరోగ్యం,అపరిమిత శక్తితో దేశానికి మరింత సేవ చేయాలని కోరుకుంటున్నట్లు చంద్రబాబు పేర్కొన్నారు.

# సోషల్ మీడియాలో కించపరిచే పోస్టులపై మంత్రి వర్గ ఉప సంఘం ఏర్పాటు

**విజయవాడ,సెప్టెంబరు 17,ప్రభాతవార్త ప్రతినిధి:**సోషల్ మీడియాలో పనికివచ్చే సమాచారం ఉన్నా కొందరిని టార్గెట్ చేస్తూ వ్యక్తిగతంగా దూషిస్తూ పోస్టులు పెట్టడం, వాటిని వైరల్ చేయడంతో చాలా మంది ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. ఇక,మహిళలు అని కూడా చూడకుండా అసభ్యపదజాలంతో పెట్టే కొన్నిపోస్టులు, వాటితో పాటు వారి కుటుంబాలను కూడా తీవ్రంగా కలిచివేస్తున్నాయి. ఇక,కొన్ని వీడియోలు పెట్టి వైరల్ చేయడంతో అది నిజమా? అబద్ధమా? అని తెలుసుకోవడానికి తలలు పట్టుకోవాల్సిన పరిస్థితి. దీనిపై సీరియస్‌గా దృష్టిపెట్టింది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సోషల్ మీడియాలో మహిళలను కించపర్చే పోస్టులపై ప్రభుత్వం మంత్రి వర్గ ఉపసంఘం ఏర్పాటు చేసింది..దీనిపై ఒకటి,రెండు రోజుల్లో అధికారికంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయమంది...సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు,మహిళలను కించపర్చే ప్రచారాలపై మంత్రి వర్గ ఉపసంఘం అధ్యయనం చేయనుంది .,శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం ఈ బిల్లు ప్రవేశపెట్టనుంది.

## వారం - వర్జ్యం

18-09-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, కృష్ణపక్షం
ద్వాదశి రా.11.27,
పుష్యమి ఉ.6.32
వర్జ్యం : రా.7.38-9.16
దు.ఉ.10.01-10.50, 2)మ.2.53-మ.3.42
శుభసమయం: ఉ.6.30-7.30
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం :** రాబోయే కాలములో చెల్లించవలసిన ధనమును గూర్చి, ఇప్పుడే ఘర్షణ పడవద్దు.

**వృషభం:** ఆర్థిక విషయములలో నిజముగా సహాయపడే వారెవరో మీరు గ్రహించగలుగుతారు.

**మిథునం:**మీలోని వ్యక్తిగత ప్రతిభ, మంచి తనమును కార్యాలయములోని ఉన్నతాధికారుల గుర్తింపునకు నోచుకుంటాయి.

**కర్కాటకం :** దూర ప్రాంతాలలోని ఆత్మీయుల క్షేమ సమాచారం ఆనందం కలిగిస్తుంది.

**సింహం:**మిత్రవర్గంతో కలిసి చర్చలు సాగిస్తారు. చేపట్టిన కార్యక్రమాలు సకాలంలో పూర్తిచేసారు.

**కన్య :** మాటల చాతుర్యంతో ఎంతటి వారినైనా ఆకట్టుకుంటారు. ఆర్థిక లావాదేవీలు లాభిస్తాయి.

**తుల :** సన్నిహితుల సహాయంతో ముందుకు సాగుతారు. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**వృశ్చికం:** మీ తొందరపాటు మాటల వల్ల మిత్రులతో శతృత్వం ఏర్పడుతుంది.

**ధనుస్సు:** ముఖ్యులతో పరిచయాలు ఏర్పడతాయి. కొత్తపెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు.

**మకరం:** ప్రయాణాలు లాభిస్తాయి. సంతానం వలన మానసిక శాంతి గోచరిస్తోంది.

**కుంభం:**వివిధ సమాచార సాధనములను వినియోగించు కొని తగిన ప్రయోజనాలను విజయాలను సాధిస్తారు.

**మీనం :** ఉద్యోగ, ఉన్నతావకాశములు లభిస్తాయి. రాజకీయ అధికార ప్రాప్తి సూచనలు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మిథున్ రెడ్డిని కస్టడీకి అప్పగించాలంటూ ఎసిబి కోర్టులో సిట్ పిటిషన్

**విజయవాడ,సెప్టెంబరు 17,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన మద్యం కుంభకోణం కేసులో ఏ4 నిందితుడు ఎంపీ మిథున్ రెడ్డిని కస్టడీకి అప్పగించాలంటూ బుధవారం కోర్టులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో విచారించేందుకు ఎంపీ మిథున్ రెడ్డిని తమకు ఐదు రోజులపాటు అప్పగించాలంటూ సిట్ పిటిషన్ దాఖలు చేసింది. అయితే మద్యం కుంభకోణంలో అరెస్టయిన ఎంపీ మిథున్ రెడ్డి ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్నారు.మరోవైపు ఇదే కేసులో నిందితులుగా ఉన్న ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, గోవిందప్ప బాలాజీలకు ఇప్పటికే షరతులతో కూడిన బెయిల్ మంజూరు అయ్యింది. ఇక ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డికి మాత్రం ఇంకా బెయిల్ రాలేదు.

# పవన్ హీరోగా నటించిన ఓజీ సినిమా టికెట్ రేట్లు పెంచుకునేందుకు అనుమతి

**విజయవాడ,సెప్టెంబరు 17,ప్రభాతవార్తప్రతినిధి:** పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన ఓజీ సినిమా టికెట్ రేట్లు పెంచుకునేందుకు అనుమతిస్తూ ఏపీ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కుమార్ విశ్వజిత్ మెమో జారీ చేశారు. ఓజీ సినిమా ఈనెల 25న రిలీజ్ కానున్నది,ఈ క్రమంలో ఓజీ సినిమా బెనిఫిట్ షో ను 25వ తేదీ అర్ధరాత్రి ఒంటి గంటకు రూ.1000 టికెట్ రేట్‌తో ప్రదర్శించుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. సింగిల్ స్క్రీన్ థియేటర్లలో టికెట్ రేట్ రూ. 125 గాను, అలాగే మల్టీప్లెక్స్‌లలో రూ.150 గాను నిర్ధారించారు. ఈనెల 25వ తేదీ నుంచి అక్టోబర్ 4వ తేదీ వరకు ఈ టికెట్ రేట్లు అమల్లో ఉంటాయని వెల్లడించింది.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎ ఎస్ పి

# ఇసుక టిప్పర్‌ను ఢీకొన్న కారు

>> వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అలాగే ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి విషయం తెలుసుకోని మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సంగం మండలం పెరమన సమీపంలో అనేక సార్లు ప్రమాదాలు జరిగి అమాయకులు ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఈప్రాంతంలో హైవే అధికారులు ఏదో ఒక హెచ్చరికలు,జాగ్రత్తలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



## హ్యాపీ బర్త్‌డే మోడీజీ మీ నాయకత్వంలో దేశం అగ్రగామిగా ఉండాలి

### - ప్రధానికి తెలిపిన డిప్యూటీ సిఎం పవన్

**విజయవాడ,సెప్టెంబరు 17,ప్రభాతవార్త ప్రతినిధి:** భారత ప్రధాన మంత్రి నరేంద్రమోడీకి ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సాధారణ స్థితి నుంచి దేశాన్ని నడిపించే నాయకుడిగా ఎదిగిన మోడీ...క్రమశిక్షణ, కట్టుబాటుతో దేశానికి మార్గదర్శకుడిగా నిలి చారని పేర్కొన్నారు. ఇక,ఆత్మ నిర్భార్ భారత్ పేదల పట్ల కరుణ,అణగారిన వర్గాల పట్ల అంకితభావానికి నిదర్శనం అన్నారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యంతో ప్రతి భారతీయుడిని దేశ నిర్మాణంలో భాగస్వామి చేస్తున్నారు. విశ్రాంతి లేకుండా రాత్రింబవళ్లు కష్టపడుతూ ప్రజలతో మమేకమై ప్రధాని మోడీ పని చేస్తున్నారని డిప్యూటీ సిఎం పవన్ చెప్పుకొచ్చారు. ఇక,ప్రపంచ వేదికపై భారతదేశం యొక్క ప్రతిష్టను నిలబెట్టాడు ప్రధాని మోడీ దౌత్యం ఆమోఘమని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. సంప్రదాయం ఆధునికత చేస్తూ గ్లోబల్ సహకారం సాధిస్తున్నారు... ధైర్యం, నిజాయితీ,ఆధ్యాత్మిక శక్తికి నరేంద్రమోడీ నాయకత్వానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు. దేశ ఏకత్వం,పురోగతి,అంతర్జాతీయ స్థాయిలో భారత ప్రతిష్ట కోసం మోడీ అలుపెరగని కృషి చేస్తున్నారని కొనియాడారు. పుట్టినరోజు సందర్భంగా ప్రధాని మోడీ ఆరోగ్యం,దీర్ఘాయుష్షు కలగాలని పవన్‌కళ్యాణ్ ప్రార్థించారు పోలీసులు అలా సున్నితంశాలపై దృష్టి సారించాలని ఎక్స్ వేదికగా మరో ట్వీట్‌లో పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు.అభిమాన హీరోల పేరిట ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలు కుల ఘర్షణలకు దారితీస్తున్నాయి. వాటిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని పోలీసులకు సూచించారు

# దేశాభ్యున్నతికి స్త్రీశక్తి అత్యంత కీలకం

### రాష్ట్రంలో స్వస్త్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్‌ను ప్రారంభించిన గవర్నర్ అబ్దుల్ నజీర్

**విజయవాడ,సెప్టెంబరు 17,ప్రభాతవార్తప్రతినిధి:** ఏ దేశమైనా పరిపూర్ణాభివృద్ధి చెందాలంటే అక్కడ స్త్రీలు ఆరోగ్యవంతులుగా,సాక్షరత కలిగి ఉండాలని గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ అన్నారు.స్త్రీ విద్యావంతురాలైతే ఆ కుటుంబమంతా బాగుపడుతుందన్నారు.,ఆమె ఆరోగ్యంగా ఉంటే మొత్తం వ్యవస్ద ఆరోగ్యంగా ఉంటుందన్నారు. దేశాభ్యున్నతికి స్త్రీ శక్తి అత్యంత కీలకమన్నారు.స్త్రీలు మంచి జ్ఞానవంతులు,ఆలోచనాపరులు,వారు బాగుంటే మొత్తం వ్యవస్ద పటిష్టంగా ఉంటుందన్నారు.భారత ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమం స్వస్త్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ ను ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం ప్రారంభించారు.స్వస్త్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమ ప్రచార పత్రాన్ని ఆవిష్కరించారు.అనంతరం జాతీయ స్ధాయిలో జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ వికసిత్ భారత్ ప్రయాణంలో మహిళలు, యువత, పేదలు, రైతులు మూల స్తంభాలని, వారి సంక్షేమానికి సంబంధించిన పథకాలను జాతికి అంకితం చేస్తూన్నానన్నారు. మన దేశ పురోగమనానికి పునాది స్త్రీ శక్తీ అని, ఒక తల్లి ఆరోగ్యంగా ఉంటేనే ఇల్లు మొత్తం క్షేమంగా ఉంటుందని, అలాంటి తల్లి అనారోగ్యం పాలైతే కుటుంబ వ్యవస్థ మొత్తం కుప్పకూలుతుందని ప్రధాని మోదీ అన్నారు. అందుకే మహిళలకి ఆరోగ్యం,పై అవగాహన కల్పించి బలమైన కుటుంబాన్ని నిర్మించాలనే ఉద్దేశ్యంతో ఈ స్వస్త్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించి దేశంలోని తల్లులకి మరియు సోదరీమణులకు అంకితం చేస్తున్నామన్నారు. అనంతరం ప్రధాని ప్రసంగాన్ని కీలకంగా ప్రస్తావిస్తూ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం,సంక్షేమం కొరకు మొదలుపెట్టిన ఈ స్వస్త్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని వర్చ్యువల్ విధానంలో మధ్యప్రదేశ్‌లోని ధార్ ప్రధాని ప్రారంభించారని వివరించారు. ఇటువంటి ప్రతిష్టాత్మక ప్రచార కార్యక్రమాన్ని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా సెప్టెంబరు 17 నుండి ప్రారంభమయి అక్టోబర్ 2న గాంధీ జయంతి వేడుకలతో ముగియనున్నట్లు వివరించారు. మంచి ఆరోగ్యవంతమైన సమాజం కోసం స్త్రీలకు మంచి పోషకాహారం,విద్యా,వైద్యం అందిద్దామన్నారు. దేశ వ్యాప్తంగా ప్రధాని చేపట్టిన కార్యక్రమాల వల్లన ఏటువంటి వైద్యాన్ని అయినా నియంత్రించే,నివారించే వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు.ఏపీలో తమ ప్రభుత్వం వైద్యరంగానికి అత్యధిక ప్రాధాన్యతను ఇస్తుందన్నారు.క్యాన్సర్ వంటి వ్యాధులను పూర్తిగా నియంత్రించేందుకు అనేక కీలక చర్యలు చేపట్టిందన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా గవర్నర్ అబ్దుల్ నజీర్ వేదిక వద్ద ఏర్పాటు చేసిన మోడల్ హెల్త్‌కేర్ కియోస్క్‌లను సందర్శించి వైద్య నిపుణులు. రోగులతో సంభాషించారు.



## టిటిడిలో దుమారం రేపుతున్న విగ్రహ వివాదం

- మహావిష్ణువు విగ్రహానికి అపచారమంటూ భూమన నిరసన
- శనీశ్వరుని విగ్రహమంటూ బోర్డుసభ్యుల వివరణ

**తిరుమల,సెప్టెంబర్ 17ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మిక సంస్థ తిరుమల తిరుపతిదేవస్థానాన్ని ఇప్పుడు కొన్నేళ్ళ క్రిందట అలిపిరి వద్ద నిర్లక్ష్యంగా పడేసిన విగ్రహం తాజా వివాదానికి దారితీసింది. అలిపిరి లింకుబస్టాండ్ సమీపంలో రోడ్డుపై ఉన్న శ్రీమహావిష్ణువు విగ్రహం నిర్లక్ష్యంగా పడేశారంటూ టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి మంగళవారం అక్కడ పూజలు చేసి, ఆయన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. అయితే అదే సమయంలో టిటిడి బోర్డు సభ్యులు కూడా అదీ శనీశ్వరుని విగ్రహమంటూ, భూమన రాజకీయదిగజారుడు వ్యాఖ్యలకు ఇదో తార్కాణమంటూ ప్రతి స్పందించి వ్యాఖ్యలు చేశారు. ఎప్పుడో రెండు దశాబ్దాల క్రిందట పడేసిన విగ్రహం ఇప్పుడు రాజకీయ వివాదాలకు కారణంగా మారింది. అలిపిరి పాదాలచెంత ఉన్నది మహావిష్ణువు విగ్రహం కాదని, శనీశ్వరుడి విగ్రహమని టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి తెలిపారు. ఆయన అసత్యవ్యాఖ్యలు హిందూ మనోభావాలు దెబ్బతీసేలా ఉన్నాయని, భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయనేది టిటిడి వైపునుండి వ్యాఖ్యలు. ఈ వివాదంపై టిటిడి డిప్యూటీ ఇఒ గోవిందరాజు ఫిర్యాదుతో అలిపిరి పోలీసులు 338/2025 క్రింద కేసు నమోదు చేశారు. బుధవారం అలిపిరి పోలీసులు భూమన కరుణాకర్‌రెడ్డి ఇంటికి వెళ్ళి నోటీసులు అందజేశారు. అయితే అదీ అసలుమహావిష్ణువు విగ్రహం కాదని,అదీ ఇరవైసంవత్సరాల క్రిందట కన్నాచారి అనే శిల్పి చెక్కిన అసంపూర్తి శనీశ్వరస్వామి విగ్రహమని స్పష్టం చేశారు. ఈ విగ్రహాన్ని తయారుచేయమని చెప్పిన వ్యక్తి తరువాత పట్టించుకోకపోవడంతో ఈ అసంపూర్తి విగ్రహాన్ని అలిపిరి లింక్‌బస్టాండ్ సమీపంలో ఉంచారని, దీనికి టిటిడికి ఎలాంటి సంబంధంలేదని తెలిపారు. టిటిడిని అప్రతిష్టపాలు చేయడానికి భూమన కరుణాకర్‌రెడ్డి దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల సమయంలో ఉద్దేశపూర్వకంగా ఇలా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.అయితే తాను టిటిడి చైర్మన్‌గా రెండు సార్లు పనిచేశానని, తనపై ఉద్దేశపూర్వకంగానే కేసు పెట్టారని తెలిపారు. గద,శంఖుచక్రాలు ధరించిన విగ్రహం శనీశ్వరుడి విగ్రహం ఎలా అవుతుందని, అదీ మహావిష్ణువు విగ్రహమేనని ఆయన ప్రధాన అరోపణ, అయితే బుధవారం భూమనకు పోలీసులు 41 ఏ నోటీసులు జారీ చేయడం, నేడు(గురువారం) తిరుపతి డిఎస్పీ కార్యాలయానికి రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. అయితే తాను కొద్దిరోజులు బిజీగా ఉంటానని పోలీసులకు ఆయన వివరణ ఇచ్చారు. వీలు చూసుకుని రావాలంటూ అలిపిరి పోలీసులు సూచించారు. 23వతేదీ వచ్చే మంగళవారం విచారణకు హాజరువుతానని పోలీసులకు భూమన కరుణాకర్‌రెడ్డి స్పష్టం చేసినట్లు తెలిపారు.

## పరిశుభ్రమైన భారతావనే రైల్వే లక్ష్యం

### స్వచ్ఛోత్సవ్ కార్యక్రమంలో డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా



**గుంతకల్లు రైల్వే, సెప్టెంబరు 17,ప్రభాతవార్త** జాతిపిత మహాత్మగాంధీ కలలుగన్న పరిశుభ్రమైన భారతావని సాధించడమే రైల్వే ప్రధాన లక్ష్యమని డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్వచ్ఛభారత్-స్వచ్ఛ రైలు కార్యక్రమం 11వ వార్షికోత్సవం సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ పర్యావరణ పరిరక్షణ గృహ సంరక్ష విభాగం ఆద్వర్యంలో బుధవారం స్థానిక రైల్వే స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన స్వచ్ఛోత్సవ్ కార్యక్రమంలో స్వచ్ఛ రైలు-స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న స్వచ్ఛతాహీసేవ-25 కార్యక్రమం రాయలసీమ జిల్లాలతో పాటు గుంతకల్లు రైల్వే డివిజన్ వ్యాప్తంగా ప్రారంభించామన్నారు. ఈ సందర్భంగా డిఆర్ఎం గుప్తా రైల్వే సిబ్బందిచే స్వచ్ఛతాహీసేవ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం స్టేషన్ ప్రాంగణంలో జరిగిన కార్యాక్రమంలో అదనపు డిఆర్ఎం సుధాకర్, సిఎంఎస్ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి ఆయా విభాగాల ఉన్నతాధికారులు జితేంద్ర కుమార్,మణికుమార్,సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్, రైల్వే ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ మధుసూదన రావు,స్టేషన్ మేనేజర్ మురారి లాల్ మీనా, ఆయా విభాగాలకు చెందిన సీనియర్ సబార్డినేట్లు, అధిక సంఖ్యలో రైల్వే సిబ్బంది, కార్మిక సంఘాల ప్రతినిధులు,రైల్వే ఉన్నత పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17న బుధవారం స్వచ్ఛత అవగాహన, స్వచ్ఛమైన సంభాషణ కార్యక్రమాలను నిర్వహించారు.

## రాజధానికి అసైన్డ్ భూములిచ్చిన రైతులకు ఊరట

**విజయవాడ,సెప్టెంబరు 17,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని కోసం అసైన్డ్ భూములిచ్చిన రైతులకు ఏపీ ప్రభుత్వం ఊరట కల్పించింది.గతంలో అసైన్డ్ భూములను ల్యాండ్ పూలింగ్ ద్వారా సీఆర్డీయే కు ఇచ్చిన వారికి రిటర్నబుల్ ప్లాట్లలో అసైన్డ్ అని పేర్కొన్న ప్రభుత్వం.ఈ మేరకు బుధవారం ల్యాండ్ పూలింగ్ చట్టంలో 9.24 లోని కాలం నంబర్ 7, రూల్ నంబర్ 11 (4) క్లాజ్ ను మారుస్తూ జీవో జారీ చేసిన ప్రభుత్వం.ఇందుకు అనుగుణంగా జీవో నంబర్ 187 ను పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ విడుదల చేసారు.గత జీవో.అసైన్డ్ అని ఉండటంతో తమ ప్లాట్ లు అమ్ముడు పోవడం లేదని ప్రభుత్వానికి రైతులు తెలిపారు..అసైన్డ్ రైతులు ఇచ్చిన భూములకు కూడా రిటర్నబుల్ ప్లాట్ల లో అసైన్డ్ అనే పదం తీసివేసి పట్టా భూమి అని పేర్కొనాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు.ఈ అంశంపై సీఎం చంద్రబాబు నిన్న ముగిసిన కలెక్టర్ల రెండు రోజుల సదస్సులో కీలకంగా ప్రస్తావించారు.చట్టంలో మార్పుకు ఆయన అధికారులకు పలు మార్గదర్శకాలు జారీ చేసారు.ఈ క్రమంలో ల్యాండ్ పూలింగ్ చట్టంలో అసైన్డ్ అనే పదాన్ని తీసివేస్తూజీవో నంబర్ 187 ను పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ విడుదల చేసారు.

## రాష్ట్రంలో పెరుగుతున్న ఎంబిబిఎస్ సీట్లు

**విజయవాడ,సెప్టెంబరు 17,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రం లోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు వైద్య కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్ మొదటి విడత ప్రవేశాలు ముగిసాయి.ఈ క్రమంలో .తాజాగా కొన్ని కళాశాలలకు జాతీయ వైద్య కమీషన్ (ఎన్ఎంసీ)అనుమతిలిస్తోంది. ఇప్పటికే చిత్తూరు జిల్లాలో అన్నా గౌరి ప్రైవేటు వైద్య కళాశాలలో సీట్లను 150 నుంచి 200కు పెంచామని, ఒంగోలు రిమ్స్ వైద్య కళాశాలలో ప్రస్తుతం ఉన్న 120 సీట్లను 150కి పెంచామని, ఒంగోలు రిమ్స్ వైద్య కళాశాలలో ప్రస్తుతం ఉన్న 120 సీట్లను 150కి పెంచామని ఎన్ఎంసీ తాజాగా వెల్లడించింది. రాజమహేంద్రవరం,చినకాకాని ప్రైవేటు వైద్య కళాశాలల్లో 50 సీట్లకు అనుమతులు వస్తున్నాయని ఆయా కళాశాల వర్గాలు చెబుతున్నాయి.

## పారిశుధ్య కార్మికులకు ప్రత్యేక కిట్‌లు

### - పంపిణీ చేసిన మంత్రి రవీంద్ర,మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ హాసీం బేగ్

**విజయవాడ,సెప్టెంబరు 17,ప్రభాతవార్త** మున్సిపల్ కార్పొరేషన్ పారిశుద్ధ కార్మికులకు కొబ్బరినూనె,డిటర్జెంట్ సోప్స్, చెప్పులతో ఉన్న కిట్‌లను మంత్రి కొల్లు రవీంద్రతో పాటు రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ హాసీం బేగ్‌లు తమ చేతుల మీదుగా బుధవారం పంపిణీ చేశారు.అనంతరం 45వ డివిజన్‌లో జైలు డ్రైన్,10వ డివిజన్‌లో జిల్లా కోర్టు సెంటర్‌లో సాయిబాబా గుడి పక్కన కల్వర్టు పనులను ప్రారంభించారు. 16వ డివిజన్‌లోని దత్తాశ్రమం ఎదురు సందులో మెయిన్ డ్రైన్ కల్వర్టులు,రెండు కొత్త సిసి రోడ్ల పనుల్లోను.విశ్వకర్మ జయంతి కార్యక్రమంలోను,22వ డివిజన్‌లోని ట్రావెలర్స్ బంగ్లావద్ద మున్సిపల్ కార్యాలయానికి ప్రహరీ గోడ నిర్మాణ పనులను ప్రారంభించారు.



## సచివాలయంలో పనిచేసే సెక్షన్ ఆఫీసర్లకు అసిస్టెంట్ సెక్రటరీలుగా ప్రమోషన్లు

**విజయవాడ,సెప్టెంబరు 17,ప్రభాత వార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. సచివాలయంలో పనిచేసే 50 మంది సెక్షన్ ఆఫీసర్లకు అసిస్టెంట్ సెక్రటరీలుగా ప్రమోషన్లను ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, 2023లో గత ప్రభుత్వం అనాలోచితంగా ఉత్తర్వులు ఇవ్వడం వల్ల రెండు సంవత్సరాల పాటు ఉద్యోగులకు తీవ్ర ఇబ్బందులు వచ్చాయని ఏపీ ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. గత ప్రభుత్వ తప్పిదాలను సరిదిద్ది ప్రమోషన్లు పునరుద్ధరించినట్టు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ కీలక నిర్ణయం ద్వారా 50 మంది అధికారులకు ప్రమోషన్ వచ్చింది. త్వరలో మరో 100 - 150 మంది అధికారులకు కూడా ప్రమోషన్లకు మార్గం సుగమం అయింది. మొత్తంగా 50 మంది సెక్షన్ ఆఫీసర్లకు అసిస్టెంట్ సెక్రటరీలుగా ప్రమోషన్లను ఇస్తూ.. మరో 150 మంది అధికారులకు ప్రమోషన్ల మార్గాన్ని క్లియర్ చేస్తూ ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయనంద్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు.

## తిరుపతి - చెన్నై సప్తగిరి ఎక్స్‌ప్రెస్ రైలుకు ఎల్‌హెచ్‌బి బోగీలు

**తిరుపతి,సెప్టెంబర్ 17ప్రభాతవార్తప్రతినిధి:** మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా దక్షిణమధ్యరైల్వేశాఖ ప్రయాణీకులకు మరింత సౌకర్యవంతంగా సేవలందించేందుకు చూస్తోంది. తిరుపతి అంతర్జాతీయ స్థాయి రైల్వేస్టేషన్‌గా అభివృద్ధి విస్తరణ జరుగుతున్న సమయంలో ప్రయాణీలకు సేవలు కూడా ధీటుగా అందించాలనే సదుద్దేశ్యంతో తొలిసారిగా తిరుపతి- చెన్నైసెంట్రల్ మధ్య నడిచే సప్తగిరిఎక్స్‌ప్రెస్ రైలుకు ఎల్‌హెచ్‌బీ బోగీలను అమర్చుతున్నారు .ఈ కోచ్‌లు అందుబాటులోకి రావడం తొలిసారిగా కావడంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు అమర్చిన సప్తగిరి ఎక్స్‌ప్రెస్‌రైలు ఈనెల 20వతేదీ నుండిప్రయాణీకులకు అందుబాటులోకి రానుంది. తిరుపతి యాత్రాస్థలం ప్రాధాన్యత దృష్ట్యా ప్రతిరోజూ తిరుపతి నుండి పుత్తూరు, నగరి, తిరుత్తణి, అరక్కోణం మీదుగా చెన్నైకి ప్రయాణీకులు అనూహ్యంగానే ప్రయాణిస్తున్నారు. రోజుకు సరాసరి తిరుపతి నుండి చెన్నైకి వందల సంఖ్యలో పలు రకాల వ్యాపారాలు, ఇతరత్రా ప్రైవేట్ ఉద్యోగాలు, ఇంజనీరింగ్ కళాశాలల్లో చదువుకునే విద్యార్థులు ప్రయాణీస్తున్నారు. ఇక చెన్నై నుండి తిరుపతికి వచ్చే ఈ రైల్లో యాత్రికులు కూడా రద్దీగానే ఉంటారు. రోజుకు రెండుసార్లు తిరిగే ఈ రైలును ఇప్పుడు అధునాతనంగా అన్ని హంగులతో బోగీలు మార్పు చేస్తున్నారు. సప్తగిరిఎక్స్‌ప్రెస్ రైలు 16053/16054, 16057/16058 నంబర్లతో ఆధునిక ఎల్‌బిహెచ్ కోచ్‌లతో నడుస్తాయి. ఈ కోచ్‌లకు మారిన తరువాత రైళ్ళ కూర్పులో మార్పులు ఉంటాయి. ఇందులో ఒక ఏసి ఛైర్‌కోచ్, 10 ఛైర్‌కార్‌కోచ్‌లు,4 జనరల్ సెకండ్‌క్లాస్ కోచ్‌లు ఉంటాయి. అదనంగా దివ్యాంగులకు అనుకూలంగా ఒక సెకండ్‌క్లాస్ కోచ్,ఒక లగేజీ కమ్ బ్రేక్ వ్యాన్ కూడా రైల్లో ఉంటుంది. జర్మనీకి చెందిన సంస్థ డిజైన్‌చేసిన బోగీలు. ఐసిఎఫ్‌తో రూపొందించిన బోగీలకంటే ఈ ఎల్‌హెచ్‌బీ బోగీలు మరింత సౌకర్యవంతంగా ఉంటాయి. గరిష్టంగా 160 కిలోమీటర్ల వేగానికి అనుగుణంగా ఈకోచ్‌లు రూపొందించారు.

# తిరుమల సమాచారం

## ఆన్‌లైన్‌లో డిసెంబర్ నెల ఆర్జితసేవా టికెట్లు

### -22న వర్చువల్ సేవా టిక్కెట్లు - అంగప్రదక్షిణ లక్కీడిప్ విధానంలో 23న శ్రీవాణి టిక్కెట్లు

**తిరుమల,సెప్టెంబర్ 17ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి రోజువారీ,వారాంతపు ఆర్జితసేవలకు సంబంధించి డిసెంబర్‌నెలకోటా టిక్కెట్లు గురువారం ఉదయం నుండి టిటిడి ఆన్‌లైన్‌లో విడుదల చేస్తోంది. ఇందుకు టిటిడి ఐటి విభాగం అన్ని ఏర్పాట్లుచేసింది.శ్రీవాణి ట్రస్ట్ బ్రేక్ దర్శనాల టిక్కెట్ల దర్శన సమయం సాయంత్రం 4.30గంటలకు నిర్ణయించింది. అంగప్రదక్షిణ టోకెన్లు ఆన్‌లైన్ లక్కీడిప్‌లో జారీచేస్తారు .నేడు 18వతేదీ ఉదయం 10గంటలకు ఆన్‌లైన్‌లో ఆర్జితసేవా టిక్కెట్లు విడుదల చేస్తే 20వతేదీ ఉదయం 10గంటల వరకు నమోదు చేసుకోవచ్చు. ఈ టిక్కెట్లు పొందిన భక్తులు 20వతేదీ నుండి 22వతేదీ మధ్యాహ్నాం 12గంటలలోపు సొమ్ముచెల్లించి టిక్కెట్లు మంజూరవుతాయి. 22వ తేదీ ఉదయం 10గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకారసేవల టిక్కెట్లను విడుదల చేయనుంది. 22న ఆన్‌లైన్‌లో వర్చువల్ సేవా టిక్కెట్లను మధ్యాహ్నాం 3గంటలకు విడుదలవుతాయి. శ్రీవాణి టిక్కెట్లు 23న ఉదయం 11గంటలకు, వృద్దులు దివ్యాంగులు దర్శన కోటా ఆగస్ట్ 23న మధ్యాహ్నాం 3గంటలకు విడుదల చేస్తారు. 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శన టిక్కెట్ల కోటా 24న ఉదయం 10గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. గదుల కోటాను మధ్యాహ్నాం 3గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. భక్తులు ఆన్‌లైన్‌లో స్వామివారి దర్శన టిక్కెట్లను "టిటిదేవస్థానమ్స్.ఎపి.జివొవి.ఇన్"వెబ్‌సైట్‌ద్వారా బుక్‌చేసుకోవాలి.

## తిరుమలలో భారీ వర్షం

### - ఆలయం పరిసరాలు జలమయం

**తిరుమల,సెప్టెంబర్17ప్రభాతవార్తప్రతినిధి:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో బుధవారం వేకువజామున నుండి ఉదయం 8గంటల వరకు తిరుమలలో జోరువాన కురిసింది. వేకువజామున 4గంటలనుండి మోస్తరుగా కురిసిన వాన ఆ తరువాత భారీగా పడింది. ఉదయం తిరుమలలో శ్రీవారి దర్శనానికి వచ్చిన ప్రముఖులు, భక్తులు గొడుగులక్రింద సేదదీరారు. అంతేగాక వానలోనే స్వామివారిని దర్శించుకున్నారు. జోరువానతో తిరుమలలో వాతావరణం పూర్తిగా మారిపోయింది. చల్లటిగాలులు వీస్తున్నాయి.

## శ్రీవారి సేవలో సినీప్రముఖులు



**తిరుమల,సెప్టెంబర్ 17ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ శుభాలు కలగాలని వేడుకున్నట్లు సినీప్రముఖులు తెలిపారు. బుధవారం ఉదయం నైవేద్యవిరామసమయంలో మాజీమంత్రి ,సినీనటి ఆర్‌కెరోజా, రవళి, జ్యోతి, సినీ దర్శకుడు చందు మొండేటి, కార్మికశాఖామంత్రి వాసంశెట్టి సుభాష్‌లు వేర్వేరుగా ఆలయంలోనికిచేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు.టిటిడి ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీవారి దర్శనం బాగా జరిగిందని, తిరుమలలో ఏర్పాట్లు బావున్నాయని తెలిపారు.

## ఎస్వీ గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.5లక్షలు విరాళం

**తిరుమల,సెప్టెంబర్ 17ప్రభాత వార్తప్రతి నిధి:** టిటిడి ఎస్వీ గోసంరక్షణట్రస్ట్‌కు దాత విరాళ మందించాడు. బెంగు ళూరుకు చెందిన నందన ఫుడ్స్‌ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎండి ఎం.రవిచంద్ర దాత తరపునప్రతినిధి ఉమాపతి 5లక్షల రూపాయలు డిడిని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు బుధవారం రాత్రి క్యాంపు కార్యాలయంలో అంద జేశాడు.



## ప్రతి ఇంటికి ఒక వ్యాపారి ఉండేలా చేయడం ప్రభుత్వ లక్ష్యం :మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**విజయవాడ, సెప్టెంబర్ 17,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రతి ఇంటికి ఒక వ్యాపారి ఉండేలా చేయడం తమ ప్రభుత్వ లక్ష్యమని ఈ దిశగా బిజినెస్ డెవలప్మెంట్ సర్వీస్ ప్రొవైడర్లు కీలక పాత్ర పోషించాలని ఎంఎస్ఎంఈ మంత్రి శ్రీనివాస్ కొండపల్లి తెలిపారు. ఆయన సురంపల్లి ఏఎల్ఈఏపి ఇండస్ట్రియల్ ఎస్టేట్ లో బుధవారం జరిగిన బిడిఎస్ సర్టిఫికేట్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ, ఎంఎస్ఎంఈలు రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి అవసరమని చెప్పారు. బిడిఎస్ ప్రొవైడర్లు సాంకేతిక సలహాలు, వ్యాపార సలహాలు, మార్కెట్ లింకేజీలు అందించి పారిశ్రామికవేత్తలకు తోడ్పడాలని సూచించారు. ఈ సందర్భంగా 53 మంది బిడిఎస్ ప్రొవైడర్లకు సర్టిఫికెట్లు అందజేశారు. అంతేకాకుండా బిజినెస్ డెవలప్మెంట్ సర్వీస్ ప్రొవైడర్స్ ట్రైనింగ్ మాన్యువల్ ను ఆవిష్కరించారు. ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్మెంట్ కార్పొరేషన్ అమలు సంస్థగా ఏఎల్ఈఏపి తో ఒప్పందం కుదుర్చుకుంది. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ఐదుగురు చొప్పున మొత్తం 1,200 మంది బిడిఎస్ ప్రొవైడర్లను ఎంపిక చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో భాగంగా కుప్పంలో మహిళలకు ప్రత్యేకంగా ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఏర్పాటు చేస్తున్న ఏఎల్ఈఏపి ప్రయత్నాన్ని మంత్రి ప్రశంసించారు. అదే విధంగా విజయనగరంలో కూడా ఇలాంటి ఎస్టేట్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీ సర్ప్ సీఈఓ వి.కరుణ, ఏఎల్ఈఏపి అధ్యక్షురాలు రమా దేవి కన్నెగంటి, స్కిల్ డెవలప్మెంట్ సెల్ వైస్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్ప్ - ఏఎల్ఈఏపి మధ్య ఒప్పందం కుదిరింది. దీని ద్వారా గ్రామీణ పారిశ్రామికవేత్తలు, స్వయంసహాయక సంఘాలకు సాంకేతిక జ్ఞానం, శిక్షణ, వ్యాపార సంబంధాలు లభిస్తాయి.



బీడీఎస్ పత్రాలను ప్రయోజనదారులకు అందజేస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

## మద్యం కుంభకోణం కేసులో దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి!

### - అనుబంధ అభియోగపత్రంలో వైకాంగ్రెస్ ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి పేరు!

**విజయవాడ,సెప్టెంబరు 17,ప్రభాతవార్త ప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో తాజాగా దర్శి వైకాంగ్రెస్ పార్టీ ఎంఎల్ఏ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పేరు తెరపైకి వచ్చింది. గత ఎన్నికల్లో ఓటర్లకు పంపిణీ చేసేందుకు మద్యం ముడుపుల సొమ్మును ఆయనకు అందచేసినట్లు సిట్ దర్యాప్తులో తేలింది. దీంతో తాజాగా దాఖలు చేసిన రెండో అనుబంధ అభియోగపత్రంలో శివప్రసాద్‌రెడ్డి పేరు ప్రస్తావించింది. గతేడాది మే 13న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జరగ్గా,కొద్దిరోజుల ముందు అంటే ఏప్రిల్ 21,22 తేదీల్లో చెవిరెడ్డి భాస్కరరెడ్డి,బాలాజీకుమార్ యాదవ్ ప్రకాశం జిల్లా పొదిలిలో ఉన్నట్లు సిట్ అభియోగపత్రంలో పేర్కొంది. అదే సమయంలో బాలాజీకుమార్ యాదవ్...శివప్రసాద్‌రెడ్డితో పలుమార్లు ఫోన్‌కాల్స్ మాట్లాడారని వెల్లడించింది. చిత్తూరు,ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధి లోని పలువురు వైకాపా అభ్యర్థులకు ఎన్నికల ఖర్చుల నిమిత్తం మద్యం ముడుపుల సొమ్ము చేరవేతంతా చెవిరెడ్డి నేతృత్వంలోని సాగిందని సిట్ ఇప్పటికే ఆధారాలతో తేల్చింది.

ఈ క్రమం లోనే శివప్రసాద్‌రెడ్డికి మద్యం ముడుపుల సొమ్ము అందించినట్లు సిట్ గుర్తించింది.


వార్త

మీ ప్రతిమాటనూ, ప్రవర్తనా పొగిడేవారి గురించి పట్టించుకోకూడదు. మీ పొరపాట్లను హెచ్చరించే వారి గురించి ఆలోచించాలి.

-డబ్ల్యు ఎమర్సన్

# వలసల బెడద !

ప్రపంచంలోని ఎన్నో దేశాల ప్రజలు ఇతర దేశాలకు బ్రతుకు తెరువు కోసం వలస వెళ్తున్నారు. కొన్ని దేశాలు కరవుతో అల్లాడుతుంటే మరికొన్ని దేశాలు యుద్ధ జ్వాలల్లో చిక్కుకునినిలువ నీడ, ఆకలి దప్పులు తీరే దారిలేక శరణార్థులుగా ఇతర ప్రత్యామ్నాయ ప్రాంతాలను ఎంచుకుంటున్నాయి. నిన్నగాక మొన్న బ్రిటన్ ప్రజలు తమ దేశంలోకి వస్తున్న వలసదారుల సంఖ్య పెరిగిపోయిందన్న ఆందోళనతో తమ దేశాన్ని తమకే వదిలేయాలన్న డిమాండ్‌తో వీధులకెక్కారు. నియంత్రణ లేని వలసలతో బ్రిటన్ వేగంగా పతనమైపోతోందంటూ ప్రపంచ కుబేరుడు ఎలాన్‌మాస్క్ కూడా ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయవాద నేత టామీ రాబిన్సన్ నేతృత్వంలో లక్ష మందికిపైగా నిరసనకారులు యుకె జాతీయ జెండాలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆందోళనకారులు పాలస్తీనా, ఇస్లామిక్ స్టేట్ జెండాలను చించి నిరసన ప్రకటించారు. రాబిన్సన్ బృందాన్ని జాత్యహంకారులుగా చిత్రీకరించి ఒక రకంగా అంతర్యుద్ధాన్నే తలపించారు. ఆఫ్రికా, మధ్య ప్రాచ్య దేశాల నుంచి వలసల ద్వారా వచ్చే శరణార్థుల సంఖ్య పెరిగిపోతోందని, వారిలో నేర స్వభావం ప్రబలుతోందని బ్రిటన్ వాసుల ఆరోపణ. యు.కెలో ప్రస్తుతం 2024 నాటికి 5 లక్షల మందికిపైగా శరణార్థులు ఆశ్రయం పొందుతున్నారు. చట్ట విరుద్ధంగా అంతకు మించే ఉండొచ్చుననే అంచనా ఉంది. ఇదిలా ఉండగా గతవారం గాజాలో కాల్పుల విరమణ అంశంపై చర్చించేందుకు దోహా సమావేశంలో హమాస్ నేతలపై ఇజ్రాయెల్ విరుచుకుపడింది. ఇది తన ప్రతిపాదన మేరకు జరిగిన సదస్సు అయినా మరోపక్క ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడడంతో అమెరికా ఆగ్రహం వెలిబుచ్చింది. గాజా విషయం ఎంతో తీవ్రతరమైన విషయం. ఆచితూచి స్పందించాల్సి ఉన్నా ఇజ్రాయెల్ దూకుడుకు కళ్లెం వేయడం అమెరికాకు కూడా సాధ్యమయ్యేటట్లు లేదు. గాజాలో పరిస్థితి అతి భయానకంగా ఉంది. పది లక్షల మంది పాలస్తీనియన్లు తలదాచుకుంటున్న నగరం 'గాజా' కాగా ఇజ్రాయెల్ దళాలు వైమానిక దాడులతో ఆకాశహర్మ్యాలను సైతం కూల్చేస్తోంది. భవన శిధిలాల కింద కనిపించేవన్నీ హృదయ విదారకదృశ్యాలే. గాజా సిటీలో తలదాచుకున్న పాలస్తీనీయులు దక్షిణ ప్రాంతంలోని తీర ప్రాంతంవైపు పరుగులు తీస్తున్నారు. తాజా దాడుల్లో వందకుపైగా జనం మృతి చెందారు. గాజాసిటీలో హమాస్ మిలిటెంట్లు ఉండి ఉంటారన్న అనుమానంతో ఇజ్రాయెల్ దళాలు దాడులకు తెగపడుతున్నాయి. ఇజ్రాయెల్‌కు తొలి లక్ష్యం ఎలా ఎంచుకున్నా ప్రస్తుతానికి, హమాస్ మిలిటెంట్లను ఏరిపారేయడమే అత్యవసరంగా భావిస్తోంది. గాజా సిటీని ఖాళీ చేయాలని ఇజ్రాయెల్ రక్షణ దళం ఆదేశించింది. ఉన్నట్టుండి కట్టుబట్టలతో ప్రాణాలరచేత పట్టుకుని దాదాపు 3.5 లక్షల మంది ఖాళీ చేసి వెళ్లిపోయారు. సోమవారం నాడు దాదాపు 2 లక్షల మందికిపైగా ఖాళీ చేసేశారు. ఒకే రోజు అంత మంది ఆ ప్రాంతం నుంచి భయానక వాతావరణంలో ఖాళీ చేయడమంటే విధివిలాసం అలాంటిది. ఇలాంటి జాతి విధ్వంస సన్నివేశాలపై ఐక్యరాజ్యసమితి నోరు మెదపలేని పరిస్థితి ఉంది. గాజాలో ఇజ్రాయెల్ మారణహోమం సృష్టిస్తున్న విషయం ఐక్యరాజ్యసమితికి తెలిసినా సమస్త జాతి జనులకు రక్షణనిచ్చి భరోసా కల్పించాల్సిన సమితి నివ్వెరపోయి చూస్తోంది. కనీసం ఒక విజ్ఞాపన కూడా లేదు. ఇజ్రాయెల్ దాడులు కేవలం ఒక ప్రాంతానికే పరిమితం కాలేదు. యమెన్‌లోని తీర ప్రాంత పట్టణం హోడైడాపై కూడా తీవ్రస్థాయిలో దాడులు చేసింది. కాగా ఇరాన్ మద్దతుతో ఇజ్రాయెల్ దళాలతో తలపడుతున్న హోతీ రెబల్స్ కూడా తమ గగనతల రక్షణ వ్యవస్థను సంరక్షించుకున్నట్లు ప్రకటించాయి. వారం రోజుల క్రితం ఇజ్రాయెల్ దాడులో 31మంది మృతిచెందారు. ఇలా ఒకరిపై ఒకరు లక్ష్యంగా చేసుకుని జరుపుకుంటున్న దాడులను నిలువరించే ప్రక్రియలో జననష్టం గురించి చెప్పుకోవడమే మిగిలింది. అమెరికా ఎన్నివార్నింగ్‌లు ఇచ్చినా, ఆదేశానికి మిత్రదేశంగా వ్యవహరిస్తున్నా ఇజ్రాయెల్ స్పందించకపోవడం ట్రంప్‌కు కోపం తెప్పిస్తుందో లేదో కానీ 'గాజా' విధ్వంసాన్ని చూపిస్తోంది. ఇలా దేశాల మధ్య పెచ్చరిల్లుతున్న ద్వేషవిద్వేషాలను తగ్గించేందుకు ప్రపంచ దేశాలు కృషి అవసరం ఎంతో ఉంది. ఎడాపెడా 'గాజా తగలపడుతోం'దంటూ ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ ఆనందానికి అవధుల్లేవు. హమాస్ ప్రతిపాదించినట్లు కాల్పుల విరమణకు సుతరామూ ఇజ్రాయెల్‌కు ఇష్టం లేదు. అందుకే గాజా రావణకాష్టంలా మానవ హక్కుల ఉల్లంఘన తీవ్రంగా ఉందని గుర్తించినా ఐక్యరాజ్యసమితి ఇజ్రాయెల్‌ను ఏమాత్రం చెప్పుచేతుల్లోకి తీసుకోలేకపోతోంది. తమ దేశానికి వలస వచ్చిన వారిని బయటకు పంపేయాలని కొన్ని దేశస్థులు భావిస్తోంటే ఉన్న ప్రాంతంలో దుష్కృత్యాలు, దురాగతాలను బీషణ హెచ్చరికలను భరించలేక వలసవెళ్లి పోయేందుకు ఆఘమేఘాల మీద పరుగులు పెడుతున్న జనం మరొకవైపు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఉదంతాలు చూస్తూ మౌనముద్ర వేసుకోవడం ఐక్యరాజ్యసమితికి తగని పని! ఇజ్రాయెల్ అమానుష చర్యలకు వ్యతిరేకంగా కలిసికట్టుగా వ్యవహరించేందుకే ఖతార్ రాజధాని దోహాలో అరబ్, ముస్లిం దేశాల నేతల సమావేశం కూడా ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేకపోయింది. ఇజ్రాయెల్ హమాస్‌ల మధ్య యుద్ధాన్ని దౌత్యపర ఒత్తిడిల ద్వారా ముగించేలా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. కానీ ఎప్పటికప్పుడు తాత్కాలిక ఉపశమనాలను ఏ దేశమూ కాంక్షించడం లేదు.



మన శక్తియుక్తుల్ని మానవ కళ్యాణానికి వినియోగించాలి. వినాశనానికి కాదు.

షేక్‌స్పియర్



విజయమే అంతిమ లక్ష్యమూ కాదు. అపజయం మరణమూ కాదు. రెండింటి కంటే ముఖ్యమైంది ధైర్యం.

లావోసు

# అగ్రదేశాలు అమెరికాను నియంత్రిస్తాయా?

ఆర్థికాభివృద్ధిలో ప్రముఖస్థానంతోపాటు జనాభాలో ప్రథమ స్థానం వహించటంతో ప్రపంచ దేశాలే భారత్ 'గ్రేట్ పవర్' దిశగా పరుగులెత్తుతున్నదని వ్యాఖ్యానించాయి. చైనా పహల్గాం ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో తన పంథా భారత్ పట్ల మార్చుకుంటున్న సంకేతాలు బహిరంగ పర్చ టంతో, చైనా, భారత్‌తో ఉన్న ఘర్షణా విధానాన్ని పక్కన పెట్టి స్నేహపూరిత వాతావరణాన్ని అభిలషిస్తున్నదని తేట తెల్లమయింది. రష్యా,చైనా, అమెరికా దుందుడుకు ప్రవర్తన నేపథ్యంలో నిర్దిష్టమైన విధానాన్ని అమెరికాను నియంత్రించే దిశగా తీసుకోబోతున్న సూచనలు కనపడుతున్నాయి. ఇజ్రా యిల్, ఉక్రెయిన్‌లను పావులుగా అమెరికా వాడుకొని వాణిజ్య పరంగా లాభపడాలని ప్రయత్నిస్తూ రాజకీయం చేస్తున్నది. ప్రస్తుతం అగ్రదేశాలు రంగంలోకి దిగి ఈ ఘర్షణలన్నిటికీ పరిష్కారాలు కనుగొన్నా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. దేశాల మధ్య ఎప్పుడు ఏం జరుగుతుం దో, ఎవరు ఎవరితో కలిసి ఉంటారో చెప్పటం కష్టం. భారత్, రష్యా, చైనాల మధ్య తాత్కాలికంగా ఏర్పడ్డ కలయిక వల్ల అంతర్జాతీయంగా ఎలాంటి మార్పులు సంభవి స్తాయో భవిష్యత్తు మాత్రమే నిర్ణయించగలదు.



రావులపాటి సీతారాం రావు

బంగ్లాదేశ్ తర్వాత నేపాల్ దేశం స్వపరిపాలన విషయంలో పిల్లి మొగ్గలు వేయటంతో ప్రధాని మార్పుతప్పనిసరి అయింది. ఆసియా దేశాలను పట్టి పీడిస్తున్న సమస్య అవినీతి. ఏ రకమైన పాలనను ప్రజలు ఆదేశాల్లో ఆశ్రయిస్తున్నారన్నది ముఖ్యం కాదు. ఎలాంటి పాలనను అవలంబించినా నాయకులు అధికారంలో ఉండటం మూణ్నాళ్ల ముచ్చటగానే మారుతున్నది. దానికి కారణాలు పెద్దగా శోధించాల్సిన అవసరం లేదు. ప్రధానంగా చెప్పుకోవాల్సింది మౌలికంగా రాజ్యాంగ విధానంలో సరిచేయలేని తప్పులు ఉండటం వల్లనే. పాకిస్థాన్‌తోసహా ఈ మధ్యకాలంలో భారత్ సరిహద్దు దేశాలలో విచ్చలవిడిగా అవినీతి పెచ్చరిల్లటంపెద్ద సమస్యగా మారింది. అవినీతితోపాటు యువత నిరుద్యోగ సమస్య ఈ దేశాల్లో విలయతాండవం చేస్తున్నది. ఒక దేశం బాగుండాలంటే వ్యవసాయంతోపాటు పరిశ్రమలూ ఉద్యోగాలూ వృద్ధి మార్గంలో ఉంటేనే చిన్నచిన్న సమస్యలే పరిష్కారానికి ఉంటాయి కానీ అధికారంలోని నాయకులను మార్చే పెద్ద సమస్యలు ఉత్పన్నం కావు. అఫ్ఘనిస్థాన్‌ను వెంటాడుతున్నది తాలిబన్ సమస్య. పాకిస్థాన్‌ను అతలాకుతలం చేస్తున్నది వికృత రాజకీయ క్రీడతోపాటు అణిచివేయలేని ఉగ్రవాద సమస్య శ్రీలంక, నేపాల్ దేశాలలో రాజరికాలు పోయి కమ్యూనిస్టుల సారధ్యం దిశగా నాయకత్వం, అదుపులేని పాలనతో బోల్తాపడక తప్పని పరిస్థితి. ఈ దేశాలలో కేవలం అంతర్గత సమస్యలే ప్రభుత్వాల పతనానికి, అస్థిరత్వానికి కారణంగా భావిస్తే పొరబడినట్లే. అగ్రరాజ్యాలు ముఖ్యంగా చైనా, అమెరికా లాంటి దేశాలు వీలున్నప్పుడల్లా మాయమాటలతో, ఆర్థిక సహాయంతో అధికారంలో ఉన్న నాయకులనూ, పార్టీలను వశపర్చుకొని కొద్ది కాలంలోనే దాదాపు వలస రాజ్యాలుగా మార్చుకోవటంలో విజయాన్ని సాధిస్తున్నాయి. ప్రజాబలం, విలువలు లేని పార్టీలు కొన్నాళ్ల వరకే అధికారాన్ని హస్తగతం చేసుకోగలవు. పోనీ ఆ కొన్నాళ్లయినా సుపరిపాలనను ప్రజలకు అందించగలిగితే ప్రజలే ప్రభుత్వాలను కాపాడుకోగలవు. బహు నాయకత్వం, బలహీన నాయకత్వం అధికారంలో కొనసాగటం కష్టం. అందుకే ఆర్మీ పాలన తప్పనిసరి అవుతున్నది. ఆర్మీ వల్ల ప్రజాస్వామ్య పాలనకు దాదాపు చోటు లేకుండాపోతున్నది. పాకిస్థాన్ భారతదేశం నుంచి విడిపోయిన తర్వాత ఏనాడూ భారత్‌తో స్నేహం దృఢతరం చేసుకోటానికి ప్రయత్నించలేదు. సాలినా వైరం పగతో మొదలై పగతోనే జీవిస్తుందన్న నానుడి పాకిస్థాన్ విషయంలో నూటికి నూరుపాళ్లు నిజం అయింది. కాశ్మీర్ సమస్యను తెరమీదికి తెచ్చి, చైనాకు జోహుకుం అనే విధాంగా లొంగిపోయి, ప్రజల అభివృద్ధిని పట్టించుకోకుండా భారత్‌తో తలపడటమే తమ ధ్యేయంగా ప్రతి ప్రభుత్వమూ పాకిస్థాన్‌లా వ్యవహరించడంతో ఆర్మీ అధికారాన్ని అప్పుడప్పుడూ ఒప్పచెప్పక తప్పడంలేదు. భారత్ సత్సంబంధాలకోసం ఎంతగా కృషి చేసినా ఫలితం శూన్యం! అక్కడి అధినేతలు వివక్ష చూపినందుకు ఈస్ట్ పాకిస్థాన్, బంగ్లాదేశ్‌గా విడిపోయిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం బెలూచిస్థాన్ కూడా ఆ మార్గంలోనే పయనిస్తుండటం దురదృష్టకరం. పాకిస్థాన్ ఇతర దేశాలతో శత్రుత్వం పెంచుకోవాలని ఎవరూ అభిలషించరు.



అంతేగాదు చైనాతో వాణిజ్యపరంగా, మరో విధంగా దగ్గరకావటం ఎవరూ కాదనరు. కానీ పాలనను గాలికొదిలేసి ప్రజలను అధోగతిపాలు చేసి, అన్ని విధాలా అసమర్థపాలనతో ప్రజల జీవితాలతో ఆడుకోవటం, ఉగ్రవాదాన్ని, తాలిబన్లను ప్రోత్సహించడం వల్లనే ప్రజలు అతలాకుతల పరిస్థితులను ఎదుర్కోక తప్పటంలేదు. పాకిస్థాన్ ప్రజలు సర్వతోముఖాభివృద్ధిని సాధిస్తున్న భారత దేశంతో, భారత ప్రజలతో స్నేహాన్ని హృదయపూర్వకంగా అభిలషిస్తున్నారని ఆ మధ్యకాలంలో ప్రధాని వాజ్‌పాయ్ ఆ దేశానికి బస్సు ప్రయాణాన్ని పునరుద్ధరించినప్పుడు నిర్ధారణ అయింది. దురదృష్టవశాత్తు వారి పాలకుల ఆలోచనా వైఖరి భిన్నంగా ఉండటంతో రెండు దేశాలూ విభిన్న మార్గాలలో పయనించక తప్పటం లేదు. పహల్గాం ఘటన పాకిస్థాన్‌లోని ప్రజల దృష్టిమళ్లించడానికి చేసిన విఫల ప్రయత్నంగా భావించక తప్పదు. ఈ సంఘటన ఒక విధంగా భారత్ ఎంత బలమైన దేశంగా మారిందో ప్రపంచదేశాలకు చెప్పటానికి ఉపయోగపడింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆడిన నాటకాలు ప్రపంచ దృష్టిలో పడ్డాయి. ట్రంప్ తన దేశాభివృద్ధి కోసం తగు చర్యలు తలపెట్టడంలో తప్పులేదు కాని టారిఫ్‌ను ఆయుధంగా మల్చి భారత్ లాంటి దేశాలను ఇబ్బంది పెట్టడం ప్రపంచ దేశాలు హర్షించటం లేదు. రష్యా, చైనాలు కూడా అమెరికా ద్వంద్వ ప్రమాణాలనూ, కుటిల వైఖరిని గుర్తించడం వల్లనే టియాన్‌జిన్ సమ్మిట్(ఎస్.సి.ఓ) భారత్‌తోసహా మూడు అగ్రదేశాల కలయికగా తీర్చిదిద్దింది. అమెరికా అత్యుత్సాహానికి ఆ సదస్సు నీళ్లుజల్లింది. పాకిస్థాన్ ఇప్పటికైనా భారత్ నిజాయితీని గుర్తించి తమ దేశాభివృద్ధికి తోడ్పాటును అందుకుంటే రెండు దేశాలూ పురోగతిని బహుళ రీతిలో సాధించగలవు. పొరుగు దేశాలు అయిన శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్, అఫ్ఘనిస్థాన్ ఒక తాటిపైకి వచ్చి అంతర్గత సమస్యను పరిష్కరించుకొనే దిశగా పయనించాల్సిన సమయం ఆసన్నమైంది. ఎంత త్వరగా ఈ పరిస్థితిని ఈ దేశాలు గుర్తించగలుగుతే అంత త్వరగా ఆ దేశాల ప్రజలకు మేలు చేసినవారవుతారు. రష్యా, భారత్ లాంటి దేశాలు కూడా అరమరికలు లేకుండా సహాయ సహకారాలు అందించగలవు. చైనా కూడా పరిస్థితులను ఆకళింపు చేసుకొని సమయానుకూలంగా వ్యవహరించే అవకాశం ఉంది. ఈ మధ్యన కొన్ని విదేశీ పత్రికలు పనిగట్టుకొని భారత్‌కు వ్యతిరేకంగా కథలు అల్లుతున్నాయి. భారత్ ప్రాముఖ్యతను తగ్గించే విధానంలో భాగంగా బహుశా అమెరికా వెనక ఉండి నడిపిస్తుండొచ్చని కొందరివిజ్ఞుల అభిప్రాయం కూడా! 'ఫారిన్ అఫైర్స్' పేరిట వచ్చిన ఒక కథనంలో భారత్ గ్రేట్ పవర్'గా తనను తాను ఊహించుకొని చైనా, రష్యాలతో సమంగా ఉండే ప్రయత్నం చేస్తున్నదని విపరీతపోకడలతో వచ్చిన ఒక అర్థంపర్థం లేని కథనం విశ్లేషకులు ముక్కున వేలేసుకొనే విధంగా వెలువడింది. అమెరికా, చైనాలతో భారత్ ఈ 'గ్రేట్ పవర్' రేస్‌లో లేనేలేదన్న అభిప్రాయాన్ని కూడా హైలైట్ చేసింది. 'బిగ్ పవర్'నని భారత్ ఎన్నడూ చెప్పుకోలేదు. ఆర్థికాభివృద్ధిలో ప్రముఖస్థానంతోపాటు జనాభాలో ప్రథమ స్థానం వహించటంతో ప్రపంచ దేశాలే భారత్ 'గ్రేట్ పవర్' దిశగా పరుగులెత్తుతున్నదని వ్యాఖ్యానించాయి. చైనా పహల్గాం ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో తన పంథా భారత్ పట్ల మార్చుకుంటున్న సంకేతాలు బహిరంగ పర్చటంతో, చైనా, భారత్‌తో ఉన్న ఘర్షణా విధానాన్ని పక్కన పెట్టి స్నేహపూరిత వాతావరణాన్ని అభిలషిస్తున్నదని తేట తెల్లమయింది. రష్యా,చైనా, అమెరికా దుందుడుకు ప్రవర్తన నేపథ్యంలో నిర్దిష్టమైన విధానాన్ని అమెరికాను నియంత్రించే దిశగా తీసుకోబోతున్న సూచనలు కనపడుతున్నాయి. ఇజ్రాయిల్, ఉక్రెయిన్‌లను పావులుగా అమెరికా వాడుకొని వాణిజ్య పరంగా లాభపడాలని ప్రయత్నిస్తూ రాజకీయం చేస్తున్నది. ప్రస్తుతం అగ్రదేశాలు రంగంలోకి దిగి ఈ ఘర్షణలన్నిటికీ పరిష్కారాలు కనుగొన్నా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. దేశాల మధ్య ఎప్పుడు ఏం జరుగుతుందో, ఎవరు ఎవరితో కలిసి ఉంటారో చెప్పటం కష్టం. భారత్, రష్యా, చైనాల మధ్య తాత్కాలికంగా ఏర్పడ్డ కలయిక వల్ల అంతర్జాతీయంగా ఎలాంటి మార్పులు సంభవిస్తాయో భవిష్యత్తు మాత్రమే నిర్ణయించగలదు. •

# ప్రకృతికి వరం, మానవునికి ఆధారం వెదురు

రామ కిష్టయ్య సంగన భట్ల

ప్రపంచ వెదురు దినోత్సవాన్ని ప్రతిసంవత్సరం సెప్టెంబర్ 18న ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటారు. ఈ రోజును వెదురు ప్రాముఖ్యతను తెలియ జేయడం, దాని వినియోగాన్ని ప్రోత్సహించడం, పర్యావరణ పరిరక్షణలో దాని పాత్రను గుర్తు చేయడం ప్రధాన లక్ష్యంగా ఏర్పాటు చేశారు. 2009లో థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో జరిగిన ఎనిమిదవ ప్రపంచ వెదురు కాంగ్రెస్ సందర్భంగా ప్రపంచ వెదురు సంస్థ దీనిని అధికారికంగా ప్రకటించింది. అప్పటి నుంచి ప్రపంచ దేశాలు, ముఖ్యంగా ఆసియా దేశాలు, ఈ దినోత్సవాన్ని విశేషంగా పాటిస్తున్నాయి. వెదురు ఒక గడ్డి జాతికి చెందినప్పటికీ చెట్లంత ఎత్తుగా పెరిగి మానవ జీవన విధానంలో కీలక పాత్ర పోషిస్తున్నది. దీనిని అద్భుత మొక్క అని, పేదల ఉక్కు అని పిలవడం దాని బహుముఖ వినియోగాల వలన. రోజుకు కొన్ని అడుగుల వరకు పెరిగే వేగవంతమైన పెరుగుదలతో పాటు ఇతర చెట్ల కంటే ఎక్కువ ఆక్సిజన్ విడుదలచేస్తూ వాయు మండలంలో ఉన్న కార్బన్ దయాక్సైడ్‌ను అధికంగా గ్రహించడం ద్వారా పర్యావరణ సమతుల్యతకు విశేష సహాయం చేస్తుంది. భూసారాన్ని కాపాడడం, వరదల ప్రభావాన్ని తగ్గించడం, నేలలో తేమ నిల్వ ఉంచడం వంటి ప్రకృతి సంరక్షణలో కూడా వెదురు ఒక అద్భుతమైన సహజ వనరుగా నిలుస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా వెదురుకు 1200కుపైగా జాతులున్నాయి. వాటిలో సుమారు 136 జాతులు భారతదేశంలోనే లభ్యమవుతున్నాయి. అసోం, త్రిపుర, మణిపూర్, మేఘాలయ, అరుణాచల్ వంటి ఈశాన్య రాష్ట్రాలు వెదురు సమృద్ధిగా పెరిగే ప్రాంతాలుగా గుర్తింపు పొందాయి. నేషనల్ బాంబూ మిషన్ నివేదిక ప్రకారం భారత దేశంలో సుమారు 13.96 మిలియన్ హెక్టార్ల విస్తీర్ణంలో వెదురు పెరుగుతోంది. ఈ విస్తీర్ణంలో సగం కన్నా ఎక్కువ భాగం ఈశాన్య రాష్ట్రాల్లోనే ఉంది. భారతదేశ వెదురు ఉత్పత్తి ప్రపంచ ఉత్పత్తిలో దాదాపు 45 శాతం ఉండటం విశేషం. గ్రామీణ



జీవన విధానంలో వెదురు ఒక అవిభాజ్య భాగంగా నిలుస్తూ ఇళ్ల నిర్మాణం, చిన్న వంతెనలు, నీటి కాల్వలు, మేడలు, బావులు, గోడల కట్టడాలు అన్నీ వెదురుతోనే సాధ్యమవుతున్నాయి. లక్షలాది మంది వడ్రంగులు, బుట్టల కార్మికులు, పూలమాలలు చేసే వృత్తిదారులు, పతంగి తయారీదారులు, నూలు వృత్తి నిపుణులు, వాయిద్య కారులు ఉపాధి కోసం వెదురు పైనే ఆధారపడి ఉన్నారు. కాగితం పరిశ్రమలో వెదురు ముడిసరుకుగా ఉపయోగపడుతుండగా, ఆధునిక కాలంలో ఫర్నిచర్, అంతర్గత అలంకరణ వస్తువులు, ఫ్లోరింగ్, బట్టలు, వంట పాత్రలు, టూత్ బ్రష్‌లు, బొమ్మలు, సంగీత వాయిద్య పరికరాలు వంటి ఎన్నో వస్తువులు కూడా వెదురుతోనే తయారవుతున్నాయి. అంతే కాక వెదురు మొగ్గలు ఆసియా దేశాల్లో ఆహారంగా వినియోగించబడుతూ పోషక విలువలతో కూడిన ప్రత్యేకమైన పదార్థంగా గుర్తింపుపొందాయి. వెదురు పర్యావరణ పరిరక్షణలో అపూర్వ సహాయం చేస్తుంది. భూమి తాపాన్ని తగ్గించడం, గాలి నాణ్యతను మెరుగుపరచడం, వాతావరణ మార్పుల దుష్ప్రభావాలను నియంత్రించడం వంటి అనేక విధాలుగా తోడ్పడుతుంది. మూడేళ్లలోనే పూర్తిగా ఎదిగే వెదురు వేగవంతమైన పచ్చదన విస్తరణకు కారణమవుతుంది. ఈ కారణంగానే పర్యావరణ శాస్త్రవేత్తలు వాతావరణ సంక్షోభానికి వెదురును సమర్థవంతమైన పరిష్కారంగా సూచిస్తున్నారు. గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, చిన్నతరహా పరిశ్రమల విస్తరణలోకూడా వెదురు ఒక కీలకవనరుగా మారింది. ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ సంఘాలు వెదురుతో మరిన్నిపర్యావరణ అనుకూల ఉత్పత్తులు తయారు చేయడానికి, పరిశ్రమలను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నాయి. మొత్తం మీద వెదురు మానవ జీవనవిధానం, పర్యావరణ సమతుల్యత, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, సుస్థిర అభివృద్ధి అన్నీ కలిపిన జీవనాధారమని చెప్పవచ్చు. యుగాలుగా మానవుడి జీవితంలో భాగమైన ఈ ఆకుపచ్చ బంగారాన్ని సంరక్షించడం, విస్తరించడం మన అందరి బాధ్యత. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 18న జరుపుకునే ప్రపంచ వెదురు దినోత్సవం ఈ బాధ్యతను మనకు గుర్తుచేస్తూ పచ్చదనానికి, భవిష్యత్తు తరాల భద్రతకు మనం కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిస్తోంది. •

# జిఎస్‌టి మార్పులు ప్రజా ప్రయోజనకరం!

వి.వి.కె.సురేష్

మన దేశ రైతుల వీరోచితమైన, చారిత్రకమైన పోరాటం వల్లనే కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చి మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేసింది. గత కొన్ని సంవత్సరాలుగా ప్రజల నుండి, వివిధ సంస్థలు, సంఘాల నుండి వ్యక్తమైన గట్టి అభిప్రాయాలు, అభ్యంతరాలకు తలొగ్గి కేంద్ర ప్రభుత్వం జి.ఎస్.టి కౌన్సిల్ తప్పనిసరి పరిస్థితుల్లో వస్తుసేవల పన్నుల్లో మినహాయింపులు, తగ్గింపులు ఇవ్వక తప్పలేదు. మొత్తం నాలుగు శ్లాబుల్లోని 12 శాతం, 28 శాతం శ్లాబులను రద్దు చేసి, 5,18 శాతం శ్లాబులను కొనసాగించారు. వస్తు సేవల పన్ను (జి.ఎస్.టి) అమలు ఎన్.డి.ఏ ప్రభుత్వ హయాంలో జూలై 1, 2017న ప్రారంభమైంది. చాలా హడావిడిగా, ఎటువంటి సవివరమైన చర్చలు చేయకుండా ఆనాడు జి.ఎస్.టి వ్యవస్థను ప్రకటించారు. ప్రతిపక్ష పార్టీలు తీవ్ర అభ్యంతరం తెలియజేశాయి. 'ఒకే దేశం ఒకే పన్ను' అనే నినాదంతో ప్రభుత్వ పెద్దలు తీవ్ర స్థాయిలో ప్రచారం చేశారు. వివిధ రకాల పన్నుల వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఒకే పన్ను వల్ల ప్రజలకు ఉపశమనం కలుగుతుందని నాటి కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ దేశ ప్రజలకు హామీ ఇచ్చారు. కానీ అనుభవంలో మాత్రం పరిస్థితులు పూర్తి భిన్నంగా మారిపోయాయి. పెనుభారంగా పరిణమించిన ఈ పన్నును చివరకు గబ్బర్ సింగ్ పన్నుగా సంభోదించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. 2017 నుండి జి.ఎస్.టి కౌన్సిల్ ఎన్నో సార్లు సమావేశమైంది. నాటి నుండి పలుమార్లు జి.ఎస్.టి విధానంలో మార్పులు చేశారు. ప్రజలు ముఖ్యంగా కోట్లాది మంది సామాన్యులునిత్యం ఉపయోగించే వస్తువులపై పన్నుల భారం మోపడం వల్ల ప్రభుత్వ నిర్ణయాలు వారి జీవన ఆర్థిక స్థితిగతులను తీవ్రంగా ప్రభావితం చేశాయి. జి.ఎస్.టి వసూళ్లు ప్రభుత్వానికి ఒక పెద్ద ఆదాయ వనరుగా మారాయి. జిఎస్‌టి లోని రెండు స్లాబ్‌లను రద్దు చేయటం వలన దరిదాపు కేంద్ర ప్రభుత్వానికి నెలకి 48 వేల కోట్ల రూపాయల పన్ను ఆదాయం తగ్గుతుంది. అంటే వినియోగదారుల వద్ద ప్రోగుపడిపోయిన ఆ ఆదాయంతో వినియోగం పెంచాలని ప్రభుత్వ ఉద్దేశంగా కనిపిస్తుంది. అదే సందర్భంలో వివిధ రంగాలపై దుష్ప్రభావం పడింది. సామాన్యులువాడే పాలు, పెరుగు, పాప్‌కార్న్, షాంపూ, టూత్ పేస్ట్, చిన్న పిల్లల వస్తువుల వంటి వాటిని కూడా చివరకు ప్రభుత్వం వదల్లేదు. వైద్య పరికరాలపై ఘోరంగా 18 శాతం పన్ను ఉండేది.




రైతులు ఉపయోగించే ట్రాక్టర్లపై 18 శాతం పన్ను విధించారు. మరోప్రక్క కార్ల అమ్మకాలు పడిపోయాయి. జి.ఎస్.టి భారాల వల్ల వేలాది చిన్నచిన్న పరిశ్రమలు మూత పడ్డాయని, లక్షల మందికి ఉపాధి పోయిందని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సి.ఎమ్.ఐ.ఇ) తన నివేదికలో పేర్కొంది. కోట్లాది మంది పట్టాదారులు దాచుకున్న బీమా ప్రీమియం సొమ్ముపై 18 శాతం జి.ఎస్.టి విధించడం దేశీయ పొదుపు వ్యవస్థను దెబ్బతీయడమేనని, దీన్ని దృష్టిలో పెట్టుకుని బీమా ప్రీమి యంపై ఈ భారీ పన్ను వసూలును రద్దు చేయాలని బీమా ఉద్యోగులు విస్తృత ప్రచారం నిర్వహించారు. 2017ముందు బీమా ప్రీమియంపై సర్వీస్ టాక్స్ వసూలు చేసేవారు. మొత్తం లోక్ సభ, రాజ్యసభ సభ్యులను కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ రంగ ఇన్సూరెన్స్ సంస్థల్లో అతిపెద్ద యూనియన్‌గా ఉన్నటువంటి ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పెద్ద ఎత్తున ప్రచార ఉద్యమం సాగించింది. దేశ వ్యాప్తంగా పలు సెమినార్లు, సదస్సులు, ప్రెస్‌మీట్స్ ఆర్గనైజ్ చేసింది. ఉద్యోగులు కలిసిన వారిలో కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, ప్రహ్లాద్ జోషీ వంటి ప్రముఖులు కూడా ఉన్నారు. బీమా ప్రీమియంపై జి.ఎస్.టి భారాన్ని మోపడం సమంజసం కాదని, తక్షణమే దీన్ని ఉపసంహరించాలని కోరుతూ 2017 లోనే బీమా ఉద్యోగులు పాలసీదారులను కలసి వారినుండి సేకరించిన మొత్తం 45లక్షల సంతకాలను కేంద్ర ఆర్థిక మంత్రికి పంపించారు. ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్, నీతి ఆయోగ్‌కు ఉత్తరాలు రాసింది. ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ఉద్యోగుల అసోసియేషన్ ఒక లేఖ వ్రాసి ఆయన కూడా ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేసింది. ఇప్పుడు బీమా ప్రీమియంను జి.ఎస్.టి స్లాబ్ 18 శాతం నుండి పూర్తిగా మినహాయించారు. పాలసీదారులకు, మొత్తం బీమా రంగానికి ఈ నిర్ణయం ఉపకరిస్తుంది. ప్రభుత్వ రంగంలోని బీమా సంస్థలను శక్తివంతం చేసేలా ప్రభుత్వ విధానాలు ఉండాలి. ఈ సంస్థల ద్వారా ప్రజల నుండి వసూలయ్యే కోట్లాది రూపాయల ప్రీమియం సొమ్ముదేశీయ పెట్టుబడిగా మారుతోంది. ఫలితంగా దేశ ప్రగతికి మార్గం సుగమం అవుతుంది. మనది సమాఖ్య వ్యవస్థ. రాష్ట్రాలు ఆర్థికంగా బలంగా ఉండాలి. కానీ కేంద్ర ప్రభుత్వం గత కొన్నేళ్లుగా రాష్ట్రాల హక్కులను హరిస్తోందని, వాటిపై పెత్తనం చెలాయిస్తోందని తీవ్ర విమర్శలు ఉన్నాయి. జి.ఎస్.టి మార్పుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని సమూలంగా మార్చుకోవాలి. రాష్ట్రాలకు ఎటువంటి పన్ను బకాయిలు పెండింగ్‌లో లేకుండా చూడటమే కాకుండా, వసూలైన పన్నుల్లో న్యాయబద్ధమైన వారి వాటాలను సకాలంలో అందజేయాలి. రాష్ట్రాలను బలోపేతం చేయాలి. అప్పుడే దేశ సుస్థిర ప్రగతి సాధ్యం. •

# ప్రజావాక్కు



### నిధులు కేటాయించాలి

ప్రయివేటు కాలేజీలకు ఫీజు రీయింబర్స్మెంట్ చేయడం సంవత్సరాల తరబడి రాష్ట్రప్రభుత్వం చెల్లించని కారణంగా వెయ్యికిపైగాకాలేజీలు బంద్‌పాటించడం ఒక విధంగా తమ నిరసనను తెలియజేయడం సబబే అనిపిస్తోంది. బకాయిలు వేల కోట్లకు చేరుకుంది. తెలంగాణా రాష్ట్రానికి రాబడికన్నా ఖర్చులుఎక్కువవుతున్నాయి. ఆంధ్రలో కూడా ఇదే పరిస్థితి నెలకొల్పబడింది. ప్రభుత్వం నడపడానికి అనేక ఉచిత అనుచిత పథకాలకే సరిపోవడం లేదు. కాలేజీ యాజమాన్యాలు ప్రభుత్వం చెల్లించవల సిన ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలనుసాకుగా చేసుకుని ఉపాధ్యాయులకు జీతాలను నెలల తరబడి చెల్లించడంలేదు. ప్రతీ సంవత్సరం తప్పనిసరిగా చెల్లించవలసిన బిల్లులకు బడ్జెట్ కేటాయించాలి.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### సుప్రీం ఉత్తర్వులు భేష్

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్‌చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైనకేసులో సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు వెలువరించింది. ఆ చట్టాన్ని అమలు చేయకుండా స్టే ఇవ్వాలన్న విజ్ఞప్తిని తిరస్కరిస్తూ, కొన్ని అభ్యంతరకర నిబంధనల్ని కొట్టివేస్తే చాలునన్న అభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ ఉత్తర్వులపై అధికార, ప్రతిపక్షాలు హర్షం వ్యక్తం చేయడం, తమతమ అభిప్రాయాల్ని గౌరవించినట్లు భావించడం విశేషం. ఈ మధ్యకాలంలో ఇలా వైరిపక్షాలు రెండూ సంతృప్తి వ్యక్తం చేసిన ఆదేశాలు ఇవే కావొచ్చు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, సక్రమ వినియోగం ఉద్దేశించిన ఈ చట్టం కూడా రాజ్యాంగ పరిధికి లోబడి ఉన్న కారణంగా కొట్టివేయ దగ్గది కాదన్నది కోర్టు ఉద్దేశ్యం.

- డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

### వ్యవస్థకే ముప్పయ్యారు..

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో కాంట్రాక్ట్ లెక్చరర్ల వ్యవస్థను గతప్రభుత్వం చట్టం చేసి రెగ్యులర్ చేయకుండా గతఎన్నికలలో ఓడిపోయింది. ఆచట్టం పరిధిలో ఈప్రభుత్వమైనా రెగ్యులర్ చేస్తుందేమోనని అర్హులైన వారు ఎదురుచూస్తుంటే, అర్హత లేకుండా అడ్డదా రులలో నియామకమైనవారు రెగ్యులర్‌కు మోకాలడ్డుతూ, ఆనెల రెమ్యూనరేషన్ కోసం అర్రులు చాస్తున్నారు.

- డా.దన్నాన అప్పనాయుడు, చీపురుపల్లి

### పర్యవేక్షణ అవసరం

అన్నిరాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు కూడా జీఎస్టీ ఎగవేతదారులను గుర్తించడానికి ఒక ప్రత్యేక డ్రైవ్‌ను చేపట్టాల్సిన అవసరం ఉంది. దేశవ్యాప్తంగా వ్యాపారులు పన్నుల చెల్లింపులో అక్రమాలకు పాల్పడుతున్నారనేది స్పష్టంగా కనిపిస్తున్న వాస్తవం. జీఎస్టీ 2.0 వంటి నూతన పన్ను విధానాలు కొన్ని ఆదాయ నష్టాన్ని కలిగించవచ్చు, కానీ వ్యాపారులు, వాణిజ్య పన్నులశాఖలోని అవినీతి అధికారులు, అలాగే కొన్నిసార్లు పాలకపక్ష నాయకుల మధ్య ఉన్న లోతైన సంబంధాల కారణంగా పన్నుల ఎగవేత యథేచ్ఛగా కొనసాగుతోంది. ఈ పరిస్థితిలో ప్రభుత్వం నిర్దేశించిన పన్ను వసూళ్ల లక్ష్యాలను చేరుకోవడం అసాధ్యంగా మారుతోంది. స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు గడుస్తున్నా, మన దేశంలో వస్తువులవారీగా వాణిజ్య లావాదేవీలన్నింటినీ పర్యవేక్షించడానికి ఒక కేంద్ర వ్యవస్థ లేకపోవడం దురదృష్టకరం. అలాంటి వ్యవస్థ ఉంటే, జీఎస్టీ ద్వారా వచ్చే ఆదాయాన్ని ప్రభుత్వం కచ్చితంగా అంచనా వేయగలిగేది.

-సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### సిమెంటు రోడ్లతో తిప్పలు

నేడు మన దేశంలో ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో పట్టణాలు నుండి పల్లెల వరకు జన సంచారం లేని ఇరుకు సందుల్లో కూడా వేలం వెర్రిగా సిమెంటు రోడ్లు వేస్తూ మార్జిన్లు కూడా వదలకుండా సిమెంటు మయం చేస్తున్నారు. ఇవి తారు రోడ్ల కంటే ఎక్కువకాలం మన్నికగా వుండవచ్చేమోగానీ, వర్షం వచ్చినపుడు నీరు పీల్చుకునే అవకాశం లేక రోడ్లు జలమయమై ఇళ్ళలోకి సైతంనీరుచేరుతుంది. కొన్ని పట్టణాల్లో రోడ్లు జలమయమై ప్రజలెంతో నష్టపోవటమేగాక, కొందరు ప్రాణాలుసైతం కోల్పోయారు. భూమిలో నీరు ఇంకేలా చేయాలి.

-డి. చాంద్ బాషా, కర్నూలు

### లోక్ అదాలత్‌తో సమస్యల పరిష్కారం

ఇటీవల జాతీయస్థాయిలో లోక్ అదాలత్ నిర్వహణ జరిగినది. ఆర్థికస్థితి బాగులేనివారు కూడా కోర్టును ఆశ్రయించడం తప్పని పరిస్థితి ఉంటుంది. దీని ఉద్దేశ్యం పూర్తి ఫలితాన్ని ఇచ్చింది. ఊహించని సంఖ్యలోకేసులు పరిష్కరించుకున్నారు. లోక్ అదాలత్ న్యాయమూర్తులకు వారంతా కృతజ్ఞులు. ఇక జరగబోయే అదాలత్‌కు కాస్తవ్యవధితో బాగా ప్రచారం, సలహాలు, సహకారంతో పెరిగిపోతున్న కేసులకు ఉత్తమ్ విధానం. విషయం తెలిసిన వారు చెప్పడం కూడా మేలే అవుతుంది.

- బొల్లోజు మేఘానాధం, విశాఖపట్నం

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# గుంటూరు వార్త



## స్త్రీశక్తే రాష్ట్రాభివృద్ధికి పునాది

వినుకొండ,సెప్టెంబర్17,ప్రభాతవార్త: ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్,వినుకొండ ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు ఆధ్వర్యంలో పట్టణంలో గంగినేని ఫంక్షన్‌హాలు నందు బుధవారం నిర్వహించిన స్త్రీ శక్తి విజయోత్సవ

**-చీఫ్‌విప్ జీవీ,మంత్రి గొట్టిపాటి,డీసీసీబీ ఛైర్మన్ మక్కెన,మహిళా కమీషన్ ఛైర్మన్ శైలజ, రాజకుమారి**
**-జీవీ పిలుపుతో విజయోత్సవ సభకు పోటెత్తిన మహిళామణులు**
**-పసుపు దండుగా వేలాదిమంది మహిళల భారీ ర్యాలీ**

సభకు మహిళామణులు పోటెత్తారు. సూపర్‌సిక్స్ హామీలు అమలైన వేళ మహిళామణులు స్వచ్ఛందంగా తరలివచ్చి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ పురవీధుల్లో ధన్యవాద ర్యాలీ నిర్వహించారు. శివశక్తి లీలా ఆంజన్ ఫౌండేషన్ ఛైర్మన్,జీ.వీ సతీమణి గోనుగుంట్ల లీలావతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి గొట్టిపాటి రవి,మహిళా కమీషన్ ఛైర్మన్ శైలజ,నన్నపనేని రాజకుమారి,డీసీసీబీ ఛైర్మన్ మక్కెన,జిల్లా తెదేపా అధ్యక్షులు కొమ్మాలపాటి






శ్రీధర్ తదితరులు హాజరయ్యారు. పట్టణంలో ఎక్కడ చూసినా టీడీపీ జెండాలు చేతపట్టుకొని వేలాదిగా పాల్గొన్న మహిళలు జై బాబు...జైజై బాబు,జై జీ.వీ..జైజై జీ.వీ అంటూ నినాదాలతో హోరెత్తించారు. అనంతరం సక్సెస్ సభలో జీ.వీతోపాటు ముఖ్య అతిథులందరూ ప్రసంగించారు. రాష్ట్ర రాజకీయ దిశను నిర్ణయించే శక్తి ఆదిపరాశక్తికి ఉందన్నారు. రాష్ట్రంలో వైకాపా రాక్షస పాలన అంతానికి ముగింపు పలికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంలో మహిళామణులు కీలక పాత్రం పోషించారని కొనియాడారు. జగన్ పాలనలో మహిళలు ఎన్నో అవమానులు ఎదుర్కొన్నారని ఏ మాత్రం రక్షణ లేకుండా భయభ్రాంతులకు గురి చేశారని విమర్శించారు. నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలోని ప్రతి ఆడబిడ్డ స్వేచ్ఛగా సగర్వంగా అన్ని రంగాల్లో ముందుకు వెళుతుందని పేర్కొన్నారు. స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకం మహిళల ఆత్మగౌరవానికి రక్షణ కవచమని అభివర్ణించారు. రాష్ట్ర అభివృద్ధి,మహిళా సాధికారత చంద్రబాబుతో ముడిపడి ఉన్నాయని పేర్కొన్నారు. అనంతరం ప్రధాని నరేంద్రమోడీ జన్మదిన వేడుకలు పురస్కరించుకొని భారీ కేక్ కటింగ్ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు,కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## తురకపాలెంలో పర్యటించిన జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా

గుంటూరు క్రైమ్,సెప్టెంబర్ 17,ప్రభాతవార్త : జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తురకపాలెంలో బుధవారం పర్యటించారు.గ్రామంలో గల రెండు తాగునీటి పథకాల నుండి నీటి సరఫరా పరిస్థితిని పరశీలించారు.గ్రామంలో పర్యటించి పారిశుద్ధ్య పరిస్థితి పరిశీలించారు.గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు.గ్రామస్థులతో మాట్లాడి పరిస్థితులపై ఆరా తీశారు.జిల్లా యంత్రాంగం



అన్ని చర్యలు తీసుకుందని,సరఫరా చేస్తున్న నీరు అవసరాలకు సరిపోతుందా అని అడిగారు.నీటిపై మూతలు పెట్టాలని ఆమె కోరారు.అనారోగ్య పరిస్థితులు తలెత్తితే తక్షణం వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు.దగ్గరలో పెద్ద పలకలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉందని అచ్చట వైద్య సేవలు పొందవచ్చని సూచించారు.మరగకాచి చల్లార్చిన నీటిని తాగాలని ఆమె సూచించారు.వ్యక్తిగత,పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు.ప్రతి చిన్న అంశాన్ని కూడా అర్థమయ్యే విధంగా తెలియజేయాలన్నారు.ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు.వైద్య పరీక్షల వివరాలు తక్షణం గ్రామస్థులకు అందించాలన్నారు.తురకపాలెం కార్యక్రమాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విజయలక్ష్మీ,ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎస్.ఎస్.వి.రమణ వివరించారు.గ్రామంలో 2,500జనాభా ఉన్నారని,18సంవత్సరాలు దాటిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించామని వివరించారు.తాగునీటి సరఫరా పై గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కళ్యాణ చక్రవర్తి వివరించారు.గ్రామస్థులు మాట్లాడుతూ జూన్,జూలై నెలల్లో తాగు నీటి కొరత వస్తుందని,శాశ్వత పరిష్కారం కోసం జిఎంసి నుండి తాగు నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరారు.గ్రామంలో రెండు,మూడు వందల లోతులో బోర్లు వేయాల్సి వస్తుందని,ప్రైవేట్ వ్యక్తులు 500లోతు వరకు వెళుతున్నారని వివరించారు.గ్రామంలో బోర్లు వేస్తున్న పూడుకు పోతున్నాయని చెప్పారు.మ్యాన్‌హోల్స్ వద్ద ఇంకా పటిష్టంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసరావు,జిల్లా పంచాయతీ అధికారి బి.వి.నాగసాయి కుమార్,తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో ఘనంగా విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలు

గుంటూరు క్రైమ్,సెప్టెంబర్ 17,ప్రభాతవార్త : చేతివృత్తుల కళాకారులైన విశ్వకర్మల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతతో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు.బుధవారం కలెక్టరేట్‌లో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకల్లో కలెక్టర్ పాల్గొని విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విరాట్ విశ్వకర్మ జయంతిని రాష్ట్ర ప్రభుత్వ పండుగగా ప్రకటించిందని,విశ్వకర్మ జయంతి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నిర్వహించిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో స్వర్ణాంధ్ర 2047విజన్ యాక్షన్ ప్లాన్‌లో జిడిపికి సంబంధించి ఎకనామిక్ గ్రోత్ తర్వాత రెండవ ప్రాధాన్యత




అంశంగా సంక్షేమ కార్యక్రమాలపై పూర్తిస్థాయిలో సమీక్షించడం జరిగిందన్నారు.ఏపి విశ్వబ్రాహ్మణ సంఘం సమన్వయ కమిటీ ఛైర్మన్ ఎం.వెంకటప్రసాద్,గుంటూరు టిడిపి బిసి సెల్ అధ్యక్షులు వేములకొండ శ్రీనివాస్,గుంటూరు పార్లమెంటరీ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు జంపని నాగేశ్వరరావు మాట్లాడుతూ మహాభారతంలో మయసభను నిర్మించిన దేవశిల్పి అన్నారు.విశ్వకర్మ పరమాత్మ సృష్టికి పూర్వమే ఐదు ముఖాలతో,పది చేతులతో స్వయంభూగా అవతరించారన్నారు.ప్రధాని నరేంద్రమోడీ,రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతివృత్తి కళాకారులైన విశ్వకర్మలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ విరాట్ విశ్వకర్మ జయంతిని ప్రభుత్వ పండుగగా ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు.కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కె ఖాజావలి,జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి మయూరి,బిసి సంక్షేమ సంఘాలు,విశ్వకర్మ సంక్షేమ సంఘాల నాయకులు,ప్రతినిధులు,వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ

## అవగాహన..లో వావిలాల గోపాలకృష్ణయ్య జయంతి

గుంటూరు కల్చరల్,సెప్టెంబర్ 17,ప్రభాతవార్త : సమున్నత ఆదర్శాలకు స్వచ్ఛత,నిర్భీతీ,నిరాడంబరత,నిస్వార్థ ప్రజాసేవకు జీవితాన్ని త్యాగం చేసిన అసమాన త్యాగశీలి,పద్మభూషణ్ వావిలాల గోపాలకృష్ణయ్య అని అవగాహన సంస్థ సభ్యులు నివాళులర్పించారు.జయంతి కార్యక్రమంలో అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో 14సార్లు అరెస్టై,7సార్లు కఠిన కారాగార శిక్ష అనుభవించిన వావిలాల నాటినుండే నిత్యపోరాటశీలిగా కడదాకా పోరాడిన నిత్య ఉద్యమశీలి అన్నారు.విద్యావేత్త చంద్రయ్య మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అలుపెరగకుండా 8దశాబ్దాలపాటు అవిశ్రాంత పోరాటం జరిపిన మహోన్నత గాంధేయవాది,మచ్చలేని ప్రజాప్రతినిధి అన్నారు.కార్యక్రమంలో విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య,ఇంజనీర్ ఘనశ్యామాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## కొల్లిపర మండలాన్ని జిల్లాలో ప్రథమ స్థానంలో నిలుపుతా: మంత్రి నాదెండ్ల

కొల్లిపర,సెప్టెంబరు 17 ప్రభాతవార్త: అన్ని రంగాల్లో కొల్లిపర మండలాన్ని అగ్రగామిగా ఉండేవిధంగా చేస్తానని ..గతంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రథమ స్థానంలో ఉందని చెబుతూ మరలా నెంబర్ వన్ స్థానంలో నిలుపటానికి కృషి చేస్తానని రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ హర్షద్వానాల మధ్య ప్రకటించారు.బుధవారం మండల పరిధిలోని మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.తహశీల్దార్ గుమ్మడి సిద్దార్థ అద్యక్షతన జరిగిన కార్యక్రమంలో మనోహర్ మాట్లాడుతూ నేటి కాలంలో బీపీ..షుగర్..క్యాన్సర్ వంటి వ్యాధులు వస్తున్నాయని..దీనికి కారణం కలుషితమైన వాతావరణం వలన ఇటువంటి వ్యాధులు వస్తున్నాయని పేర్కొన్నారు.గతంలో క్యాన్సర్ హాస్పిటల్స్ రెండు మాత్రమే ఉండేవని అవి ఇప్పుడు జిల్లాకు ఒక క్యాన్సర్ హాస్పిటల్స్ ఏర్పాటుకాబోతున్నాయన్నారు.మహిళల






ఆరోగ్యమే కుటుంబానికి వెలుగవుతుందని..మహిళా ఆరోగ్యం ..జాతీయ ఆరోగ్యం అనే ఆలోచనతో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రదానమంత్రి ప్రవేశ పెట్టారన్నారు.పంటపొలాలకు అధికంగా ఎరువులు వాడటంతో ఆ రసానిక ఎరువుల ద్వారా పండించే పంటలతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని చెప్పారు.పూర్వకాలంలో సేంద్రియ ఎరువులు వాడి నాణ్యమైనచ పంటలు పండించేవారని ఆ పంటల వలన ప్రజలు 90 ఏళ్ళు వచ్చినా ఆరోగ్యవంతంగా ఉండేవారన్నారు.కృష్ణానది జలాలు కలుషితమవటంతో తాను ఆనాడే రూ.30 కోట్లతో రక్షిత మంచి నీటి పథకం ద్వారా మండలంలోని గ్రామాలకు నీరు అందించే ప్రయత్నం చేసానన్నారు.ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే సంకల్పంతో కొల్లిపరలో 30 పడకల వైద్యశాల..మున్నంగిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయటం జరిగిందన్నారు.

వచ్చే ఐదారు నెలల్లో తెనాలి నియోజకవర్గంలోని ప్రభుత్వ వైద్యశాలలకు మరిన్ని వసతులు కల్పించి రూపురేఖలు మారుస్తానన్నారు.కూటమి ప్రభుత్వం సమైఖ్యత వల్లే ఈ రోజు రాష్ట్రానికి కేంద్రం నుండి నిధులు తీసుకురాగలుగుతున్నామన్నారు.మహిళలకు పౌష్టిక ఆహారం అందించటంలో ఎక్కడా రాజీలేదని చెప్పారు.గ్రామాల్లో మహిళలను ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.గ్రామాల్లో నిర్వహిస్తున్న స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగించుకోవాలన్నారు.మనోహర్ ప్రధానమంత్రి నరేంద్రమోడీకి జన్మదిన శుభాకాంక్షలు తెలపగానే సభ అంతా హర్షద్వానాలతో మారుమ్రోగింది.తొలుత కుంచవరం,దంతలూరు గ్రామాల్లో రూ.64 లక్షలతో నిర్మించనున్న పంచాయతీ భవనాల నిర్మాణాలకు కూటమి నాయకులతో కలిసి ఆయన శంఖుస్థాపన చేసారు.ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన సభల్లో మనోహర్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధి..ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు.చివరగా వల్లభాపురం వల్లభాపురం పేరంటాలమ్మ ఆలయం వద్ద రూ.10 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంఖుస్థాపన చేసారు

.ఈ కార్యక్రమాలలో ఎంపీపీ భీమవరపు పద్మావతి,కుంచవరం,దంతలూరు గ్రామల సర్పంచ్‌లు వరికూటి శ్రీనివాసరావు,జె.భాగ్యమ్మ,ఎంపీడీఓ విజయలక్ష్మి,పంచాయతీరాజ్ ఏఈ అవుతు సాంబిరెడ్డి, వైద్యాధికారులు సుబ్బారావు, నేహా,దుగ్గిరాల మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ వంగా సాంబిరెడ్డి, నాయకులు అడపా నారా యణరెడ్డి,భీమవరపు లంక కోటిరెడ్డి,ఆళ్ళ వీరారెడ్డి,దివ్వెల ఏడుకొండలు,దాసరి నర్సయ్య,దండా చిన్నా,కనక వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

## మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థలో అంగీకార్-2025 బ్రోచర్ ఆవిష్కరణ

తాడేపల్లి,సెప్టెంబర్ 17,ప్రభాతవార్త : మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం ఉదయం 12గంటలకు అంగీకార్-2025 పోస్టర్‌ను నగరపాలక సంస్థ కమీషనర్ ఎస్.అలీమ్ భాషా ఆవిష్కరించారు.నిరుపేదల సొంతింటి కల నెరవేర్చడంలో భాగంగా పిమే-యు2.0పై అవగాహన కల్పించడమే లక్ష్యమని,ప్రజల్లోకి ప్రభుత్వ పథకాలను తీసుకొనివెళ్ళాలన్నారు.అనంతరం అంగీకార్-2025పై అవగాహన ర్యాలీ మంగళగిరి ఏయిమ్స్ బ్రిడ్జ నుండి ఎంటిఎంసీ కార్యాలయం వరకు నిర్వహించారు.ర్యాలీ అనంతరం పేమే యు-2.0 హౌసింగ్ పథకం ప్రథమ వార్షికోత్సవం సందర్బంగా అడిషనల్ కమీషనర్ కేక్ కట్‌చేసి అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో అడిషనల్ కమీషనర్ కె.శకుంతల,అసిస్టెంట్ కమీషనర్ పి.శ్రీనివాసరావు,కె.ప్రభురాణి,ఏపిటిడ్కో సీఎల్‌టిసి కె.కల్పన,హౌసింగ్ కార్పొరేషన్ సీఎల్‌టిసి,తాడేపల్లి హౌసింగ్ కార్పొరేషనల్ ఏఈ పి.దుర్గా మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## మణికంఠ హత్యకేసులో 11మంది ముద్దాయిలు అరెస్టు

గుంటూరు క్రైమ్,సెప్టెంబర్ 17,ప్రభాతవార్త : మణికంఠ హత్యకేసులో 11మంది ముద్దాయిలు అరెస్టు చేసిన సంఘటన లాలాపేట పోలీస్టేషన్ పరిధిలో జరిగింది.బుధవారం ఈస్ట్ డిఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్ లాలాపేట పోలీస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముద్దాయిలను హాజరు పరిచి వివరాలు వెల్లడించారు.ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంగడిగుంటలో మణికంఠ(27)పై దాడిచేసిన అతని మరణానికి కారణమైన 11మంది నిందితులను లాలాపేట పోలీసులు అరెస్టు చేశారు.పోలీసులు తెలిపిన వివరాల మేరకు చుట్టుగుంటకు చెందిన యర్రం యశ్వంత్‌కి మణికంఠతో పాతకక్షలున్నాయని తెలిపారు.ఈ క్రమంలో యశ్వంత్ ఈనెల 8న మణికంఠతో గొడవ పెట్టుకొని అతని స్నేహితులతో కలసి దాడి



చేశాడు.గాయపడిన మణికంఠను అక్కడి స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని చికిత్స నిమిత్తం జిజిహెచ్‌కు తరలించారు.ఈ క్రమంలో చికిత్స పొందుతూ మణికంఠ మరణించాడు.మృతుడి తండ్రి హనుమంతరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న లాలాపేట పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగించి ఎట్టకేలకు హత్యకు కారణమైన 11మంది నిందితులను అరెస్టు చేశారు.ఈ సమావేశంలో వెస్ట్ డిఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్,సిఐ,ఎస్సైలు,ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## దేశం కోసం అహర్నిశలు శ్రమించే నేత ప్రధాని నరేంద్రమోడీ

గుంటూరు క్రైమ్,సెప్టెంబర్ 17,ప్రభాతవార్త : స్థానిక 18వ డివిజన్ రామనామక్షేత్రం సమీపంలోని భరతమాత విగ్రహం వద్ద భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు.వేడుకలకు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ముఖ్యఅతిధిగా హాజరయ్యారు.బిజేపి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్,జిల్లా బిజేపి అధ్యక్షులు



చెరుకూరి తిరుపతిరావు లతో కలసి కేక్ కటింగ్ నిర్వహించారు.తొలుత భారతమాత విగ్రహానికి పూలమాలలు వేశారు.అనంతరం ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ దేశం కోసం అహర్నిశలు శ్రమించే మహానేత నరేంద్రమోదీ దీర్ఘాయుష్షుతో ప్రజలు మరింతకాలం సేవలు అందించాలని,ఆయన స్ఫూర్తిదాయక నాయకత్వం వల్ల భారత్ ప్రపంచ వేదికపై అగ్రగామిగా నిలుస్తుందని గర్వంగా పేర్కొన్నారు.కార్యక్రమంలో స్థానిక బిజేపి,టిడిపి,జనసేన నేతలు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏపి శాసనసభ స్పీకర్‌ను కలసిన ఎస్పీ వకుల్ జిందాల్



గుంటూరు క్రైమ్,సెప్టెంబర్ 17,ప్రభాతవార్త : జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా బుధవారం రాష్ట్ర శాసనసభా స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడుని శాసనసభా ప్రాంగణంలోని చాంబర్‌లో ఎస్పీ వకుల్ జిందాల్ మర్యాదపూర్వకంగా కలసి మొక్కను అందించారు.ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన వకుల్ జిందాల్‌కి శుభాకాంక్షలు తెలుపుతూ ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించడంతో పాటు పోలీసు శాఖ ప్రతిష్టను మరింత ఎత్తుకు తీస్కెళ్ళాని సూచించారు.నేడు ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాలకు సంబంధించి ఉన్నతాధికారులతో భద్రతా ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో అసెంబ్లీ సమావేశాలకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసి,భద్రతలో ఎలాంటి లోపాలు లేకుండా కృషి చేయాలని ఎస్పీకి స్పీకర్ ఆయన్నపాత్రుడు సూచించారు.

## అప్పు తీర్చలేక...రెండు కుటుంబాల్లో విషాదం...

## -తల్లీ, కుమారుడు ఆత్మహత్య

సత్తెనపల్లి, సెప్టెంబరు 17 ప్రభాతవార్త : మండలంలోని ఫణిదం గ్రామంలో బుధవారం పెను విషాదం చోటు చేసుకుంది. ఋణభారంతో ఒకరు ఆత్మహత్యకు పాల్పడగా..రుణ బంధాన్ని తట్టుకోలేక ఓ కుటుంబం ఆత్మహత్యకు యత్నించగా ఇద్దరు మరణించారు. ఇద్దరు చావు బతుకుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. రుణ రక్కసికి చిక్కిన రెండు కుటుంబాలు ఛిద్రమైన తీరుతో సభ్య సమాజం చలించిపోయిందది. ఈ దారుణ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఫణిదం గ్రామానికి చెందిన దాసరి వెంకటేశ్వర్లు, రామనాథం శ్రీనివాసరావు, స్నేహితులు శ్రీనివాసరావు మధ్యవర్తిత్వంతో ఓ ప్రైవేట్ ఫైనాన్స్‌లో వెంకటేశ్వర్లు రూ.90 వేలు రుణం తీసుకున్నాడు. కీస్తీల చెల్లింపులో వెంకటేశ్వర్లు బకాయి పడటంతో ఫైనాన్స్ కంపెనీకి కలెక్షన్ ఏజెంట్లు మంగళవారం సాయంత్రం శ్రీనివాసరావు ఇంటికి వచ్చారు. వెంకటేశ్వర్లు తీసుకున్న రుణాన్ని




మృతిచెందిన తల్లి, కుమారుడు (ఫైల్ ఫోటో)

మధ్యవర్తిత్వం వహించిన శ్రీనివాసరావు, అతని భార్య పూర్ణిమకుమారి చెల్లించాలని ఒత్తిడి చేశారు. దీంతో ఈ విషయంపై వెంకటేశ్వర్లును శ్రీనివాసరావు నిలదీశారు. ఈ క్రమంలో స్నేహితుల మధ్య స్వల్ప వివాదం చోటు చేసుకుంది. ఆ తర్వాత ఎవరి ఇంటికి వారు వెళ్ళి పోయారు. అనుకోకుండా మంగళవారం రాత్రి వెంకటేశ్వర్లు తనకు అవమానం జరిగిందని భావించి పురుగుమందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువులు ఆయనను హడావుడిగా సత్తెనపల్లి ఆసుపత్రికి తీసుకురాగా మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరుకు తరలించారు. వెంకటేశ్వర్లు ఆత్మహత్యకు యత్నించిన సమాచారంతో శ్రీనివాసరావు ఇంట్లో తెలిసి గొడవ మొదలైంది. భార్య పూర్ణిమకుమారి, కుమారుడు వెంకటేశ్వర్లు మధ్య స్వల్ప వివాదం చెలరేగింది. ఇక వెంకటేశ్వర్లు కుటఉంబసభ్యులు తమపై కేసు పెడతారేమోనని భయపడి శ్రీనివాసరావు బుధవారం ఉదయం పొలానికి వెళ్ళి పురుగుమందు తాగాడు. ఈ విషయం తన భార్య, కుమారుడికి తెలియజేశాడు. అది జీర్ణించుకోలేని శ్రీనివాసరావు భార్య పూర్ణిమ కుమారి (45) కుమారుడు వెంకటేశ్వర్లు (23) సమీప పొలంలోని దిగుడు బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. గ్రామస్తులు శ్రీనివాసరావును సత్తెనపల్లిలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ఈ సమాచారం అందుకున్న సత్తెనపల్లి రూరల్ సి.ఐ. ఎం.వి.సుబ్బారావు తమ సిబ్బందితో కలిసి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను వెలికి తీయించారు. రెండు వైపులా విచారణ జరిపి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## శ్రీనివాసరావుపేటలో ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు

గుంటూరు క్రైమ్,సెప్టెంబర్ 17,ప్రభాతవార్త : స్థానిక పశ్చిమ నియోజకవర్గంలోని శ్రీనివాసరావుపేటలో విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.శ్రీవిశ్వకర్మ చిత్రపటానికి ఎమ్మెల్యే గళ్ళా మాధవి,బిజేపి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్,జిల్లా బిజేపి అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు,ఎన్డీయే కూటమి నేతలతో కలసి విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి,ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ విశ్వకర్మను సృష్టికర్తగా,శిల్పకళా,వృత్తి నైపుణ్యాల ఆరాధ్యదైవంగా భావిస్తారని,విశ్వకర్మ ఆరాధనతో ప్రతి వృత్తిలో,ప్రతి పనిలో సంపద,సిరులు సమృద్ధిగా కలగాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆకాంక్షించారు.ప్రజలు ఐక్యతతో అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు.



VAARTHA CLASSIFIEDS

**Announcement**

★ గుంటూరు జిల్లా, పొన్నూరు మండలం, బ్రాహ్మణ బజార్, డోర్ నెం.24-8-31/A నివాసి శ్రీ జి.వి.ఎస్. సతీష్ కుమార్, స/o. జి.వి. సుబ్బారావు గారు 54 సంవత్సరాలు ఇందు మూడంచి ప్రాముఖ్యంతో కూడిన ఆస్తికి సంబంధించిన సర్వ శక్తి అధికారం మరియు అమ్మకపు ఒప్పందం (General Power of Attorney cum Agreement of Sale) ను శ్రీ రిషి ప్రైడ్ రియల్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ప్రతినిధి డైరెక్టర్) గూడూరు శ్రీ రుషి కుమార్ రెడ్డి గారికి ఇచ్చిన విషయం పై పేరు చెప్పబడిన ఆస్తికి ఎవరైనా హక్కులు, క్లెయిములు, అభ్యంతరాలు ఉంటే ఈ ప్రకటన దినం నుంచి 15 రోజుల లోపు దిగువ చిరునామాకి తెలియపర్చవలెను. తదుపరి అభ్యంతరాలు పరిగణనలోకి తీసుకోబడవు. ఆస్తి వివరాలు: మా ప్రాజెక్ట్, సెక్టార్ సి, రన్‌వే 7 నందిగామ గ్రామం, మేకగూడ, కొత్తూరు మండలం, మహబూబ్ నగర్ జిల్లా, సర్వే నం.709/ఆ & 711a, సైట్-7, ప్లాట్ నం.C19 (200 sq.yds) మరిన్ని వివరాలకు ఫోన్ నం. 8309857238 వద్ద సంప్రదించవచ్చును.

(Ro.No.23103)

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

## 20న బిసి సంక్షేమ హాస్టల్ ప్రారంభం

గుంటూరు క్రైమ్,సెప్టెంబర్ 17,ప్రభాతవార్త : గత ప్రభుత్వంలో గ్రహణం పట్టిన బిసి సంక్షేమ హాస్టల్‌ను ఏడాదిలోనే పూర్తిచేసి ఈనెల 20న ప్రారంభించనున్నామని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు.బుధవారం కొడిగుడ్డు సత్రంలోని బిసి ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు.నూతనంగా నిర్మించిన గదులు,మరుగుదొడ్లు,లైబ్రరీ పరిసరాలను పరిశీలించి అధికారులకు తగిన సూచనలిచ్చారు.హాస్టల్ ప్రారంభించడానికి సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయులు,కేంద్ర సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్,ఇతర ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారని వెల్లడించారు.తాను అధికారం చేపట్టిన వెంటనే బిసి హాస్టల్ నిర్మాణం ఫైల్‌ను సీఎం చంద్రబాబు నాయుడు వద్దకు తీసుకెళ్లానని చెప్పారు.సుమారు రూ.3కోట్ల నిధులతో భవన నిర్మాణాన్ని పూర్తి చేశామని,ఆధునిక వసతులు కల్పించామని వెల్లడించారు.450మంది విద్యార్థులకు వసతి సౌకర్యాలు ఉన్నాయన్నారు.కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి,సంక్షేమంతోపాటు విద్యాభివృద్ధికి ప్రథమ ప్రాధాన్యమిస్తున్నామని తెలిపారు.

## పారిశ్రామికాభివృద్ధి - యువతకు ఉపాధి కల్పనే ధ్యేయం

### --ఏపి టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ డేగల ప్రభాకర్

గుంటూరు క్రైమ్,సెప్టెంబర్ 17,ప్రభాతవార్త : రాష్ట్రంలోనూతన పరిశ్రమలను స్థాపించేందుకు యువత ముందుకు రావాలని ఏపి టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ డేగల ప్రభాకర్ పిలుపునిచ్చారు.బుధవారం ఏపిఐడిసి కార్యాలయంలో నిర్వహించిన బోర్డు మీటింగ్‌లో చైర్మన్ డేగల పాల్గొన్నారు.నూతనంగా ఏపిఐడిసి లో నూతనంగా నియమించబడిన డైరెక్టర్లను చైర్మన్ అభినందించి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం కార్పొరేషన్ ను పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆరోపించారు.కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితి మారిపోయిందన్నారు.సీఎం చంద్రబాబు,మంత్రి లోకేష్ చొరవతో రాష్ట్రానికి పెట్టుబడుల వెల్లువ మొదలైందన్నారు.రాష్ట్రంలో నిరుద్యోగాన్ని నిర్మూలించి ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు రాయితీపై పరిశ్రమల స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తుందన్నారు.యువత ఉద్యోగాల కోసం కాకుండా ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో కార్పొరేషన్ ఎండి,డైరెక్టర్లు బాలభారతి మట్టపర్తి,జలకం రాజారావు,కటారి రమణయ్య,మనోజ్‌కుమార్ భీమిశెట్టి,పండితి మల్హోత్రా తదితరులు పాల్గొన్నారు.

## వీధి కుక్కల సమస్యను పరిష్కరించండి

పొన్నూరు, సెప్టెంబరు 17,ప్రభాతవార్త: ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లోపించడం వల్లే రోజు రోజుకు వీధి కుక్కల బెడద ఎక్కువవుతోందని, వీధి కుక్కల సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతూ



కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అందె దిలీప్ బుధవారం తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్‌కు వినతిపత్రం అందజేశారు. వీధికుక్కల దాడిలో వెల్లలూరు గ్రామానికి చెందిన చిరంజీవి తాడిశెట్టి కార్తీక్ మరణించిన నేపథ్యంలో వీధి కుక్కల కట్టడికి రెవెన్యూ, విద్యా,వైద్య, పశుసంరక్షణశాఖల అధికారులను కలిసి శాఖాపరంగా అవగాహన సదస్సులు నిర్వహించాలని దిలీప్ కోరారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం వల్లే వీధి కుక్కలు విచ్చలవిడిగా పెరిగిపోతున్నాయన్నారు. కుక్క కాటుకు గురైతే ఎలాంటి చర్యలు చేపట్టాలి, అందుకు సంబంధించిన మందులు ఎక్కడ అందుబాటులో ఉంటాయి తదితర విషయాలను ప్రజలకు వివరించాని కోరారు. ఏదిఏమైనా వీధి కుక్కల కట్టడిపై అన్ని శాఖల అధికారులు దృష్టిసారించాలని దిలీప్‌కోరారు.

## ప్రభుత్వ వైద్యశాలల బలోపేతమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

పొన్నూరు, సెప్టెంబరు 17,ప్రభాతవార్త: పేద ప్రజలకు అవసరమైన వైద్యాన్ని నాణ్యతతో కల్పించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. నిడుబ్రోలు ప్రభుత్వాసుపత్రిలో బుధవారం స్వస్త్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నరేంద్రకుమార్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధూళిపాళ్ళ మాట్లాడుతూ పోషకాహార లోపంతో బాలింతలు, చిన్నారులు, గర్భిణీస్త్రీలు బాధపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించి పోషకాహారంపై మక్కువ పెంచడంతోపాటు నాణ్యమైన వైద్య సేవలను అందించడమే ధ్యేయంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం అక్టోబరు రెండవ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి డాక్టర్ ఫిరోజ్‌ఖాన్ మాట్లాడుతూ మహిళలకు అధిక రక్తపోటు, డయాబెటిస్, క్యాన్సర్ వంటి వ్యాధుల స్క్రీనింగ్, రక్తహీనత, క్షయ పరీక్షలు, గర్భిణీలకు ప్రసవ పూర్వ తనిఖీ, పిల్లలకు రోగ నిరోధక శక్తి తెలుసుకునేందుకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే నరేంద్రకుమార్ వైద్యశాలను కలయతిరిగి వైద్యులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు, చెన్నుపాటి భాస్కర్, ఆరె వరప్రసాద్, పఠాన్ అహమ్మద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఓట్ల దొంగ గద్దె దిగు కరపత్రాల విడుదల: నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి

మాచర్ల, సెప్టెంబరు 17 ప్రభాతవార్త: ఏఐసీసీ, పీసీసీ ఆదేశాల మేరకు ఈ నెల 15 నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు ఓట్ల జాబితాల అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న దేశ వ్యాప్త ఉద్యమంలో భాగంగా తలపెట్టిన సంతకాల సేకరణ ఉద్యమానికి ప్రజల మద్దతు కోరుతూ మాచర్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇన్‌ఛార్జి యరమల రామచంద్రారెడ్డి కరపత్రాలను విడుదల చేశారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను కాలరాసి దొంగ ఓట్లకు పాల్పడి మూడోసారి గద్దె నెక్కింది. దీనికి వ్యతిరేకంగా నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో, ప్రధాన గ్రామాల్లో బహిరంగ సంతకాల సేకరణపై ప్రజల మద్దతు కోరుతూ కార్యక్రమాలు చేపడతున్నట్లు తెలిపారు. ప్రజలు మద్దతుగా నిలవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వంగపాటి నాగరాజు, కొమ్ము కోటేశ్వరరావు, చిమటా వెంకటేశ్వర్లు, దొడ్డా శ్రీనివాసరావు, షేక్ బాబు, నాజర్‌వలి, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఉత్తమ హెచ్‌ఎం విజయకుమారికి సన్మానం

మాచర్ల, సెప్టెంబరు 17 ప్రభాతవార్త: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారిణి చంద్రకళ చేతుల మీదుగా మాచర్ల మండలం కంభంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఆర్.విజయకుమారి ఉత్తమ ప్రధానోపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో మదర్‌థెరిస్సా సేవాసమితి అధ్యక్షులు గాదె కిరీటిరెడ్డి అధ్యక్షతన సభ్యులు ఆర్.విజయకుమారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కామిరెడ్డి విజయలక్ష్మి పండిట్, ఆర్.శివపార్వతి, నిర్మలమేరి, రామేశ్వరమ్మ, ఎం.భాస్కరరెడ్డి, అందుగుల చంద్రయ్య, కసిరెడ్డి శాంతిరెడ్డి, ముత్యాల పాపిరెడ్డి, జక్కిరెడ్డి చిన్నపరెడ్డి, ప్రముఖ న్యాయవాది అందుగుల బాలజోజి, మాచర్ల మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ యరబోతుల శ్రీనివాసరావు, మహేష్, జె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


## వ్యర్థాలను డంపింగ్ యార్డుకు చేర్చాలంటూ తహశీల్దారుకు వినతి

మాచర్ల, సెప్టెంబరు 17 ప్రభాతవార్త: మాచర్లలోని చంద్రవంక నదిలో, రహదారుల వెంట అనేక వ్యర్థాలు వేయడం వల్ల కుళ్ళిపోయి దుర్వాసన వస్తుందని ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, వాటిని డంపింగ్ యార్డుకు తరలించాలని కోరుతూ రామకృష్ణ సేవాసమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి తహశీల్దారు కిరణ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. పట్టణంలోని వ్యర్థాలను డంపింగ్ యార్డుకు చేరే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## చంద్రబాబు పర్యటనకు విస్తృత ఏర్పాట్లు!

### సర్వం సిద్ధం చేస్తున్నాం: ఎమ్మెల్యే

మాచర్ల, సెప్టెంబరు 17 ప్రభాతవార్త: స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 20 శనివారం నాడు మాచర్ల పట్టణంలో ఏపీ సీఎం చంద్రబాబు పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక మున్సిపాలిటీ పరిధిలో విస్తృత ఏర్పాట్లకు రంగం సిద్ధమైంది. ఈ క్రమంలో సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను బుధవారం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అధికారులతో సమీక్షించారు. స్థానిక సెయింటాన్స్ పాఠశాలలో హెలిప్యాడ్ పాయింట్‌ను ఎమ్మెల్యే జూలకంటి, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాతో పరిశీలించారు. యాదవ బజారు, మేకలమండి, ఆటోనగర్, ఎస్‌కేబీఆర్ గ్రౌండ్ ప్రాంతాలలో అధికార యంత్రాంగంతో కలిసి ఎమ్మెల్యే కలియతిరిగారు. కస్తూరిబా గాంధీ పాఠశాలను సందర్శించి అక్కడ ఏర్పాట్లను పరిశీలించారు. సీఎం చంద్రబాబు పర్యటనను ఉద్దేశించి ఎమ్మెల్యే జూలకంటి మాట్లాడుతూ అన్ని ఏర్పాట్లను యుద్ధ ప్రాతిపదికన సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పర్యటనలో ప్రజలకు, కూటమి నాయకులకు అనుమతులు పరిమితంగా ఉంటాయన్నారు. వరికపూడిసెల



శంకుస్థాపన నేపథ్యంలో మరోసారి నియోజకవర్గంలో చంద్రబాబు పర్యటన ఉంటుందని, భారీ బహిరంగ సభతో కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అధికారులతో సమీక్షించి, ఏర్పాట్లలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జేసీ సూరజ్, అడిషనల్ ఎస్పీ సంజయ్, ఇతర ముఖ్య అధికారులు, టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు దారునాయక్, టీడీపీ యువ నాయకులు జూలకంటి అక్కిరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ సాతులూరి కుమార్, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ కొమెర దుర్గారావు, మున్సిపల్ ఛైర్మన్ మదార్‌సాహెబ్,, మార్కెట్ యార్డు ఛైర్మన్ మధు, వైస్ ఛైర్మన్ గుండాల శ్రీనివాసరావు, టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల దాసు, టీడీపీ నాయకులు గోగుల వెంకటరామిరెడ్డి, వజ్రంనాయక్, హనిమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విశ్వకర్మ సేవలో బ్రహ్మన్న!

మాచర్ల, సెప్టెంబరు 17 ప్రభాతవార్త: భగవాన్ విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని స్థానిక షరాబు బజారులో విశ్వకర్మ భగవాన్ ఉత్సవ కమిటీ బుధవారం నిర్వహించిన 40వ వార్షికోత్సవ పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు దారునాయక్, తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ సాతులూరి కుమార్, వడ్డె కార్పొరేషన్ డైరెక్టర్ కొమెర దుర్గారావు, టీడీపీ సీనియర్ నాయకులు యెనుముల కేశవరెడ్డి, కజ్జం సైదయ్య, గోగుల వెంకట్రామిరెడ్డి, మార్కెట్ యార్డు ఛైర్మన్ రాజబోయిన మధు, వైస్ ఛైర్మన్ గుండాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలి : డాక్టర్ పెమ్మసాని

గుంటూరు క్రైమ్,సెప్టెంబర్ 17,ప్రభాతవార్త : జిల్లాలోయూరియా సరఫరాపై రైతులు అనవసర ఆందోళనతో అవసరానికి మించి యూరియాను నిల్వ చేసుకోకుండా వ్యవసాయ శాఖాధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి మరియు కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ మిని సమావేశ మందిరంలో మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్,సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ,ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుతో కలిసి వ్యవసాయశాఖపై అధికారులతో సమీక్ష



నిర్వహించారు.ఖరీఫ్ సీజన్‌లో యూరియా 24వేల మెట్రిక్ టన్నులు అవసరం ఉంటే దానికంటే అదనంగా ఇప్పటికే 26,000మెట్రిక్ టన్నులను రైతులకు సరఫరా చేశామన్నారు.రాబోయే రోజుల్లో మరింత మెరుగ్గా యూరియా సరఫరా కోసం ఆఫ్ సీజన్‌లోనే మార్క్‌ఫెడ్ ద్వారా యూరియా కొనుగోలుకు చర్యలు తీసుకుంటామన్నారు.ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ యూరియా సమస్యలు ఉన్నాయన్న వార్త కథనాలపై స్పందిస్తూ వ్యవసాయ అధికారులతో కేంద్రమంత్రి సమీక్ష నిర్వహించారన్నారు.లక్ష్యానికి మించి 2000మెట్రిక్ టన్నులు అధికంగా జిల్లాలో యూరియా సరఫరా జరిగిందని,యురియా కొరత లేదన్నారు.సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కె ఖాజావలి,జిల్లా వ్యవసాయాశాఖ అధికారి అయితా నాగేశ్వరరావు,డిసిఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు,మార్క్‌ఫెడ్ డిఎం నరిసింహారెడ్డి,డిసిఎంఎస్ బిజినెస్ మేనేజర్ హరిగోపాలం,జిల్లా ఉద్యానశాఖ అధికారి రవీంద్రబాబు,ఏపిఎంఐపి పిడి వజ్రశ్రీ,పశుసంవర్ధకశాఖ డిడి సత్యనారాయణ,లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్ రెడ్డి,రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## పశ్చిమలో "స్వస్త్ నారీ - సశక్త్ పరివార్ అభియాన్" ప్రారంభించిన ఎమ్మెల్యే మాధవి

గుంటూరు క్రైమ్,సెప్టెంబర్ 17,ప్రభాతవార్త : పశ్చిమ నియోజకవర్గంలోని 21వ డివిజన్ కెవిపి కాలనీ అర్బన్ ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్‌లో "స్వస్త్ నారీ - సశక్త్ పరివార్ అభియాన్" ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రారంభించారు.మహిళల ఆరోగ్యం,కుటుంబ బలోపేతం లక్ష్యంగా ప్రధాని నరేంద్రమోడీ ప్రవేశపెట్టిన ఈ జాతీయ పథకం,సెప్టెంబర్17నుంచి అక్టోబర్ 2వరకు దేశవ్యాప్తంగా నిర్వహించబడుతుంది.ప్రధాని పుట్టినరోజు సందర్భంగా దేశమంతటా మహిళల కోసం ఈ ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు ప్రారంభించారని ఈ అభియాన్‌లో గుండె జబ్బులు, మధుమేహం,టీకాలు,ఆయుష్మాన్ కార్డుల పంపిణీ,రక్తదాన శిబిరాలు,బహిస్టు పరిశుభ్రత అవగాహన వంటి విస్తృత సేవలు అందించబడతాయన్నారు.మహిళలు ఆరోగ్యవంతంగా ఉంటేనే కుటుంబం,సమాజం బలోపేతం అవుతుందని,ప్రతి ఒక్కరూ ఈ శిబిరాలను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు.

## పశ్చిమలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తంచేసిన ఎమ్మెల్యే మాధవి

గుంటూరు క్రైమ్,సెప్టెంబర్ 17,ప్రభాతవార్త : పశ్చిమ నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి మున్సిపల్ ఇంజనీరింగ్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు.చిన్న వర్షానికే రోడ్లు మునిగిపోవడం,డ్రైన్లలో నీరు పారకపోవడం వంటి సమస్యలపై డివిజన్ వారీగా సమగ్రంగా రివ్యూ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేను ఎన్నిసార్లు డిసిల్టేషన్ పనులు చేయాలని హెచ్చరించినా అధికారులు నిర్లక్ష్యం వహించడం వలన ఒక గంట వర్షానికే సగం మునిగిపోయింది.అర్హతలేని కాంట్రాక్టర్లకు పనులు అప్పగించి పనులు ప్రారంభించకపోవడం అభివృద్ధి అడ్డంకిగా మారింది.నేను శంకుస్థాపన చేసిన తర్వాత కూడా పనులు మొదలు కాకపోవడం ప్రజా ప్రతినిధులను అవమానించటమే నని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు.

## అంధురాలు జ్యోతికి అండగా నిలిచిన ఎమ్మెల్యే నసీర్

గుంటూరు క్రైమ్,సెప్టెంబర్ 17,ప్రభాతవార్త : అమ్మా ఆకలి అంటూ బిడ్డనోరు తెరచి అడిగితే అన్నం ముద్ద పెట్టలేక,పొంగుకొచ్చే కన్నీళ్ళు దాచుకోలేక భిక్షాటన చేస్తున్న అంధురాలు పాములపాటి జ్యోతికి తూర్పు ఎమ్మెల్యే వెలుగు రేఖగా మారారు. "పాపం జ్యోతి" పేరిట ఓ పత్రికలో బుధవారం ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే స్పందించారు.జ్యోతి ఇంటికెళ్లి ఆమె కుటుంబాన్ని పరామర్శించారు.ఏ కష్టమొచ్చినా తాను అండగా ఉంటానని భరోసా కల్పించారు.ఎమ్మెల్యే స్వయంగా తమ ఇంటికి రావడంతో జ్యోతి రెండుచేతులు జోడించి కన్నీటి పర్యంతమైంది.బిడ్డకు అన్నం కూడా పెట్టుకోలేని దుస్థితిలో ఉన్నానంటూ ఆవేదన వ్యక్తంచేసింది.ఎమ్మెల్యే వెంటనే రూ.10వేలు ఆర్థికసాయం అందించి అధైర్యపడొద్దంటూ భరోసా ఇచ్చారు.తాను తల దాచుకోవడానికి నిలువనీడలేదయ్య అని జ్యోతి చెప్పడంతో ప్రభుత్వం తరపున టిడ్కో ఇల్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.జ్యోతి కుమార్తు చదువులకుగా తాను పూర్తి అండగా నిలుస్తానని స్థానిక కార్పొరేటర్ అశోక్ భరోసా కల్పించారు.జ్యోతి కుటుంబ పోషణకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

## సుపరిపాలన ఎన్డీయేకే సాధ్యం:-ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

పొన్నూరు, సెప్టెంబరు 17,ప్రభాతవార్త: దేశంలో సుపరిపాలన అందించే సత్తా ఒక్క ఎన్డీయే ప్రభుత్వానికే ఉందని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో కూటమి నాయకులు ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోడి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడి



తీసుకుంటున్న నిర్ణయాలు సత్ఫలితాలను ఇస్తున్నాయన్నారు. దేశ ప్రజలంతా ఎన్డీయే ప్రభుత్వాన్నే కోరుకొంటున్నారన్నారు. రాష్ట్రంలో కూటమి సర్కార్ సుపరిపాలన అందిస్తుందన్నారు. ప్రతిపక్ష హోదా కూడా లేకుండా వైకాపాను ఇంటికి సాగనంపారన్నారు. వైకాపా పాలనలో ప్రజలందరూ ఎన్నో ఇబ్బందులకు గురి అయ్యారన్నారు. గత ఎన్నికల్లో ప్రజలందరూ తమ ఓటు ద్వారా వైకాపాపై కసి తీర్చుకున్నారన్నారు. కనీ విని ఎరుగని రీతిలో కూటమికి అధికారాన్ని అప్పగించారన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా సుపరిపాలన అందిస్తున్నామన్నారు.నరేంద్రమోడి నాయకత్వం ఈ దేశానికి ఎంతో అవసరమన్నారు. నరేంద్రమోడి మరిన్ని పుట్టిన రోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. భారీ కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వడ్రాణం మార్కండేయబాబు, మాదల వెంకటేశ్వరరావు, బొర్రు రామారావు, బండ్లమూడి బాబూరావు, గోవాడ వెంకటకృష్ణారావు, పఠాన్ అహమ్మద్‌ఖాన్, పఠాన్ పిరోజ్‌ఖాన్, షేక్ బాజిసాహెబ్, బొప్పన బాపనయ్య తదితరులున్నారు.

## కూటమి సర్కార్‌లోనే దివ్యాంగులకు ప్రాధాన్యం

పొన్నూరు, సెప్టెంబరు 17,ప్రభాతవార్త: కూటమి సర్కార్ పాలనలోనే దివ్యాంగులకు ప్రాధాన్యం ఉంటుందని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం విభిన్న ప్రతిభా వంతులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్



మాట్లాడుతూ ప్రతి వర్గానికి న్యాయం చేసే ఘనత కూటమి సర్కార్‌దేనన్నారు. దివ్యాంగుల సంక్షేమానికి, అభివృద్ధికి ప్రత్యేకశ్రద్ధ పెట్టి పథకాలను అమలు చేస్తున్న ఘనత కూటమి సర్కార్‌దేనన్నారు. పట్టణంఠ 25మందికి, మండలంలో 19మందికి, చేబ్రోలు మండలంలో ఇద్దరికి, పెదకాకాని మండలంలో ఇద్దరికి మొత్తం 48మంది విభిన్న ప్రతిభావంతులకు వీల్‌చైర్లు, లుంబో నీబెల్ట్స్, హియరింగ్ ఇంప్లాంట్స్, సపోర్టింగ్ స్ట్రక్చర్స్, వాకింగ్ స్టిక్స్, హ్యాండ్ స్టిక్స్, షోల్డర్స్ ను అందజేశారు. వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆలింకో వారి సహకారంతో దివ్యాంగులకు 203ఉపకరణాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళరమేష్‌బాబు, జనసేన నాయకుడు వడ్రాణం మార్కండేయబాబు, బొర్రు రామారావు, మైలా వెంకటరామరాజు, బండ్లమూడి బాబూరావు, మాదల వెంకటేశ్వరరావు, దుర్గయ్య, పిరోజ్‌ఖాన్, షేక్ బాజిసాహెబ్, తోట ప్రసాద్ తదితరులున్నారు.

## 22నుంచి దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు

పొన్నూరు, సెప్టెంబరు 17,ప్రభాతవార్త: తెలగపాలెం శ్రీ కోదండ రామాలయంలో ఈ నెల 22వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు జరుగుతాయని దేవాలయం కమిటి అధ్యక్షుడు అల్లం సాంబశివరావు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8గంటలకు గణపతి పూజ, అఖండ దీపారాధన, కలశస్థాపన జరుగుతాయన్నారు. 22వ తేదీన శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి అలంకరణ, 23న శ్రీ గాయత్రీదేవి అలంకరణ, 24న శ్రీ అన్నపూర్ణాదేవి అలంకరణ, 25న శ్రీ లలితా త్రిపుర సుందరీదేవి అలంకరణ, 26న శ్రీ మహాలక్ష్మీదేవి అలంకరణ, 27న శ్రీకాత్యాయనిదేవి అలంకరణ, 28న శ్రీ మంగళగౌరీదేవి అలంకరణ, 29న శ్రీ సరస్వతీదేవి అలంకరణ, 30న శ్రీ దుర్గాదేవి అలంకరణ, 1వ తేదీ శ్రీ మహిషాసురమర్ధనీదేవి అలంకరణలో భక్తులకు అమ్మవారు దర్శనమిస్తారని చెప్పారు. రెండవ తేదీన శ్రీ రాజరాజేశ్వరీదేవి అలంకరణ జరుగుతాయన్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలనుకునేవారు గోత్ర నామార్చనకు రూ.250, విశేష గోత్రనామార్చనకు రూ.520చెల్లించాలని కమిటి అధ్యక్షుడు సాంబశివరావు తెలిపారు. పూర్తి వివరాలకు దేవాలయం అర్చకస్వామి చిలకపాటి లక్ష్మణ్ రామాచార్యులు సంప్రదించాలని కోరారు.



## భక్తిశ్రద్ధలతో ఊంజల్ సేవ

పొన్నూరు, సెప్టెంబరు 17,ప్రభాతవార్త: పట్టణంలో వేంచేసియున్న శ్రీ సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత సాక్షి శ్రీ భావనారాయణస్వామివారికి బుధవారం ఊంజల్ సేవ నిర్వహించారు. భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతోన్న శ్రీ స్వామివారికి భక్తులు శాంతి కళ్యాణాలు, ఊంజల్ సేవలు, హోమాలు నిర్వహిస్తూ తమ భక్తి పారవశ్యాన్ని చాటుకొంటూ ఉంటారు. అందులో భాగంగా స్వామివారి సేవలో డోలు వాయిస్తూ తరించే శ్రీనివాసరావు దంపతులు స్వామివారికి ఊంజల్ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకస్వామి గోవర్ధనం రామకృష్ణ మాట్లాడుతూ లోక కళ్యాణార్ధం, శాంతి కళ్యాణాలు, ఊంజల్ సేవలు, హోమాలు, యజ్ఞాలు నిర్వహించాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. ప్రాచీన కాలం నుంచి భగవంతునికి వివిధ రకాల కార్యక్రమాలు చేపట్టేవారన్నారు. లోకమంతా సుభిక్షంగా ఉండాలని, సకాలంలో వర్షాలు కురవాలని, పాడి పంటలు పుష్కలంగా పండి ప్రజలంతా సుఖ సంతోషాలతో గడపాలని భగవంతునికి ఇష్టమైన సేవా కార్యక్రమాలు నిర్వహించేవారని చెప్పారు. అర్చకస్వామి రామకృష్ణ నేతృత్వంలో యాజ్ఞీకస్వామి వేదాంతం అనంత శ్రీనివాస భట్టర్ ఊంజల్ కళ్యాణోత్సవానికి సంబంధించిన పూజాధి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది.

## పేదల చికిత్సకు ముఖ్యమంత్రి సహాయనిధి

### -ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్



పొన్నూరు, సెప్టెంబరు 17,ప్రభాతవార్త: పేదల చికిత్సకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో తోడ్పడుతుందని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మాట్లాడుతూ పేద ప్రజలు వైద్యం చేయించుకునేందుకు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేదల కోసమే సీఎం రిలీఫ్ పండ్‌ను పెద్ద ఎత్తున మంజూరు చేసి అందజేస్తున్నారన్నారు. మండల పరిధిలోని కట్టెంపూడికి చెందిన కోడె రాధయ్యకు రూ.40,350, మన్నవ గ్రామానికి చెందిన పుట్టా రాజమ్మకు రూ.42,450, దొప్పలపూడి గ్రామానికి చెందిన గరికపాటి సాంబశివరావుకు రూ.1,42,545అందజేశారు. అదేవిధంగా చేబ్రోలు మండల పరిధిలోని పాతరెడ్డిపాలెంకు చెందిన ఏటుకూరి బాల వినీతకు రూ.61,261, నన్నెపాగ అజిత్‌కు రూ.4లక్షలు, చేబ్రోలు గ్రామానికి చెందిన షేక్ జాన్‌బికి రూ.42వేలు, నారాకోడూరు గ్రామానికి చెందిన వెలగా రాజశేఖర్‌కు రూ.25,495, మంచాల గ్రామానికి చెందిన చందు పున్నారావుకు రూ.18,819 చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకుడు వడ్రాణం మార్కండేయబాబు, బొర్రు రామారావు, మాదల వెంకటేశ్వరరావు, పఠాన్ అహమ్మద్‌ఖాన్, పఠాన్ ఫిరోజ్‌ఖాన్, షేక్ బాజిసాహెబ్, బొప్పన బాపనయ్య, మైలా వెంకటరామరాజు, బండ్లమూడి బాబూరావు తదితరులున్నారు.

## జన విజ్ఞాన్ వేదిక రాష్ట్ర అధ్యక్షుడిగా లక్ష్మణరావు


పొన్నూరు, సెప్టెంబరు 17,ప్రభాతవార్త: జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జన విజ్ఞాన వేదిక ద్వారా లక్ష్మణరావు ఎన్నో కార్యక్రమాలు నిర్వహించి ఎందరికో ఆదర్శంగా నిలిచారు. దీంతో లక్ష్మణరావును జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడిగా



నియమించాలని సభ్యులంతా ఏకగ్రీవంగా తీర్మానించారు. దీంతో లక్ష్మణరావు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ తనకు పదవులు ముఖ్యం కాదని, పదవి ఉన్నా లేకున్నా ప్రజల అవసరాలను తెలుసుకొని వాటిపై పోరాడడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. పేద, మధ్య తరగతి సామాన్య ప్రజలతో పాటు వివిధ సంఘాలు చేస్తున్న అన్నీ ఉద్యమాలకు, కార్యక్రమాలకు తన మద్దతు ఉంటుందని చెప్పారు. జన విజ్ఞాన వేదిక ద్వారా ప్రజల్లో చైతన్యం తెస్తానన్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన కెఎస్ లక్ష్మణరావును సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పి.నాగయ్య, కె.గోవిందరాజులు, కొండపల్లి విల్సన్, పిఆర్ రత్నకుమార్, ఎన్‌విఎస్ రఘుప్రదీప్, మెడతోటి రాకేష్, పిఎస్ ఆదిత్య, డి.నాగమణి తదితరులు అభినందించారు.

## భక్తిశ్రద్ధలతో విశ్వకర్మ జయంతి వేడుకలు

పొన్నూరు, సెప్టెంబరు 17,ప్రభాతవార్త: పట్టణంలోని షరాఫ్ బజారులో స్వర్ణకారుల అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం విశ్వకర్మ జయంతి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. స్వర్ణకారుల అసోసియేషన్ సభ్యుడు సాంతె బ్రహ్మం విశ్వకర్మ ప్రతిమలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మం మాట్లాడుతూ ప్రతి సంవత్సరం



సెప్టెంబరు 17వ తేదీని విశ్వకర్మ జయంతిగా జరుపుకోవడం జరుగుతుందన్నారు. కార్మాగారాలలో, పారిశ్రామిక ప్రాంతాలలో తప్పకుండా ఈ వేడుకలను నిర్వహిస్తారన్నారు. వారి పనిముట్లను విశ్వకర్మ ముందుంచి పూజిస్తారు. అన్ని వేదాలలో విశ్వకర్మను సృష్టికర్తగా పేర్కొన్నట్లు చెప్పారు. సకల వేదాల ప్రకారం విశ్వకర్మయే సృష్టి కర్త అని చెప్పారు. విశ్వకర్మ కిరాటాన్ని సువర్ణాభరణములను ధరించి ఎనిమిది హస్తములు కలిగి, ఒక చేతిలో నీటి బిందెను, ఒక చేత గ్రంథాన్ని, ఒక చేత ఉచ్చు మిగిలిన హస్తముల యందు వివిధాయుధాలను, పనిముట్లను ధరించి దివ్య పురుషునిగా దేవతలచే కీర్తించబడినవాడే విశ్వకర్మ అని చెప్పారు. వృత్తి విద్యలకు, నిర్మాణ రంగం, ఇంజనీరింగ్ విభాగాలకు సంబంధించిన విద్యలకు విశ్వకర్మయే అధిపతి అని చెప్పారు. విశ్వకర్మ సకల కళలకు ఆదిదేవుడని, అధిపతియని, దేవలోకాలను నిర్మించిన భవన శిల్పి, వాస్తు శిల్పి, స్థపతి(ఆర్కిటెక్చర్) దేవతలకు ఆకాశాన విహరించే పుష్పక విమానాలు, ఆయుధాలు, వివిధ రకాల సువర్ణాభరణాలు, పనిముట్లను సృష్టించి ఇచ్చిన రూపశిల్పి అని బ్రహ్మం కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకారులు పెద్ద ఎత్తున పాల్గొని తమ పనిముట్లను విశ్వకర్మ ముందుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## దాతల ఆశయాలను నెరవేరుస్తాం

### -కార్యనిర్వహణాధికారి ఎన్‌విఎన్ మల్లేశ్వరి

పొన్నూరు, సెప్టెంబరు 17,ప్రభాతవార్త: దాతల ఆశయాలకు అనుగుణంగా సత్రాలను నిర్వహిస్తామని కార్యనిర్వహణాధికారి ఎన్‌విఎన్ మల్లేశ్వరి అన్నారు. స్థానిక ఐలాండ్ సెంటర్‌లోని సుబ్బారాయ ధర్మ సత్రంలో పేదలకు అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. దాతలు ఏ ఆశయాల కోసం సత్రాలను ఏర్పాటు చేశారో వాటిని తు.చ తప్పకుండా అమలు చేస్తామన్నారు.అన్ని దానాల కన్న అన్నదానమె మిన్నయని, అందుకే దాతలు అన్నదాన కార్యక్రమాలకు కొంత నిధిని కేటాయించి అమలు చేస్తున్నారన్నారు. వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్తామన్నారు.



## యూరియా వాడకాన్ని తగ్గించాలి

పొన్నూరు, సెప్టెంబరు 17,ప్రభాతవార్త: రైతులు విచ్చలవిడిగా యూరియా వాడుతున్నారని, ఈ విధానాన్ని కొంత మేర తగ్గించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల వ్యవసాయాధికారి



పి.ప్రియదర్శని అన్నారు. చేబ్రోలు మండల పరిధిలోని శ్రీరంగపురం, తోట్లపాలెం రైతు సేవా కేంద్రాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రియదర్శిని మాట్లాడుతూ యూరియా వాడకం వల్ల చీడపీడల బాధ ఎక్కువవుతుందన్నారు. యూరియా వాడకాన్ని రైతులు తగినంత మాత్రమే ఉపయోగించుకోవాలన్నారు. ప్రతి ల్యాండ్ పార్సిల్ ఈ పంట కింద నమోదు చేయించుకోవాలన్నారు. యూరియా మీ చెంతకు కార్యక్రమంలో భాగంగా రైతులకు యూరియాను అందజేశారు. రైతులకు అవసరమైన మేర ఎరువుల నిల్వలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బిజెపి ఆధ్వర్యంలో ప్రధాని మోది జన్మదిన వేడుకలు

పొన్నూరు, సెప్టెంబరు 17,ప్రభాతవార్త: భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో బుధవారం భారతదేశ ప్రధానమంత్రి నరేంద్రమోడి జన్మదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని నాగేంద్రస్వామివారి పుట్ట వద్ద మోడి పేరున ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుడి ప్రాంగణంలోని పిచ్చిమొక్కలను తొలగించారు. స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని మోడి ప్రవేశపెట్టి ప్రజల్లో తీసుకెళ్ళి పరిశుభ్రత పాటించేవిధంగా



చేశారు. భారతదేశం అభివృద్ధి చెందాలంటే మోడి నాయకత్వమే దేశానికి అవసరమని పలువురు నాయకులు చెప్పారు. ప్రపంచ దేశాలతో భారతదేశం పోటీ పడుతుందన్నారు. ఈ సందర్భంగా భారీ కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంఠ గోవాడ వెంకటకృష్ణారావు, కలపాల శ్రీనివాసరావు, చిలకపాటి రామాచార్యులు, ఎస్.ఆకాష్, గురుబాలు, తన్నీరు శివరామకృష్ణ, చుక్కా వెంకటేశ్వర్లు, గుడివాడ పవన్ తదితరులు పాల్గొన్నారు.

## వరిపైరులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

పొన్నూరు, సెప్టెంబరు 17,ప్రభాతవార్త: ప్రస్తుతం వరిపైరులో ఆకుముడత పురుగు కనిపిస్తుందని, దీని పై రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని వ్యవసాయ విస్తరణాధికారి ఐ.శ్రీకాంత్ సూచించారు. మండల పరిధిలోని దండమూడి, మునిపల్లె గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ ఆకుముడత తెగులు నివారణకు ఎకరాకు 350గ్రాములు కార్టాస్ హైడ్రోక్లోరైడ్ పిచికారి చేయాలని సూచించారు. వరిపైరు దశ 60 నుండి 70రోజులు వ్యవధిలో ఉన్నందున రైతులు నత్రజని ఎరువుతోపాటు పొటాష్ ఎరువు ఎకరాకు 20కిలోలు కలిపి వేయాలన్నారు.

# 18 సంవత్సరాలు నిండిన మహిళలందరూ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి

### -బాపట్లలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు -

### -సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు ప్రణాళికలు: కలెక్టర్

బాపట్ల,సెప్టెంబర్17,ప్రభాతవార్త: జిల్లాలో స్వస్థ నారి సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం క్రింద 18 సంవత్సరా లు నిండిన మహిళ లందరూ తప్పని సరిగా క్యాన్సర్ స్కానింగ్ పరీక్షలు చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ బి.వినోద్‌కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక ఏరియా హాస్పిటల్ లో స్వస్థనారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ , శాసనస భ్యులు వేగేశననరేంద్ర వర్మ కలిసి ప్రారంభిం చారు.



ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడు తూ సంక్రమిత వ్యాధు లురాకుండా మహిళ లు ముందస్తుగా వైద్య పరీక్షలు చేయించు కోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్య మంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు వైజాగ్ లో ప్రారంభిస్తున్నారన్నారు. మహిళల ఆరోగ్య రక్షణ కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వా లు ఈనెల 17వ తేదీ నుండి అక్టోబర్2వ తేదీ వరకు అన్ని ప్రభుత్వ వైద్యశాలలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. జిల్లాలో ఆశా వర్కర్లు,ఎ. ఎన్. ఎం.లు ఇంటింటికి వెళ్లి క్యాన్సర్ పరీక్షల పై అవగాహన కల్పించాలన్నారు. మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధగా ఉండాలన్నారు.వైద్య పరీక్షలు చేయించుకొని వైద్యుల సూచన మేరకు మందులు వాడుకోవాలని ఆయన తెలిపారు. మహిళలు అవసరం ఉన్న లేకపోయినా కూడా క్యాన్సర్ వైద్య పరీక్షలు చేయించు కోవాలన్నారు. బాపట్ల జిల్లాలో ట్రామా కేర్ సెంటర్ ను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఏరియా హాస్పిటల్ లో వార్డులను ఓపి విభాగాన్ని పరిశీలించారు. ఏరియా హాస్పిటల్ లో రోగులతో మాట్లాడి వాళ్ళ సమస్యలను తెలుసుకున్నారు. బాపట్ల శాసన సభ్యులు వేగేసిన నరేంద్ర వర్మ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన మహిళల కోసం అన్ని స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ,జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి రాధా మాధవి, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాల్లో ఇఆఫీస్ ఫైల్స్ విధానం అమలులోకి రావాలి

బాపట్ల,సెప్టెంబర్17,ప్రభాతవార్త: ప్రభుత్వ కార్యాలయాలన్నిటిలో ఇఆఫీస్ ఫైల్స్ విధానం అమలులోకి రావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. కలెక్టరేట్ ఆవరణలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలను జిల్లా కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పారదర్శకత కొరకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ప్రతి దస్త్రాన్ని ఆన్ లైన్ లో ఉంచాలన్నారు. డ్వామా కార్యాలయంలో అత్యధికంగా దస్త్రాలు టేబుల్స్ పైనే ఉండడంపై ఆయన ప్రశ్నించారు. మరోసారి పునరావృతం కాకూడదని హెచ్చరించారు. ప్రభుత్వ కార్యాలయాల నుంచి కలెక్టర్ కు వచ్చే ప్రతి దస్త్రం ఇఆఫీస్ ఫైల్స్ విధానంలోనే రావాలన్నారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా కార్యాలయం, జిల్లా నీటి యాజమాన్య సంస్థ కార్యాలయం, జిల్లా ఆడిట్ కార్యాలయం, జిల్లా సహకార శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, పంచాయతీ శాఖ, మత్స్య, అగ్ని మాపక, గృహ నిర్మాణ శాఖల కార్యాలయాలను ఆయన పరిశీలించారు.ఆయన వెంట ఉప కలెక్టర్ లవన్న, తదితరులు ఉన్నారు.



## బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలులో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలి

బాపట్ల,సెప్టెంబర్17,ప్రభాతవార్త: బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలులో అంతరాయం లేకుండా అధికారులు వేగంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. బాపట్ల పట్టణంలోని వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాములను జిల్లా కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్లాక్ బర్లీ పొగాకు రైతులను ఆదుకోడానికే ప్రభుత్వం ముందుకు వచ్చిందన్నారు.బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలుపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాపట్ల జిల్లాలో ఎంతమంది రైతులు, ఎంత పంట సాగు చేశారో ఆరా తీశారు. మన జిల్లాలో గోదాముల సంఖ్య, వాటిలో నిల్వ సామర్థం, ప్రస్తుతం కొనుగోలు చేసిన పొగాకు నిల్వలపై సంబంధిత దస్త్రాలను పరిశీలించారు. నిల్వ సామర్థం లేకపోతే పొరుగు జిల్లాలకు వాటిని పంపే ఏర్పాట్లు చేయాలన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 7,788 మంది రైతుల నుంచి 12వేల మెట్రిక్ టన్నుల పొగాకును ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. మరో 1,600 మెట్రిక్ టన్నుల పొగాకును రైతుల నుంచి కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. మార్క్ ఫెడ్ ఏడి కరుణశ్రీ,, ఆర్డీవో పి.గ్లోరియా, తహసిల్దార్ సలీమా, తదితరులు ఉన్నారు.



## పతి కుటుంబాన్ని ఆరోగ్యంగా ఉంచడమే ప్రభుత్వ లక్ష్యం



కర్లపాలెం,సెప్టెంబర్17,ప్రభాతవార్త: కర్లపాలెం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో స్వస్ట్ నారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ గోపినాథ్ మాట్లాడుతూ ప్రతి కుటుంబాన్ని ఆరోగ్యవంతంగా ఉంచేందుకు కేంద్రప్రభుత్వం పలు వైద్య పథకాలను అమలు చేస్తున్నారన్నారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు స్వస్ట్ నారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాలు జిల్లాలో ప్రాథమిక,సామాజిక ఆరోగ్య ఆసుపత్రి ,ఉప కేంద్రాలలో జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ షాకిర్ పాషా, ఎంపీడీ యారం వనజ ,గ్రామ సర్పంచ్ నక్కా లలిత కుమారి ,సూపరింటెండెంట్ రజని తదితరులు పాల్గొన్నారు

## సుందరంగా తయారైన ఎంవి రాజుపాలెం స్మశాన వాటిక

కర్లపాలెం,సెప్టెంబర్17,ప్రభాతవార్త: జడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్ రెడ్డి బాపట్ల ఎమ్మెల్యే వేగేసన నరేంద్ర వర్మ సహకారంతో ఎంవి రాజుపాలెం హిందూ స్మశాన వాటికను ఎంతో సుందరంగా తీర్చిదిద్దారు,. ఎక్కడ లేని విధంగా స్మశాన ప్రవేశ ద్వారం వద్ద శివుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి దహన సంస్కారాల కోసం ప్రత్యేకంగా అధునాతనమైన గ్రిల్ ఏర్పాట్లు చేశారు. ఇది చూడటానికి ఎంతో ముచ్చటగా ఉంది. జడ్పీటీసీ వేణుగోపాల్ రెడ్డి తన ఆలోచనలకు అనుగుణంగా మోడల్ గా ఈ స్మశాన వాటికను గ్రామస్తులు పెద్దల సహకారంతో సుందరంగా తీర్చిదిద్దారు.



## విద్యార్థులకు అవగాహన



పిట్టలవానిపాలెం,సెప్టెంబర్17,ప్రభాతవార్త: మహిళలు, విద్యార్థినులు అత్యవసర పరిస్థితుల్లో శక్తి మొబైల్ యాప్ ను వినియోగించుకొని పోలీస్ శాఖ తక్షణ సహాయం పొందాలని చందోలు ఎస్ఐ వెంకట శివకుమార్ తెలిపారు. చందోలు జెడ్ పి హైస్కూల్ విద్యార్థులకు బుధవారం నాడు శక్తి మొబైల్ యాప్ ఆవశ్యకత, బాల్య వివాహాల నిషేధ చట్టం, సైబర్ నేరాలు, ఫోక్సో చట్టాలు ఇతర మహిళా సంబంధిత నేరాలపై ఎస్ఐ శివకుమార్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో అనుకోని ఆపద ఎదురైతే ఏ విధంగా ఎదుర్కోవాలి, ఏ విషయాన్ని ఎవరితో పంచుకోవాలి, మొదట ఎవరికీ చెప్పాలి, పోలీసులు సహాయం ఎలా తీసుకోవాలి అనే విషయాల గురించి విద్యార్థులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు.

## మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

బాపట్ల,సెప్టెంబర్17,ప్రభాతవార్త: మత్తుపదార్థాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గంజాయి, ఇతర మత్తుపదార్థాల వలన కలిగే దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని జిల్లా పోలీస్ అధికారులు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఉమామహేశ్వర్ మాట్లాడుతూ మత్తుపదార్థాలకు బానిసలవుతున్న వారిలో ఎక్కువ శాతం విద్యార్థులు, యువతే ఉన్నారన్నారు. గంజాయి, ఇతర మత్తుపదార్థాలను రవాణా చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ ల పరిధిలో ఉన్న పాఠశాలలు, కళాశాల విద్యార్థులకు మత్తుపదార్థాల వలన కలిగే అనర్ధాలు, వాటి బానిసత్వం వల్ల ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు, భవిష్యత్తుపై కలిగే ప్రభావం మొదలైన అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. గంజాయి మరియు ఇతర మత్తుపదార్థాలు సమాజంపై తీవ్రమైన దుష్ప్రభావం చూపుతున్నాయన్నారు. గంజాయి లేదా ఇతర మత్తుపదార్థాలను కలిగి ఉన్నా, వాటిని విక్రయిస్తున్నా లేదా వినియోగిస్తున్నా వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ లేదా టోల్ ఫ్రీ నంబర్లు 1972, 112 లకు సమాచారం ఇవ్వాలన్నారు. జిల్లా ఈగల్ టీమ్ సభ్యులు,పోలీస్ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.



# బాపట్ల జిల్లా వార్త



## 'ప్రతి మానవాళి విశ్వకర్మ సిద్ధాంతాలను పాటిస్తూ ముందడుగు వేయాలి'

బాపట్ల,సెప్టెంబర్17,ప్రభాతవార్త: ప్రతి మానవాళి విశ్వకర్మ సిద్ధాంతాలను పాటిస్తూ ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా స్థానిక కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాల్లో విశ్వకర్మ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ మరియు బాపట్ల శాసనసభ్యులు వేగేశిన నరేంద్ర వర్మ రాజుతో కలిసి బుధవారం పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాపట్ల జిల్లాలోని ప్రజలకు, అధికారులకు, వివిధ విశ్వకర్మ సంఘం నాయకులకు విశ్వకర్మ జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు.రాష్ట్ర ప్రభుత్వం విశ్వకర్మ జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించడానికి ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.విశ్వకర్మ సిద్ధాంతాలను పాటిస్తూ నిర్మాణాలు కొనసాగుతున్నాయన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ విశ్వకర్మ కుల వృత్తుల అభివృద్ధికి ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన అనే పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. ఈ పథకాన్ని జిల్లాలో అమలు చేస్తూ విశ్వకర్మ కుల వృత్తులు చేసే వారికి బ్యాంకు రుణాలు అందజేసి, వారి అభివృద్ధికి సహాయ సహకారాలు అందజేస్తామని, ఈ అవకాశాన్ని విశ్వకర్మ కుల వృత్తుల వారు అందిపుచ్చుకొని అభివృద్ధి చెందాలన్నారు. శాసనసభ్యులు వేగేశిన నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూ విశ్వకర్మ సంఘ సభ్యులకు విశ్వకర్మ జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇంచార్జ్ జిల్లా సంయుక్త కలెక్టర్ జి గంగాధర్ గౌడ్, రేపల్లె సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి బి శివ నాగేశ్వరరావు,జిల్లా అధికారులు, విశ్వకర్మ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు,




## రూ.32.53.838 సిఎం సహాయనిధి చెక్కుల పంపిణి

## సిఎం సహాయనిధి పేదలపాలిట వరం: ఎమ్మెల్యే 'వేగేశన'

బాపట్ల,సెప్టెంబర్17,ప్రభాతవార్త: సీయం సహాయ నిధి పేదలకు వరం వంటిదని బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్రవర్మ అన్నారు.స్థానిక పార్టీ కార్యాలయంలో సిఎం సహాయనిధి లబ్ధిదారులకు నగదు చెక్కుల పంపిణి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా




ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ రూ. 32,53,838 విలువ గల చెక్కులను 40మంది లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరిగిందన్నారు.వైద్య ఖర్చుల సహాయార్థం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి సంక్షేమ నిధి సీఎం రిలీఫ్ ఫండ్ నుండి వచ్చిన నగదు చెక్కులను లబ్ధిదారులకు అందజేసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు,ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి సంక్షేమ దృక్పథానికి నిదర్శనమన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజా సమస్యలు త్వరగతిన పరిష్కరిస్తూ, ప్రజలకు అన్ని విధాలుగా సహాయ సహకారాలను అందిస్తుందని అన్నారు.లబ్ధిదారులు,నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## కొల్లా వెంకయ్య 27వ వర్ధంతి : ప్రముఖుల ఘన నివాళులు

పెదనందిపాడు సెప్టెంబర్ 17 (ప్రభాతవార్త). పెదనందిపాడు ప్రాంత ప్రజల ప్రియతమ నాయకుడు, స్వాతంత్ర్య సమర యోధుడు, కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, శాసనసభ్యునిగా, శాసన మండలి సభ్యునిగా, పార్లమెంటు సభ్యునిగా ప్రజా వాణిని వినిపించిన కామ్రేడ్ కొల్లా వెంకయ్య 27వ వర్ధంతి సందర్భంగా పెదనందిపాడులో బుధవారం పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన వారి అభిమానులు సహచరులు తొలత వారి విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం



కామ్రేడ్ కొల్లా వెంకయ్య గ్రంథాలయంలో జరిగిన సభలో వారి అభిమానులతో పాటు వారి తనయుడు నేటి రైతు ప్రజానాయకుడు డాక్టర్ కొల్లా రాజమోహన్రావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు ఉద్యమం పై ప్రభుత్వ దమనకాండ కు నిరసనగా పార్లమెంటు సభ్యత్వానికి తృణప్రాయంగా రాజీనామా చేసిన మొదటి పార్లమెంటు సభ్యుడు కొల్లా వెంకయ్య అని, అణగారిన ప్రజల విముక్తి కోసం, పేద ప్రజలకు భూమికోసం, భూసంస్కరణల కోసం , రైతాంగ సమస్యల పరిష్కారం కోసం సభలు, సమావేశాలు, చట్టసభల్లో పోరాటం నుండి తెలంగాణా, శ్రీకాకుళ రైతాంగ సాయుధ పోరాటం వరుకూ అన్ని పోరాట రూపాలనూ ఆచరించి చూపించారని తెలిపారు.గ్రామీణ పేదల సంఘాన్ని స్థాపించి పేదలకు భూమి కోసం గ్రామాల నుండి సుప్రీం కోర్టు వరకు పోరాడారు. 1977 లో నల్లమడ రైతు సంఘాన్ని స్థాపించి ప్రజలను కదిలించి వరదల నివారణకు మహోద్యమాన్ని నడిపించారని తెలిపారు. పెదనందిపాడు ప్రాంతానికి సాగునీరు, తాగునీరు కృష్ణానది నుండి ఇవ్వాలని పెదనందిపాడు హైలెవెల్ ఛానల్ ను (గుంటూరు ఛానల్ ను )నిర్మించాలని జీవితాంతం పోరాడారని అన్నారు. కార్యక్రమంలో ముందుగా పాత బస్టాండ్ సెంటర్ లోని కొల్లా వెంకయ్య విగ్రహానికి పూలమాలలు వేసి జోహార్లు తెలిపారు. పాత బస్టాండ్ లోని కొల్లయ్య వెంకయ్య విగ్రహానికి సిపిఎం నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు. ముద్దన వెంకటేశ్వర్లు. నల్లమోతు రాజేంద్ర. జంపని రామారావు. కాపు వెంకట సుబ్బారావు లు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం దోప్పలపూడి రమేష్ బాబు మాట్లాడుతూ నల్లమడ ఆధునీకరణ గుంటూరు ఛానల్ పొడిగింపు పనులు పూర్తి చేయటమే కామ్రేడ్ కొల్ల వెంకయ్యకు మనం ఇచ్చే నిజమైన ఘనమైన నివాళులు అన్నారు .కొల్లా వెంకయ్య వర్ధంతి సందర్భంగా గత మూడు రోజులు పాటు విద్యార్థులకు నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు. బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హేమంతి దేవి, మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ. యార్లగడ్డ అంకమ్మ చౌదరి, దొప్పలపూడి రమేష్ బాబు, ఆళ్ల సుబ్బారావు, కుర్ర హరిబాబు, పలు ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు.

## 'తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం'

కొల్లూరు, సెప్టెంబర్ 17, ప్రభాతవార్త: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని కొల్లూరు సెక్టార్ ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రజనీ అన్నారు. బుధవారం కొల్లూరు హైస్కూల్ ఆవరణలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పోషణ మాసోత్సవ కార్యక్రమంలను ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో సూపర్‌వైజర్ రజనీ మాట్లాడుతూ తల్లిపాలు పిల్లలకు బలమైన పోషకాహారంగా పని చేస్తాయన్నారు. గర్భవతులు ప్రతి నెల వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. పిల్లల ఉబకాయం రాకుండా తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. పిల్లల బరువులు అదుపులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు కావ్య, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు వనజ, నీరజ, ఆదిలక్ష్మి, అపర్ణ, అరుణ, రత్నకుమారి, తదితరులు పాల్గొన్నారు.




**దోనేపూడి సెక్టార్ పరిధిలో :**

దోనేపూడి సెక్టార్ పరిధిలో సూపర్‌వైజర్ ఫజరున్నీసా ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సందర్భంగా తల్లులకు బాలింతలకు పలు సూచనలు తెలియజేశారు. అనంతరం పోషకాహార ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యం: మంత్రి 'నాదెండ్ల'

తెనాలి టౌన్, సెప్టెంబర్ 17, ప్రభాతవార్త: కేంద్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన "స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్" కార్యక్రమంను,రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి, స్థానిక శాసనసభ్యులు, నాదెండ్ల మనోహర్ పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మనదేశ ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమం ప్రారంబించడం సంతోషదాయకం అన్నారు. దేశ స్థితిగతులు మార్చిన వ్యక్తి ప్రధానమంత్రి నరేంద్రమోడీ అన్నారు. "మహిళ ఆరోగ్యం జాతీయ ఆరోగ్యం" అని ఆలోచించి " స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్" ప్రారంభించారన్నారు. ఆరోగ్యవంతమైన మహిళ శక్తి వంతమైన, ఆరోగ్యవంతమైన కుటుంబానికి నిలయంగా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో 40 మంది వృద్ధులు,దివ్యాంగులకు వీల్ చైర్లు,వాకింగ్ స్టిక్స్,హియరింగ్ బర్డ్స్ అందజేశారు. అదేవిధంగా పట్టణంలో,రూరల్ గ్రామాల్లో, కొల్లిపరమండలంలోని దివ్యాంగులకు త్వరలో మరిన్ని వీల్ చైర్లను అందజేస్తామని తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్,జిల్లా వైద్యశాల వైద్యులు మరియు అధికారులతో కలిసి స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ పోస్టర్ ను విడుదల చేశారు.అనంతరం వైద్యశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని, ప్రదర్శన శాలలను సందర్శించారు.ఈ కార్యక్రమంలో మంత్రి వెంట ఆయన సతీమణి డాక్టర్ మనోహరం, కూటమి నాయకులు,పెద్దఎత్తున కార్యకర్తలు, జిల్లా వైద్యశాల సూపరెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి, వైద్యశాల సిబ్బంది,ఎఎన్ఎం లు పాల్గొన్నారు.




## 'పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి'



తెనాలి మునిసిపాలిటీ, సెప్టెంబర్ 17, ప్రభాతవార్త: పురపాలక సంఘం పాఠశాలల్లో, విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని,మున్సిపల్ చైర్మన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు.బుధవారం పురపాలక సంఘ పరిధిలోని 22వ వార్డు మఠం బజార్ లోని మునిసిపల్ స్పెషల్ ఎలిమెంటరీ స్కూల్ ను పర్యవేక్షి ంచి స్కూల్ గదులను తనిఖీ చేసి కిటికీలు మరియు కరెంట్ సరఫరా పనులు చేయించవలసినదిగా మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ కి ఆదేశాలు జారీ చేసిన చైర్మన్ తాడిబోయిన రాధిక.ఈ కార్యక్రమంలో 22వ వార్డు కౌన్సిలర్ షేక్ మహబూబ్ బాష,మునిసిపల్ డీఇ అంకలు శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఇంజనీర్ సూరిబాబు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్టీసీ డిపోను సందర్శించిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు

తెనాలి టౌన్, సెప్టెంబర్ 17, ప్రభాతవార్త: ఏపీఎస్ఆర్టీసీ జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు బుధవారం తెనాలి ఆర్టీసీ డిపోని సందర్శించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ రాజశేఖర్ ను కలిసి, తెనాలి ఆర్టీసీ డిపో నిర్వహణ సిబ్బంది పనితీరు ప్రయాణికులకు కావలసిన మోలిక సదుపాయాలు గురించి తెలుసుకున్నారు. అలాగే ప్రభుత్వం మహిళల కోసం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణం స్త్రీశక్తి పథకం గురించి ఆరాతీశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం శ్రీ శక్తి పథకం ప్రవేశపెట్టిన తర్వాత గతంలో కంటే 20!! అదనంగా మహిళలు ఆర్టీసీ బస్సులు ప్రయాణం చేస్తున్నారని డిపో మేనేజర్ రాజశేఖర్ వెల్లడించారు.అలాగే ఆర్టీసీ ప్రయాణికుల భద్రతకి ప్రాధాన్యత ఇస్తుందని, ప్రయాణికులు కూడా ఆర్టీసీని ఆదరించాలని,ఆయన కోరారు.ఈ సందర్భంగా ఏపీఎస్ఆర్టీసీ జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు నాగేంద్రప్రసాద్ అప్పలరాజు, జంగల్ రెడ్డి, డిపో ప్రాంగణం అంతా కలియతిరిగి,సిబ్బంది పనితీరు, ప్రయాణికులకు కావలసిన సౌకర్యాలు గురించి, ఆరా తీశారు.



## అయోధ్య రాముని 'విల్లు'కు పూజలు



తెనాలి రూరల్, సెప్టెంబర్ 17, ప్రభాతవార్త: రూరల్ గ్రామమైన అంగలకుదురు లోని, దాసకూటి ఆశ్రమంలో అయోధ్య శ్రీరాముని విల్లు కు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.అయోధ్య లోని రామమందిరం ఎదుట నిర్మించ తలపెట్టిన,కళ్యాణ మండపము వద్ద,శ్రీరాముని వంశీయులచే ప్రతిష్ట జరుపుకోనున్న,108 అడుగుల రాముని విగ్రహప్రతిష్ట ఏర్పాట్లు జరుగుతున్న సందర్భంలో, ఇందులో భాగంగా శ్రీరాముని చేతిలో ఉండే విల్లు,పాదుకలను అంగలకుదురు గ్రామం లోని దాసకూటి ఆశ్రమంలో పూజలు నిర్వహించి అయోధ్యకు తరలించనున్నారు.ఈ సందర్భంగా తెనాలి పట్టణం, అంగలకుదురు గ్రామం, మరియు పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకుని శ్రీరాముని విల్లుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## గ్రేస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు


తెనాలి టౌన్, సెప్టెంబర్ 17, ప్రభాతవార్త: భారత ప్రధాని నరేంద్ర మోడీ 75వ పుట్టినరోజు వేడుకలను పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆశీస్సులతో "గ్రేస్ ఫౌండేషన్" కార్యాలయంలో ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ కైతపల్లి శాలెం రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం పట్టణంలోని చెంచుపేటలో గల గ్రేస్ ఫౌండేషన్,జేఆర్ మేనేజ్మెంట్ అండ్ సెక్యూరిటీ సర్వీసెస్ కార్యాలయంలో కేక్



కట్ చేసి ప్రధానికి కైతపల్లి శాలెంరాజు శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం శాలెంరాజు అభిమానులకు మిఠాయిలు తినిపించి సంతోషాన్ని వ్యక్తం చేశారు. వేమూరు నియోజకవర్గ టిడిపి నాయకులు శివకుమార్, కుక్కల వెంకటేశ్వరరావు సీనియర్ న్యాయవాది,మాజీ ఏపీపీ ఇందుపల్లి రాజారాం, న్యాయవాది శుద్ధపల్లి మురళీధర్,మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ కుమార్, ఎమ్మార్పీఎస్ తెనాలి పట్టణ అధ్యక్షులు కొండముది బోసు బాబు మాదిగ,ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకురాలు ఆలపాటి కరుణ మాదిగ, మాజీ సైనికోద్యోగి నలుకుర్తి రవికుమార్,మూల్పూరు గ్రామ టిడిపి అధ్యక్షులు నూతక్కి సునీల్ కుమార్,నాయకులు సౌపాటి శ్రీను,నలుకుర్తి చందు జోసఫ్,దమ్ము నరేంద్ర వర్మ, గుంటూరు నాగేశ్వరరావు, పులివర్తి లక్ష్మయ్య, ఆనంద్, ఆలపాటి పూర్ణచంద్ర కుమార్, వేమూరు రాజశేఖర్, వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ

తెనాలి రూరల్, సెప్టెంబర్ 17, ప్రభాతవార్త: "స్పిక్ అండ్ గ్రీన్ స్టార్" ఫెర్టిలైజర్స్ సంస్థ సూచనల మేరకు ఆ సంస్థ ఏరియా ప్రతినిధులు,విద్యార్థులకు పుస్తకాలు,బ్యాగులు, విద్యసామాగ్రి పంపిణీ చేశారు. బుధవారం మండలంలోని నందివెలుగు గ్రామంలో గల మండల పరిషత్ ఉర్దూ పాఠశాలలో విద్యార్థులకు పుస్తక సామాగ్రి పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ కరీముల్లా పర్యవేక్షి ంచగా పాఠశాల ఉపాధ్యాయులు బివి సుబ్బారావు సహాయ సహకారాలు అందించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జ్యోతి ఫెర్టిలైజర్స్ తెనాలి నిర్వాహకులు సురేష్, ఫెర్టిలైజర్స్ సంస్థ మార్కెటింగ్ డెవలప్మెంట్ ఎగ్జిక్యూటివ్ ఎం. అబ్దుల్ సుభాన్ సిబ్బంది చేతుల మీదుగా విద్యార్థులకు పుస్తక సామాగ్రిని అందజేశారు.ఈ కార్యక్రమంలో అబ్దుల్ సుభాన్ మాట్లాడుతూ స్పిక్ అండ్ గ్రీన్ స్టార్ ఫెర్టిలైజర్స్ సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ప్రాతిపదికన విద్యార్థులకు ఈ సేవలందించినట్లు తెలిపారు. ప్రతిఏటా ఈ రీతిగా సమాజ సేవలను సంస్థ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ జగదీష్, మార్కెటింగ్ డెవలప్మెంట్ అధికారి చంద్రశేఖర్ ఆజాద్ జూనియర్ మార్కెటింగ్ ఆఫీసర్, సిహెచ్. విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రధాని మోడీ జన్మదిన వేడుకలు

కొల్లిపర,సెప్టెంబరు 17 ప్రభాతవార్త: ప్రధాన మంత్రి నరేంద్రమోడీ 75 వ జన్మదిన వేడుకలను మండల కేంద్రం కేంద్రమైన కొల్లిపరలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పేదలకు పాయసం..పులిహార పంపిణీ చేసారు.కార్యక్రమంలో మండల పార్టీ అద్యక్షులు మంద్రు మురళి,పార్టీ జిల్లా సోషల్ మీడియా కో-కన్వినర్ ఆరిమండ మణిధీప్‌రెడ్డి,ఆరిమండ రామిరెడ్డి,పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ నెంబరు మునగాల కృష్ణమూర్తి,మండల పార్టీ ప్రధాన కార్యదర్శి డివి అశ్వనీకుమార్,జనసేన మండల అద్యక్షుడు ఎర్రు వెంకయ్యనాయుడు,టీడీపీ నాయకులు భీమవరపు లంక కోటిరెడ్డి,కూటమి నాయకులు పాల్గొన్నారు.



## శివశక్తి ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు అభినందనీయం: మంత్రి 'గొట్టిపాటి'

### నూతన బస్‌షెల్టర్ ప్రారంభం

వినుకొండ, సెప్టెంబర్17, ప్రభాతవార్త: శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ప్రజలకు చేస్తున్న అభివృద్ధి, సేవా కార్యక్రమాలు అభినందనీయని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు.



ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్నార్టీ రోడ్డు నందు ఏరా ్పటు చేసిన నూతన బస్‌షెల్టర్‌ను చీఫ్‌విప్ జీ.వీతో కలిసి మంత్రి గొట్టిపాటి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఛైర్మన్ గోనుగుంట్ల లీలావతి, మహిళా కార్పొరేషన్ ఛైర్మన్ రాయపాటి శైలజ, డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, మున్సిపల్ కమీషనర్ సుభాష్‌చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

## మారెళ్ళవారిపాలెంలో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ

నూజెండ్ల, సెప్టెంబర్17, ప్రభాతవార్త: మండలంలోని మారెళ్ళవారిపాలెం గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, క్లస్టర్ ఇంచార్జులు, సచివాలయ అధికారులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో పేదలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జిల్లాలో ఎక్కడైనా రేషన్ తీసుకునేందుకు వీలుగా స్మార్ట్ రేషన్ కార్డులు అందజేయడం అభినందనీయమన్నారు.



## 'మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి'



ఈపూరు, సెప్టెంబర్17, ప్రభాతవార్త: మాదకద్రవ్యాల వల్ల కలిగే చెడు ప్రభావాల పట్ల ప్రతి ఒక్కరు అవగాహనతో అప్రమత్తంగా ఉండాలని ఈపూరు ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ డి. వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ముఖ్యంగా పిల్లలు, విద్యార్థుల ప్రవర్తనను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిత్యం గమనిస్తూ ఉండాలని చెప్పారు. మాదకద్రవ్యాల వినియోగం చట్టరీత్యా నేరమని పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## 'వావిలాల'కు నివాళులర్పించిన ఎమ్మెల్యే 'కన్నా'

సత్తెనపల్లి, సెప్టెంబరు 17 ప్రభాతవార్త : స్వాతంత్ర్య సమరయోధులు, పద్మభూషణ్, మాజీ శాసనసభ్యులు వావిలాల గోపాల కృష్ణయ్య 120వ జయంతిని బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ వావిలాల స్మృతివనంలో ఉన్న వావిలాల గోపాలకృష్ణయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ వావిలాల గోపాలకృష్ణయ్య అందించిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వివిధ హోదాలలో ఉన్న రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, మండల నాయకులు పాల్గొన్నారు.



**విశ్వకర్మ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా....**

పట్టణంలోని విశ్వబ్రాహ్మణ కళ్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన విశ్వకర్మ జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వకర్మ చేసిన వివిధ రకాల సేవలను, అద్భుతాలను గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ అవి తెలుసుకొని ఆదర్శంగా నిలవాలన్నారు.

## ఘనంగా ప్రధాని మోడీ జన్మదిన వేడుక



సత్తెనపల్లి, సెప్టెంబరు 17 ప్రభాతవార్త : ప్రధానమంత్రి నరేంద్రమోడీ జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ బుధవారం పాల్గొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కేక్ కట్‌చేసి మిఠాయిలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ భారతదేశాన్ని ప్రపంచంలోనే శక్తివంతమైన దేశంగా మోడీ మలిచారన్నారు. కూటమి నాయకత్వంలో దేశంతో పాటు రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో వివిధ హోదాలలో ఉన్న జిల్లా, నియోజకవర్గ, మండల నాయకులు పాల్గొన్నారు.

## స్వస్త్‌నారీ..స్వశక్తి పరివార్ అభియాన్ చరిత్రలో నిలిచిపోతుంది : ఎమ్మెల్యే 'కన్నా'

సత్తెనపల్లి, సెప్టెంబరు 17 ప్రభాతవార్త : పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో ఉన్న ప్రాథమిక హెల్త్ సెంటర్‌లో స్వస్త్‌నారీ..స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య వ్యవస్థను ప్రపంచంలో అద్భుతంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ప్రధాని మోడీ నిలిపారన్నారు. మహిళల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. ఈ నెల 17 నుండి అక్టోబర్ 2 వరకు ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు మహిళల కోసం నిర్వహించడం జరుగుతుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గ, మండల నాయకులు పాల్గొన్నారు.



## ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు

రాజుపాలెం, సెప్టెంబరు 17 ప్రభాతవార్త : మండలంలోని గణపవరం గ్రామంలోని ఎస్సీ కాలనీలో బుధవారం దళిత బహుజన రిసోర్స్ ఆధ్వర్యంలో డిజిటల్, ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిబిఆర్‌సి ఏరియా కోఆర్డినేటర్ జి.కోటేశ్వరరావు అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో కోటిరత్నం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఎస్సీ ఎస్టీ రైతులు, కౌలు రైతులు, రైతులు, డ్వాక్రా మహిళలు బ్యాంక్ నుంచి వస్తున్న లోన్స్‌ను పొందువలు, క్రాప్ లోన్స్ గురించి తెలియజేశారు. చైతన్య గ్రామీణ బ్యాంక్ మేనేజర్ లక్ష్మీకుమార్ మాట్లాడుతూ డిజిటల్ టెక్నాలజీ ద్వారా నాణ్యమైన ఆర్థిక సేవలు వినియోగించడం ఆర్థిక నిర్ణయాలు సరైన రీతిలో తీసుకోవడంలో అవసరమైన అవగాహన నైపుణ్యాలు, డిజిటల్ పేమెంట్స్ పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ ఏటిఎం, పాన్ కార్డు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్వతి, గ్రామ పెద్దలు, కమ్యూనిటీ రైతులు, మహిళా రైతులు పాల్గొన్నారు.



## భారీ ప్యాకేజీలతో ఎన్ఇసి విద్యార్థులకు ఉద్యోగాలు

నరసరావుపేట, సెప్టెంబరు 17 ప్రభాతవార్త : భారీ ప్యాకేజీలతో ఎన్ఈసీ విద్యార్థులు ఉద్యోగాలను సాధించినట్లు కళాశాల ఛైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు బుధవారం తెలియజేశారు. వివరాలను వైస్ ఛైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, డైరెక్టర్ మిట్టపల్లి రమేష్‌లు తెలియజేశారు. ప్రముఖ బహుళజాతి సంస్థ ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్‌లో ఈ ఉద్యోగాలను సాధించడం జరిగిందన్నారు. కళాశాలకు చెందిన జానకిదేవి, తేజ్‌చరణ్, తాతానుమంత్, అఫ్రికేషన్ ఇంజనీర్లుగా ఎంపికయ్యారన్నారు. వారికి వార్షిక వేతనం రూ.13.80 లక్షలు ఉంటుందన్నారు. ఎంపికైన విద్యార్థులను ఛైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు అభినందించారు.



## 'సహకార సంఘాల అభ్యున్నతే ధ్యేయం'

నరసరావుపేట, సెప్టెంబరు 17 ప్రభాతవార్త : జాతీయ సహకార విధానం – 2025 పై సహకార సంఘాల కమిషనర్, రిజిస్ట్రార్ ఆదేశాల మేరకు బుధవారం అవగాహన సదస్సు జరిగింది. జిల్లా అధికారి నాగరాజు అధ్యక్షత వహించి మాట్లాడారు. డివిజనల్ కోఆపరేటివ్ అధికారి తిరుపతయ్య, స్వర్ణ చిన్నరామిరెడ్డి, సొసైటి అధ్యక్షులు జి.అప్పారావు, కొండవీటి జయప్రసాద్, నాగమల్లేశ్వరరావు, కరీముల శివ నాగేశ్వరరావు తదితరులు పాల్గొని మాట్లాడారు.

## సీఎం సభకు డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులు హాజరు కావాలి : డిఇఒ

నరసరావుపేట, సెప్టెంబరు 17 ప్రభాతవార్త : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అమరావతిలో ఈ నెల 19న నిర్వహించే సభకు డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులు హాజరు కావాలని డిఈవో చంద్రకళ సూచించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎంపికైన ఉపాధ్యాయులు ఈ నెల 18వతేదీ మధ్యాహ్నం 2 గంటలకు గుంటూరులోని ఆంధ్ర ముస్లిం కళాశాలలో రిపోర్టు చేయాలన్నారు. అక్కడ ఉపాధ్యాయులకు ఐడీ కార్డులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రత్యేక బస్సుల ద్వారా ఉపాధ్యాయులను సభకు తరలించడం జరుగుతుందని డిఈవో చంద్రకళ తెలియజేశారు.

# పల్నాడు జిల్లా వార్త



## మహిళల ఆరోగ్యంతోనే సమాజం ఆరోగ్యంగా ఉంటుంది : ఎమ్మెల్యే డాక్టర్ 'చదలవాడ'

నరసరావుపేట, సెప్టెంబరు 17 ప్రభాతవార్త : మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబాలు, సమాజం ఆరోగ్యంగా ఉంటాయని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ ఆరోగ్య శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమానికి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి ఛైర్మన్ డాక్టర్ లక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు మాట్లాడుతూ మహిళా సాధికారత కొరకు జరుగుతున్న వివిధ కార్యక్రమాలను ఈ సందర్భంగా ఆయన వివరించారు. పిల్లల ఆరోగ్య సంరక్షణ, సేవల కొరకు ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను చేపడుతుందన్నారు. మహిళలకు ఈ నెల 17 నుండి అక్టోబర్ 2 వరకు ప్రత్యేకంగా వైద్య సేవలను విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రత్యేక క్యాంప్‌ల ద్వారా వివిధ రకాల స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. మాతా శిశు సంరక్షణ, ఋతుక్రమ పరిశుభ్రత, వ్యాధి నిరోధక టీకాలు, పోషకాహారం తదితర అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు ఛైర్మన్ పూనాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



## స్మార్ట్ కార్డులను పంపిణీ చేసిన జనసేన నాయకులు

నరసరావుపేట, సెప్టెంబరు 17 ప్రభాతవార్త : జనసేన నాయకులు అద్దేపల్లి ఆనంద్, గుప్తా శ్రీకాంత్, మోదుగుల హేమలయ్య, కొలిపాక చంద్రశేఖర్, నరసింహారావు, ఆదినారాయణలు బుధవారం స్మార్ట్ కార్డులను కార్డుదారులకు పంపిణీ చేశారు. పట్టణంలో జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ స్మార్ట్ కార్డుల వలన కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. ఎన్డీయే ప్రభుత్వ హయాంలో పౌరసరఫరాలశాఖామంత్రి నాదెండ్ల మనోహర్ నాయకత్వంలో ఈ కార్యక్రమం విజయవంతంగా రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతుందని తెలియజేశారు.



## ఇక్కుర్రులో 'పొలం పిలుస్తోంది': వరి నాట్లు వేసిన ఎమ్మెల్యే



నరసరావుపేట, సెప్టెంబరు 17 ప్రభాతవార్త : మండలంలోని ఇక్కుర్రు గ్రామంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు బుధవారం వరినాట్లు వేశారు. వ్యవసాయ అధికారులు, అన్నదాతలతో కలిసి ఆయన వరినాట్లు వేశారు. అన్నదాతలు ఎప్పుడు సంతోషంగా ఉంటే అప్పుడు సమాజం బాగుంటుందన్నారు. యూరియా కొరత లేకుండా అందిస్తామన్నారు. గ్రామాలలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు రానివ్వబోమన్నారు. కొంత మంది అబద్దపు వాస్తవాలను ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. నానో యూరియా సాధారణ యూరియా వలే పని చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి జగ్గయ్య, మార్కెట్‌యార్డు ఛైర్మన్ పూనాటి శ్రీనివాసరావు, కనుమూరి రమేష్ పాల్గొన్నారు.

**ములకలూరులో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ.**

మండలంలోని ములకలూరు గ్రామంలో స్మార్ట్ రేషన్‌కార్డులను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు పంపిణీ చేశారు. ఈ కార్డుల ద్వారా లబ్ధిదారులు సులభంగా రేషన్ పొందవచ్చని తెలియజేశారు. ఎమ్మార్పీయస్ నాయకులు చింతిరాల మీరయ్య తదితరులు ఉన్నారు.

**భగవాన్ విశ్వకర్మ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చదలవాడ...**

భగవాన్ విశ్వకర్మ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఈ కార్యక్రమం జరిగింది. బిసి వెల్ఫేర్ జిల్లా అధికారులు శ్రీనివాసరావు, డిఆర్‌ఓ మురళీ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్‌శాఖ కార్యాలయంలో నిరసన

రొంపిచర్ల, సెప్టెంబరు 17 ప్రభాతవార్త : విద్యుత్ రంగంలో దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని బుధవారం రాష్ట్ర విద్యుత్ జేఏసి నాయకులు ఆర్.బంగారయ్య నాయకత్వంలో ఉద్యోగులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్‌రంగ సంస్థలలో సుదీర్ఘకాలంగా అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఈ నెల 15 నుండి దశలవారీగా ధర్నా కార్యక్రమాలు జరుగుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, సబ్‌స్టేషన్‌లలో షిఫ్ట్ ఆపరేటర్లు ఈ ఆందోళనలో పాల్గొన్నట్లు నాయకులు బంగారయ్య తెలిపారు.




## అనుమతులు లేకుండా ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారు : డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట, సెప్టెంబరు 17 ప్రభాతవార్త : ప్రభుత్వశాఖల నుండి ఎటువంటి అనుమతులు లేకుండా రొంపిచర్ల మండలంలోని బుచ్చిపాపన్నపాలెం గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో ఉన్న ఆస్తులను ధ్వంసం చేశారని వైకాపా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి విమర్శించారు.



బుధవారం గ్రామ పెద్దలు, సర్పంచ్, ఎంపిటిసిలతో కలిసి అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశీలించి మాట్లాడారు. అక్కడ ధ్వంసం చేసిన మరుగుదొడ్లు, వంట గది, మంచినీటి ట్యాంక్, 40-50 సంవత్సరాల నుండి ఉన్న భారీ వృక్షాలను కూల్చివేసిన దృశ్యాలను మీడియాకు చూపారు. అనధికారికంగా పంచాయితీ తీర్మానం లేకుండా, వర్క్ ఆర్డర్లు లేకుండా నిర్వహిస్తున్న పనులను పరిశీలించారు. 1993లో డిస్ట్రిక్ ప్రైమరీ ఎడ్యుకేషనల్ సెంటర్‌ను అక్కడ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తర్వాత ఓసి, బిసి పిల్లలకు అంగన్‌వాడీ సెంటర్‌ను నడుపుతున్నట్లు తెలియజేశారు. దీనిపై స్పందించాల్సిన ఎంపిడివో, ఎంఈవో, పోలీస్‌శాఖ, సిడిపివో కనీసం పట్టించుకోవడం లేదన్నారు. జిల్లా కలెక్టర్‌కు ఈ విషయాలను తెలియజేస్తామని పేర్కొన్నారు. గ్రామంపై కక్ష్యపూరితంగా మంచినీరు ఇవ్వడం లేదని, పారిశుద్ధ్య పనులు నిర్వహించడం లేదన్నారు. వీధి దీపాలు లేవన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని వైకాపా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు.

## రక్తదాన శిబిరం విజయవంతం

నరసరావుపేట, సెప్టెంబరు 17 ప్రభాతవార్త : రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాలలో రక్తదాన శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. రెడ్‌క్రాస్ ఛైర్మన్ ఎం.ఆర్.శేషగిరిరావు, బిజెపి నాయకులు, కళాశాల అధ్యక్షులు కపలవాయి విజయ్‌కుమార్, రెడ్‌క్రాస్ కోశాధికారి నంద్యాల రాంప్రసాద్ రెడ్డి, రెడ్‌క్రాస్ ప్రతినిధులు డాక్టర్ సృజన, బత్తుల మురళీ, శ్రీనివాసగుప్తా ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ పుట్టినరోజు దేశానికి మంచి రోజు అని తెలిపారు. అద్భుతమైన నాయకులు ప్రధాని మోడీ అని పేర్కొన్నారు. మోడీ పాలనలో భారతదేశం అద్భుత విజయాలను సాధించిందన్నారు. ప్రపంచంలోనే అన్ని దేశాలు ఇండియా స్నేహం కోసం ఎదురు చూస్తున్నాయంటే ఎంత బలమైన దేశంగా ఇండియాను ప్రధాని మోడీ నిలిపారో మనకు తెలికగానే అర్థమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఏలూరి శశికుమార్, పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## 'కూటమి' నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా ప్రధాని మోడీ పుట్టినరోజు వేడుకలు

చిలకలూరిపేట, సెప్టెంబర్17, ప్రభాతవార్త: పట్టణంలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో భారత ప్రధాని నరేంద్రమోడీ పుట్టినరోజు వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 35వ వార్డులో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని మార్కెట్‌యార్డ్ ఛైర్మన్ షేక్ కరిముల్లా, మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫాని, జనసేన ఇన్‌చార్జి తోట రాజారమేష్, బిజెపి జిల్లా నాయకులు మల్లెల శివనాగేశ్వరరావు, గట్టా హేమకుమార్‌లు ప్రారంభించారు. ఈ శిబిరంలో పేదలందరికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందచేశారు. రక్తదాన శిబిరాన్ని కూడా నిర్వహించారు. టిడిపి అధ్యక్షుడు పఠాన్ సమద్‌ఖాన్, మార్కెట్‌యార్డ్ వైస్ ఛైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, బిజెపి నాయకులు నెల్లూరి ఈశ్వర రంజిత్, జనసేన నాయకులు రహమాన్, లీలాకిషోర్ తదితరులు పాల్గొన్నారు.



## గణపవరం అయ్యప్పస్వామి దేవాలయంలో అన్నదానం



నాదెండ్ల, సెప్టెంబర్17, ప్రభాతవార్త: మండలంలోని గణపవరం గ్రామంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో కొద్దిరోజులనుంచి అయ్యప్పస్వామి దీక్ష తీసుకున్న స్వాములకు అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. దీనిలో బాగంగా బుధవారం అన్నదాన కార్యక్రమంలో పట్టణ సిఐ పి రమేష్ దంపతులు పాల్గొని అయ్యప్ప స్వాములకు సద్దిని వడ్డించారు. ఆలయ పురోహితులు సిఐ దంపతులకు స్వామి వారి ఆశీస్సులు అందచేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ యువనాయకులు మండలనేని చరణ్‌తేజ, ఆలయ కమిటి సభ్యులు, అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.

## 18వ వార్డులో రేషన్ స్మార్ట్ కార్డులు పంపిణీ చేసిన టిడిపి నాయకులు

చిలకలూరిపేట, సెప్టెంబర్17, ప్రభాతవార్త: పట్టణంలోని 18వ వార్డు సచివాలయంలో బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ముద్రించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 18వ వార్డు అధ్యక్షుడు ఆరికట్ల కోటేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌చార్జి సయ్యద్ వహబ్, టిడిపి కార్యదర్శి మేకనబోయిన సాంబశివరావు, వార్డు టిడిపి నాయకులు షేక్ మౌలాలి, మల్నేని రమేష్‌బాబు, కొండా శ్రీనివాసరావు, చంద్రశేఖర్, వేల్పూరి చిరంజీవి, మోలకయ్య, గంతా నాగు, సచివాలయ సిబ్బంది పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందచేశారు.



## వైకాపా నేత కొండవీటి రామారావు కుటుంబానికి మాజీ మంత్రి రజనీ పరామర్శ



చిలకలూరిపేట, సెప్టెంబర్17, ప్రభాతవార్త: నియోజకవర్గ వైసిపి నాయకుడు కొండవీటి ఆంజనేయులు సోదరుడు కొండవీటి రామారావు ఇటీవల మరణించారు. కాగా బుధవారం మాజీమంత్రి విడదల రజిని వారి నివాసానికి వెళ్లి కొండవీటి రామారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు.

## 37వ వార్డులో కొత్త రేషన్‌కార్డులు పంపిణీ చేసిన కౌన్సిలర్ శివకుమారి

చిలకలూరిపేట, సెప్టెంబర్17, ప్రభాతవార్త: పట్టణంలోని 37వ వార్డు పరిధిలో నివసించే లబ్ధిదారులకు బుధవారం కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వార్డు కౌన్సిలర్ పాములపాటి శివకుమారి పాల్గొని కార్డులను అందచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో రేషన్‌కార్డు ఒక ముఖ్యమైన బాగమని పేర్కొన్నారు. ఈ కార్డుల ద్వారా ప్రజలు ఆహర భద్రతతో పాటు ప్రభుత్వం అందించే ఇతర ప్రయోజనాలు కూడా పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు పి శ్రీకాంత్, ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు, కార్యదర్శి శ్రీనివాసరావు, బూత్ కన్వీనర్ టి శ్రీహరిరావు, కో కన్వీనర్ మధు, వార్డు నాయకులు వెంకయ్య, రంగారావు, విఆర్ఓ తదితరులు పాల్గొన్నారు.



## ప్రధాని నరేంద్రమోడీ పుట్టినరోజు సందర్భంగా రామాలయంలో భాజపా నేతల పూజలు



చిలకలూరిపేట, సెప్టెంబర్ 17, ప్రభాతవార్త: భారతప్రధాని నరేంద్రమోడీ 76వ పుట్టినరోజు సందర్భంగా బిజెపి ఆధ్వర్యంలో పట్టణంలో బుధవారం పలు సేవాకార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని మెయిన్ బజార్‌లో ఉన్న రామాలయంలో ప్రధాని నరేంద్రమోడీ పేరుమీద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సేవాపక్వాడ్ ఇన్‌చార్జి నెల్లూరి ఈశ్వరరంజిత్, కన్వీనర్ సింగరేసు పోలయ్య, పట్టణ అధ్యక్షులు కోట పవన్‌కుమార్ గాంధి, జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల శివనాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి గట్టా హేమకుమార్, ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు పోట్రు పూర్ణచంద్రరావు, బిజెపి నాయకులు మాచర్ల శ్రీనివాసరావు, పులుగుజ్జు మహేష్, రావికింది రామకృష్ణ, వరికూటి నాగేశ్వరరావు, కస్తూరి వెంకటేశ్వర్లు, హనుమాన్ సింగ్, అన్నపురెడ్డి లక్ష్మణ్, గుమ్మా బాలకృష్ణ, కుప్పం కళ్యాణ్, ఉప్పాల భాస్కరరావు, దడబడ పుల్లయ్య, మల్ల కోటి, షేక్ మాబుసుభాని, అడుసుమల్లి వెంకటేశ్వరరావు, జోలాపురం రాయుడు తదితరులు పాల్గొన్నారు.

## 21వ వార్డులో స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేసిన కౌన్సిలర్ లక్ష్మీ తిరుమల

చిలకలూరిపేట, సెప్టెంబర్17, ప్రభాతవార్త: పట్టణంలోని 21వ వార్డులో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ముద్రించిన స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ కనమర్లపూడి లక్ష్మీతిరుమల, పట్టణ బిసిసెల్ అధ్యక్షుడు అవ్వారు లక్ష్మణకుమార్, టిడిపి సీనియర్ నాయకులు గంజి మోహన్‌కుమార్, వార్డు టిడిపి అధ్యక్షులు సిల్వర్ హరి, కార్యదర్శి కాటాబత్తుని శ్రీనివాసరావు, బూత్ కన్వీనర్ అవ్వారు నాగరాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## పసుమర్రులో స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేసిన తహసిల్దార్



చిలకలూరిపేట, సెప్టెంబర్17, ప్రభాతవార్త: మండలంలోని పసుమర్రు గ్రామంలో బుధవారం ప్రభుత్వం నూతనంగా ముద్రించిన స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా మండల తహసిల్దార్ షేక్ మహ్మద్ హుస్సేన్ పాల్గొని మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డులు క్యూఆర్ కోడ్‌తో అధునాతన సాంకేతికతను కలిగి ఉన్నాయని, ఈ కార్డుల ద్వారా లబ్ధిదారులకు సులభంగా రేషన్ కార్డులు అందుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జవ్వాజి మదన్‌మోహన్, టిడిపి కౌన్సిలర్ జాలాది సుబ్బారావు, వార్డు నాయకులు కొడవలి శ్రీనివాసరావు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మనక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు

చిలకలూరిపేట, సెప్టెంబర్17, ప్రభాతవార్త: శ్రీ వాసవి సేవాసంఘ్ ఆధ్వర్యంలో చౌత్రా సెంటర్‌లోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో బుధవారం అమ్మవారి జన్మ నక్షత్రం సందర్భంగా పంచామృత అభిషేకాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాతల సహకారంతో 1500మంది భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాలను శ్రీ వాసవిసేవాసంఘ్ అధ్యక్షుడు కొత్త కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కొప్పురావూరి కుమార్, కోశాధికారి గ్రంధి సుబ్బారావు, ఉప కోశాధికారి పొట్టి శ్రీనివాసరావు, 8వ వార్డు కౌన్సిలర్ కొత్త కుమారి, 21వ వార్డు కౌన్సిలర్ కనమర్లపూడి లక్ష్మీ తిరుమల, ఆర్యవైశ్య సంఘ నాయకులు చేవూరి కృష్ణమూర్తి, రాచుమల్లు సూర్యారావు, చిలకల రామలింగేశ్వరరావు, రాచుమల్లు సురేష్, మేళ్లచెరువు గోపాల్, కొప్పురావూరి రాధాకృష్ణ, కొత్తమాసు జగన్మోహన్‌రావులు పర్యవేక్షించారు



## 'ప్రత్తిపాటి' ఆదేశాలతో 30వ వార్డులో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

చిలకలూరిపేట, సెప్టెంబర్17, ప్రభాతవార్త: పట్టణంలోని 30వ వార్డు పరిధిలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సరిగా లేనందువలన ఇటీవల జరిగిన విద్యుత్ హెచ్చుతగ్గులవలన గృహాలలో ఉన్న ఎలక్ట్రికల్ సామాన్లన్నీ కాలిపోయాయి. ఈ విషయాన్ని వార్డు నాయకులు ఎమ్మెల్యే ప్రత్తిపాటి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఎమ్మెల్యే ప్రత్తిపాటి చెడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయమని విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. ఈ ఆదేశాలతో బుధవారం 30వ వార్డులో విద్యుత్‌శాఖ సిబ్బంది నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటును రాష్ట్ర టిడిపి మైనారిటి సెల్ కార్యదర్శి బేరింగ్ మౌలాలి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో 30వ వార్డు టిడిపి అధ్యక్షుడు షేక్ హజ, కార్యదర్శి షబ్బీర్ ఆలీ, ఉపాధ్యక్షుడు మోహిద్దీన్ మియా, నసిరుద్దీన్, షేక్ మోబీన్, షేక్ మోదిన్, ఏలూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




18-9Pg5 9_18-9Pg5.qxd 9/18/2025 12:49 AM Page 1



# అమెరికాకు తగ్గుతున్న భారత్ ఎగుమతులు

## ట్రంప్ విధించిన సుంకాల ప్రభావం



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 17:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన టారిఫ్‌లు భారత ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఫలితంగా మన దేశం నుంచి అమెరికాకు ఎగుమతి అవుతున్న వస్తువుల ధరలు అక్కడ భారీగా పెరిగిపోయాయి. దాంతో అమెరికా మార్కెట్‌లో పోటీని తట్టుకోలేని స్థితి నెలకొంది. ఈ విషయాన్ని 'గ్లోబల్ ట్రేడ్ రిసెర్చ్ ఇనిషియేటివ్ సంస్థ వెల్లడించింది. ఆగస్టు నెలలో అమెరికాకు ఎగుమతులు 16.3 శాతం తగ్గి 6.7 బిలియన్ డాలర్లకు చేరాయి. టారిఫ్‌లు 50 శాతానికి పెరగడంతో ఒక్కసారిగా ఎగుమతుల్లో తగ్గుదల కనిపించింది. గత మూడు నెలల నుంచి ఎగుమతుల్లో వరుసగా తగ్గుదల కనిపిస్తోంది. జూలైలో ఈ తరుగుదల 3.6 శాతంగా నమోదైంది. జూన్‌లో 5.7 శాతానికి తగ్గింది. అమెరికాకు భారత ఎగుమతులు చివరి సారిగా మే నెలలో పెరిగాయి. అప్పుడు 4.8 శాతం వృద్ధి చెంది 8.8 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. అంతకుముందు నెల అంటే ఏప్రిల్‌లో 8.4 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. టారిఫ్‌లలో భారీగా పెరుగుదల ఎగుమతుల్లో తరుగుదలకు కారణమైందని జీటీఆర్ఐ వ్యవస్థాపకులు అజయ్ శ్రీవాస్తవ వెల్లడించారు. గత మూడు నెలల ట్రెండ్‌ను బట్టి చూస్తుంటే సెప్టెంబర్ నెలలో ఎగుమతుల పతనం మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉందని ఆయన అంచనా వేశారు. పూర్తిస్థాయిలో టారిఫ్‌ల దెబ్బ తీవ్రత ఈ నెలలోనే తెలుస్తుందని అన్నారు. ఏప్రిల్ 4 వరకు అమెరికా మోస్ట్ ఫేవర్డ్ నేషన్ హోదాలో భారత సరుకులు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎగుమతి అయ్యాయి. ట్రంప్ అన్ని దేశాలకు 10 శాతం పన్నులు విధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇది కూడా వ్యాపార సంబంధాలపై పెద్దగా ప్రభావం చూపలేదు. దీంతో మే నెలలో కూడా ఎగుమతులు పెరిగాయి. కానీ ఆ తర్వాత నుంచి పలు దేశాలను లక్ష్యంగా చేసుకొని టారిఫ్‌లు విధించడం ప్రతికూల ప్రభావం చూపింది. ముఖ్యంగా ఆగస్టు నుంచి అమల్లోకి వచ్చిన సుంకాలు భారత ఎగుమతులను తీవ్రంగా దెబ్బతీశాయి. ఈ నెలలో తొలుత 25 శాతం ఆ తర్వాత మరో 25 శాతం పన్నులు భారత్‌పై పడ్డాయి. అయితే భారత్ నుంచి ఎగుమతి అయ్యే ఫోన్‌లు, ఔషధాలకు మాత్రం మినహాయింపు లభిస్తోంది. అయినా ఈ స్థాయి తరుగుదల నమోదైందంటే మిగిలిన ఉత్పత్తులు అనుకున్న దానికంటే తీవ్రంగా ప్రభావితం అవుతున్నట్టే లెక్క. లేబర్ ఆధారిత పరిశ్రమలైన దుస్తులు, రత్నాలు, ఆభరణాలు, లెదర్, రొయ్యలు, కార్పెట్‌ల లాంటివి ఒత్తిడికి గురికానున్నాయి. వీటిల్లో 3060 శాతం మధ్య ఎగుమతులు అమెరికాకే వెళ్తాయి. 2026 ఆర్థిక సంవత్సరం మొత్తం ఈ టారిఫ్‌లు కొనసాగితే 3035 బిలియన్ డాలర్ల మేరకు అమెరికాతో వ్యాపారాన్ని భారత్ నష్టపోతుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు.

### టీనేజర్ల అకృత్యాలకు తల్లిదండ్రులకు భారీ జరిమానా

# రూ.2.71కోట్లు విధించిన కోర్టు



**షాంఘై, సెప్టెంబరు 17:** పిల్లలు చేసే తప్పిదాలకు తల్లిదండ్రులు భారీ మూల్యం చెల్లించు కోవాల్సి వస్తుంది. ఇలాంటి ఘటనే చైనాలోని షాంఘైలో చోటుచేసుకుంది. ఇద్దరు టీనేజర్లు ఓ రెస్టారెంట్‌లో చేసిన అకృత్యానికి వారి తల్లిదండ్రులు ఏకంగా 2.2 మిలియన్ యువాన్లు (సుమారు రూ.2.71కోట్లు) నష్టపరిహారం చెల్లించాలంటూ స్థానిక కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. షాంఘైలోని ప్రముఖ హైదిలావో హాట్‌పాట్ రెస్టారెంట్‌లో ఈ ఏడాది ఫిబ్రవరి 24న ఈ ఘటన జరిగింది. మద్యం మత్తులో ఉన్న 17 ఏళ్ల వూ, టాంగ్ అనే ఇద్దరు మైనర్లు, తాము భోజనం చేస్తున్న ప్రైవేట్ డైనింగ్ రూమ్‌లోని టేబుల్‌పైకి ఎక్కి, అందరూ కలిసి తినే మరిగే సూప్‌లో మూత్ర విసర్జన చేశారు. ఈ ఘటనతో రెస్టారెంట్ యాజమాన్యం తీవ్రంగా నష్టపోయింది. కస్టమర్ల నుంచి ఫిర్యాదులు రాకపోయినప్పటికీ, ముందుజాగ్రత్త చర్యగా ఘటన జరిగిన రోజు నుంచి మార్చి 8వరకు వచ్చిన సుమారు 4,000మందికి పైగా కస్టమర్లకు పూర్తి డబ్బులు వాపసు ఇవ్వడమే కాకుండా, బిల్లుకు పది రెట్ల నగదును పరిహారంగా చెల్లించింది. రెస్టారెంట్‌లోని పాత్రలన్నింటినీ ధ్వంసం చేసి, కొత్తవి కొనుగోలు చేసింది. ప్రాంగణాన్ని పూర్తిగా శుభ్రం చేసి, క్రిమిసంహారకాలతో శుద్ధి చేసింది. ఈ వ్యవహారంపై కోర్టును ఆశ్రయించగా, విచారణ జరిపిన న్యాయస్థానం టీనేజర్ల చర్యలను తీవ్రంగా తప్పుబట్టింది. వారి ప్రవర్తన కంపెనీ ఆస్తి హక్కులను, ప్రతిష్ఠను దెబ్బతీసిందని స్పష్టంచేసింది. పిల్లల పెంపకంలో తల్లిదండ్రులు తమ బాధ్యతను సరిగ్గా నిర్వర్తించలేదని వ్యాఖ్యానించింది. ఈక్రమంలో కంపెనీకి జరిగిన నష్టానికి, పాత్రల ఖర్చులకు, న్యాయపరమైన ఫీజులకు కలిపి మొత్తం 2.2మిలియన్ యువాన్లు చెల్లించాలని ఆదేశించింది. దీంతో పాటు పత్రికల్లో బహిరంగ క్షమాపణ చెప్పాలని కూడా తీర్పులో పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా 1,000కి పైగా బ్రాంచులు కలిగిన హైదిలావో రెస్టారెంట్ చైన్, తమ అద్భుతమైన కస్టమర్ సర్వీస్‌కు, కుటుంబ అనుకూల వాతావరణానికి ప్రసిద్ధిచెందింది. అలాంటి రెస్టారెంట్‌లో ఈఘటన జరగడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

# కోర్టు ఆవరణలోనే ఎస్ఐని చితకబాదిన లాయర్లు



**వారణాసి, సెప్టెంబరు 17:** కోర్టు విచారణకు హాజరైన ఒక పోలీస్ అధికారిని న్యాయవాదులు చుట్టుముట్టారు. ఆయనపై పంచులిచ్చి కొట్టారు. ఆ పోలీస్ అధికారితోపాటు ఆయన వెంట ఉన్న కానిస్టేబుల్ కూడా లాయర్ల దాడిలో గాయపడ్డాడు. వారిద్దరూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో ఈ సంఘటన జరిగింది. బరగావ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన భూ వివాదంలో ఒక న్యాయవాదితో సహా రెండు వర్గాలపై 37 ఏళ్ల ఎస్ఐ మిథిలేష్ ప్రజాపతి చలాన్లు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆ పోలీస్ అధికారి తన పట్ల దురుసుగా ప్రవర్తించడంతో పాటు దాడి చేసినట్లు ఆ లాయర్ ఆరోపించాడు. కోర్టు విచారణ కోసం ఎస్ఐ మిథిలేష్ ప్రజాపతి కానిస్టేబుల్ రాణా ప్రసాద్‌తో కలిసి వారణాసి కోర్టుకు హాజరయ్యారు. అయితే న్యాయవాదిపై దాడి చేసిన ఆయనపై ప్రతీకారం కోసం కొందరు న్యాయవాదులు గుంపుగా వేచి ఉన్నారు. జిల్లా మేజిస్ట్రేట్ పోర్టికో సమీపంలో పోలీస్ అధికారి మిథిలేష్ ప్రజాపతిని చుట్టుముట్టి కొట్టారు. పారిపోతున్న ఆయన వెంటపడి పంచులిచ్చారు. మరోవైపు స్పృహ కోల్పోయిన ఆ ఎస్ఐను ఒక కార్యాలయంలోకి న్యాయవాదులు ఈడ్చుకెళ్లారు. అక్కడ తిరిగి దాడి కొనసాగించారు. కొంతసేపు బంధించారు. కోర్టులోని మిగతా పోలీసులు జోక్యం చేసుకుని ఎస్ఐ మిథిలేష్ ప్రజాపతిని కాపాడి అక్కడి నుంచి తీసుకెళ్లారు. న్యాయవాదుల గుంపు దాడిలో ఎస్ఐ మిథిలేష్ ప్రజాపతితో పాటు ఆయన వెంట ఉన్న కానిస్టేబుల్ రాణా ప్రసాద్ కూడా గాయపడ్డాడు. వారిద్దరిని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఎస్ఐ మిథిలేష్ ప్రజాపతికి 16 కుట్లు పడటంతోపాటు అంతర్గతంగా గాయాలయ్యాయి. ఆయన ఫిర్యాదుపై పది మంది న్యాయవాదులతో పాటు గుర్తు తెలియని సుమారు 60 మంది లాయర్లపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే పోలీస్ అధికారిపై న్యాయవాదులు గుంపుగా దాడి చేసిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.




# టిక్‌టాక్‌పై నిషేధం పొడిగించిన ట్రంప్

**వాషింగ్టన్, సెప్టెంబరు 17:** అమెరికాలో టిక్‌టాక్ యాప్‌పై విధించిన నిషేధం గడువును అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పొడిగించారు. ఫెడరల్ నిబంధనలను పట్టించుకోకుండా టిక్‌టాక్‌ను మూసివేసే గడువును ట్రంప్ పొడిగింపు ఉత్తర్వులు ఇవ్వడం ఇది నాలుగోసారి. ఈ మేరకు ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. టిక్‌టాక్‌పై నిషేధం ఎత్తివేసేందుకు చైనాతో ఒక ఫ్రేమ్‌వర్క్ ఒప్పందం కుదిరిందని రెండురోజుల కిందట చెప్పి నిషేధం పొడగించడం గమనార్హం. అమెరికా, చైనా మధ్య టిక్‌టాక్ యాప్ విషయంలో ఒప్పందం కుదిరిందన్నారు. ఈ నిర్ణయం తర్వాత బైట్ డాన్స్ యాజమాన్యంలోని ఈ యాప్ అమెరికాలో వాడుకలోకి వస్తుందన్నారు. టిక్‌టాక్‌ను కొనుగోలు చేసేందుకు చాలా కంపెనీల గ్రూప్ యూఎస్ వద్ద ఉందన్నారు. ఈ ఒప్పందం రాబోయే 30 నుంచి 45 రోజుల్లో పూర్తవుతుందని భావిస్తున్నారు. ఈ ఒప్పందం చైనా నియంత్రణలో నున్న కాంగ్రెస్ నుంచి ఆమోదం కూడా అవసరమయ్యే అవకాశం ఉంది. నివేదికల ప్రకారం మైక్రోసాఫ్ట్, అమెజాన్, బిలియనీర్ ఫ్రాంక్ మెక్‌కోర్ట్, ఒన్లీఫాన్స్ వ్యవస్థాపకుడు నేతృత్వంలోని కన్సార్టియం బిడ్డర్స్ జాబితాలో ఉన్నాయి. 2024లో బైడెన్ పరిపాలన సమయంలో టిక్‌టాక్ డేటా భద్రతపై ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ ఏడాది అధికారంలోకి వచ్చిన ట్రంప్ టిక్‌టాక్ నిషేధానికి సంబంధించిన ఇప్పటి వరకు నాలుగుసార్లు పొడిగించారు. అధ్యక్షుడైన తర్వాత తొలిసారిగా జనవరి 20న ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. టిక్‌టాక్‌ను అమెరికన్ కంపెనీగా మార్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్న సమయంలోనే ఏప్రిల్‌లో రెండోసారి గడువును పొడిగించారు. కానీ, ట్రంప్ టారిఫ్ ప్రకటన తర్వాత చైనా వెనక్కి తగ్గడంతో ఒప్పందం జరుగలేదు. మూడోసారి జూన్‌లో ట్రంప్ గడువును 90 రోజులు పొడిగించారు. నిజానికి టిక్‌టాక్ మాతృసంస్థ బైట్‌డాన్స్. ఇది చైనాకు చెందిన కంపెనీ. ఈ యాప్ యూజర్ల డేటాను చైనా ప్రభుత్వానికి ఇచ్చే అవకాశం ఉంటుందని అమెరికా ఆందోళన వ్యక్తం చేస్తుంది. దాంతో జాతీయ భద్రతకు ముప్పుగా పేర్కొంటున్నది. అయితే, టిక్‌టాక్‌ను అమెరికన్ కంపెనీ అప్పగించాలని బైట్‌డాన్స్‌ను ఆదేశించింది.

# జార్జియాలో భారతీయులకు ఘోర అవమానం

## ప్రధాని, విదేశాంగశాఖలకు సోషల్‌మీడియా పోస్టులు



**తిబ్లిసి, సెప్టెంబరు 17:** జార్జియాలో భారతీయ పర్యాటకులకు తీవ్ర అవమానం ఎదురైంది. సరైన పత్రాలు, ఈవీసాలు ఉన్నప్పటికీ 56 మంది భారతీయుల బృందాన్ని ఆర్మేనియా నుంచి జార్జియాలోకి ప్రవేశించకుండా సరిహద్దు అధికారులు అడ్డుకున్నారని, అమానుషంగా ప్రవర్తించారని ఓ మహిళ ఆరోపించారు. ఈ ఘటనపై భారత ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ధృవీ పటేల్ అనే మహిళ తన ఇన్‌స్టాగ్రామ్ పోస్టులో ఈ చేదు అనుభవాన్ని పంచుకున్నారు. ఆర్మేనియా, జార్జియా మధ్య ఉన్న సదఖ్లో సరిహద్దు వద్ద తమ బృందాన్ని ఐదు గంటలకు పైగా గడ్డకట్టే చలిలో నిలబెట్టారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సమయంలో కనీసం ఆహారం గానీ, టాయిలెట్ సౌకర్యం గానీ కల్పించలేదని తెలిపారు. తమ పాస్‌పోర్టులను రెండు గంటల పాటు స్వాధీనం చేసుకుని, పశువుల్లా ఫుట్‌పాత్‌పై కూర్చోబెట్టారని ఆమె ఆరోపించారు. అంతేకాకుండా, అధికారులు తమను నేరస్థుల్లా వీడియోలు తీశారని, కానీ తామువీడియో తీయకుండా అడ్డుకున్నారని ధృవీ పటేల్ పేర్కొన్నారు. తమ పత్రాలను సరిగా తనిఖీ చేయకుండానే వీసాలు 'సరిగ్గా లేవని' చెప్పి వెనక్కి పంపారని ఆమె తెలిపారు. "జార్జియా భారతీయుల పట్ల ఇలాగే ప్రవర్తిస్తుంది. ఇది సిగ్గుచేటు, ఆమోదయోగ్యం కాదని ఆమె తన పోస్టులో రాశారు. ఈ విషయంలో భారత ప్రభుత్వం స్పందించాలని కోరుతూ ప్రధాని నరేంద్ర మోదీ, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌లను ట్యాగ్ చేశారు. ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో చాలా మంది నెటిజన్లు స్పందించారు. గతంలో తమకు కూడా జార్జియాలో ఇలాంటి అనుభవాలే ఎదురయ్యాయని పలువురు కామెంట్లు చేశారు. భారతీయుల పట్ల జార్జియా అధికారుల వివక్ష చాలా కాలంగా కొనసాగుతోందని ఒకరు పేర్కొనగా, ఇది జాతి వివక్షలో భాగమేనని మరికొందరు ఆరోపించారు. ఈ సంఘటనపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందన రాలేదు.

# వృద్ధుడి ఇంట్లో గుట్టలుగుట్టలుగా మారణాయుధాలు

## కేరళలో సంచలనం సృష్టిస్తున్న ఉదంతం




**మలప్పురం,(కేరళ), సెప్టెంబరు 17:** సామాన్య మధ్యతరగతి కుటుంబానికి చెందిన 69 ఏళ్ల వయసున్న వృద్ధుడి ఇంట్లో భారీగా ఆయుధాలు ఉన్నాయన్న పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు.. నిందితుడిని అదుపులోకి తీసుకుని, ఆయుధాలను సీజ్ చేశారు. ఘటనపై కేసు నమోదుచేసి లోతైన దర్యాప్తు చేపట్టారు. కేరళ రాష్ట్రం మలప్పురం జిల్లాకు చెందిన ఉన్నికమద్ అనే 69 ఏళ్ల వృద్ధుడి ఇంట్లో అక్రమంగా ఆయుధాలు నిల్వ ఉంచినట్లు పోలీసులకు రహస్యంగా సమాచారం అందింది. ఈ సమాచారం విశ్వసనీయమైనదని నిర్ధారించుకున్న పోలీసులు వెంటనే ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి అతడి ఇంటిపై మెరుపుదాడి చేశారు. ఇల్లంతా జల్లెడ పట్టారు. కనిపించిన ప్రతీ బ్యాగును, సంచిని, డబ్బాను వెతికారు. ఈక్రమంలోనే పోలీసులే నివ్వెరపోయేలా పెద్ద సంఖ్యలో ఆయుధాలు బయటపడ్డాయి. ఆయుధాలను చూసిన పోలీసులు తాము ఇంత భారీ మొత్తంలో ఆయుధాలు ఒకేసారి ఒక వ్యక్తి ఇంట్లో కనుగొనడం ఇదే మొదటిసారి అని చెప్పారు. అధికారులు వృద్ధుడి నివాసం నుంచి 20 ఎయిర్‌గన్‌లు, మూడు రైఫిల్స్, 200 బుల్లెట్లు, 40 పెల్లెట్ బాక్సులను స్వాధీనం చేసుకున్నారు. ఆ ఇంట్లో ఆయుధాలను అమర్చిన తీరు చూస్తే అతను ఎంతోకాలం నుంచి వీటిని నిల్వ చేస్తున్నట్లు తెలుస్తోందని పోలీసులు అభిప్రాయ పడ్డారు. ఈ భారీ మొత్తంలో ఆయుధాలను చూసి స్థానికులు కూడా ఆశ్చర్యపోయారు. ఈ ఆయుధాలన్నీ కేవలం వ్యక్తిగత అవసరాల కోసమే కాదని.. వాటి వెనుక ఏదైనా పెద్ద నేర సామ్రాజ్యం ఉండి ఉండవచ్చు అని అనుమానిస్తున్నారు. ఆయుధాలు దొరికిన తర్వాత ఉన్నికమద్‌ను పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకున్నారు. వారితోపాటే జీపులో ఎక్కించుకుని నేరుగా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ భారీ మొత్తంలో ఆయుధాలను ఎక్కడి నుంచి సేకరించారు వాటిని విక్రయించేందుకు నిల్వఉంచారా లేక వ్యక్తిగత అవసరాల కోసం దాచారా అనే కోణాల్లో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

ఈ ఆయుధాలకు ఏమైనా క్రిమినల్ గ్యాంగులకు సంబంధం ఉందా అని కూడా పోలీసులు విచారిస్తున్నారు. అలాగే ఆయుధాలు సేకరించడంలో ఉన్నికమద్‌కు ఎవరైనా సహాయం చేశారా అనే కోణంలో కూడా విచారణ కొనసాగుతోంది. ఒకవేళ ఇవి కేవలం వ్యక్తిగత అవసరాల కోసమే అయితే ఏ ప్రయోజనాల కోసం అతను ఇంత భారీ మొత్తంలో మారణాయుధాలను నిల్వ ఉంచుకున్నాడు అని పోలీసులు ప్రశ్నిస్తున్నారు.

# సంక్షిప్తంగా..

## చొరబాటుదారుల ఓట్లతో కాంగ్రెస్ గెలవాలని చూస్తోంది: అమిత్‌షా



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 17:** ఓటర్ల జాబితా ప్రక్షాళన కోసం ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు బిజెపి మద్దతిస్తోందని కేంద్ర మంత్రి అమిత్ షా వెల్లడించారు. చొరబాటుదారుల ఓట్లతో గెలవాలని కాంగ్రెస్ చూస్తోందని ఆరోపించారు. ప్రధాని మోడీ జన్మదినం సందర్భంగా ఢిల్లీలోని త్యాగరాజ్ స్టేడియంలో స్థానిక ప్రభుత్వ పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. చొరబాటుదారులను కాపాడేందుకే రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఇటీవల ఓటర్ అధికార్ యాత్ర నిర్వహించింది. వారి ఓట్లతో ఎన్నికల్లో గెలవాలని చూస్తోంది. దేశ ఓటర్లను విశ్వసించడం లేదు. హస్తం పార్టీ అసలు స్వరూపాన్ని గుర్తించే సమయం ఆసన్నమైంది. ఓటర్ల జాబితా ప్రక్షాళన కోసం ప్రత్యేక సమగ్ర సవరణకు బిజెపి మద్దతిస్తోంది అని అమిత్ షా పేర్కొన్నారు.

## పెట్రోల్‌లో 20% ఇథనాల్‌పై కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్ వివరణ



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 17:** 20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ సంరక్షితం కాదంటూ గత కొంతకాలంగా సామాజిక మాధ్యమాల్లో పెద్దఎత్తున చర్చ జరుగుతున్న విషయం తెలిసిందే. బయో ఇంధనాల వల్ల ఆటోమొబైల్ ఇంజిన్లు దెబ్బతింటాయని పలువురు చేస్తున్న ప్రచారాలను కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్ పురి కొట్టిపారేశారు. పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలపడం వల్ల వాహనాల మైలేజీ తగ్గుతోందనేది చెత్త వాదన అన్నారు. ఈ 20 ఇంధనం పర్యావరణపరంగా ఉపయోగించడానికి సురక్షితమని పేర్కొన్నారు. అయితే దీర్ఘకాలంలో పాత వాహనాల్లో గ్యాస్కెట్లు, ఇంధన రబ్బరు గొట్టాలు, పైపులను మార్చాల్సి రావచ్చని అది సాధారణమైన విషయమేనని పేర్కొన్నారు. పలువురు ఉద్దేశపూర్వకంగానే ఇథనాల్‌తో సమస్యలు వచ్చే అవకాశం ఉందని ప్రజల్లో తప్పుడు భయాలను సృష్టిస్తున్నారని హర్దీప్‌సింగ్ పురి పేర్కొన్నారు. అంతర్జాతీయ ఇంధన సంస్థ అంచనాల ప్రకారం భారత్‌లో ఇంధన డిమాండ్ రాబోయే రెండు దశాబ్దాలలో ప్రపంచ దేశాల్లో ఉన్న దానికంటే మూడురెట్లు పెరుగుతుందన్నారు.

# కర్ణాటక విజయపుర జిల్లా ఎస్‌బిఐలో భారీ దోపిడి

### 20 కిలోల బంగారు నగలు

### రూ.1.4 కోట్ల నగదు లూటీ

### తుపాకులు, కత్తులతో మాస్కులు ధరించి దోపిడికి పాల్పడ్డ అంతర్రాష్ట్ర ముఠా

**హైదరాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** కర్ణాటకలో మరో బ్యాంకును దుండగులు లూటీ చేశారు. రెండు నెలల క్రితం కెనరా బ్యాంకులో జరిగిన దోపిడి ఘటనను మరువక ముందే మంగళవారం సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో విజయపుర జిల్లాలోని చడచన్ పట్టణంలో గల ఎస్‌బిఐలో అంతర్రాష్ట్ర దోపిడి దొంగల ముఠా మాస్కులు ధరించి తుపాకులు, కత్తులతో సిబ్బందిని తాళ్లతో కట్టివేసి 20 కిలోల బంగారు నగలు, కోటీ 40 లక్షల రూపాయల నగదును నిమిషాల వ్యవధిలో దోచుకుని పారిపోయారు. ఈ ఘటన కర్నాటక వ్యాప్తంగా సంచలనం రేపింది. వివరాలు ఇలావున్నాయి. విజయపుర జిల్లా చడచన్ పట్టణంలో ఎస్‌బిఐ చాలా కాలంగా ప్రజలకు సేవలందిస్తోంది. స్థానిక వ్యాపారులతో పాటు రైతులు, వివిధ రంగాలకు చెందిన వేలాది మంది ఖాతాదారులు ఇక్కడ తమ బంగారాన్ని లాకర్లలో నిలువ వుంచారు. చడచన్ ఎస్‌బిఐగా పేరొందిన ఇక్కడి ఎస్‌బిఐ బ్యాంకు లో నిత్యం కోటి రూపాయలకు పైగా లావాదేవీలు జరుగుతుంటాయి. దీనిపై పక్కా సమాచారం అందుకున్న దుండగులు సాయంత్రం ఆరుగంటల సమయంలో బ్యాంకులోకి వచ్చారు. ఆ సమయంలో బ్యాంకు సిబ్బంది బ్యాంకును మూసివేసే పనిలో వుండగా ముందుగా ఒక నేరగాడు తన ఖాతా వివరాలు కావాలనే నెపంతో ఉద్యోగితో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్న తరుణంలో మరో ఇద్దరు వచ్చారు. ముగ్గురు మాస్కులు ధరించి వున్నారు. దీని తరువాత ముగ్గురు తమ వద్ద వున్న తుపాకులను, కత్తులతో బ్యాంకు మేనేజర్‌తో పాటు సిబ్బందిని భయపెట్టారు. మర్యాదగా లాకర్లలో వున్న బంగారు నగలు, బ్యాంకులో వున్న నగదును ఇవ్వాలని, లేకుంటే అందరిని చంపేస్తామని బెదిరించారు. అనంతరం అందరిని ఒక గదిలో బంధించి వారి చేతులను వెనక్కు కట్టేశారు. దీని తరువాత బ్యాంకులోని లాకర్లలో గల బంగారు నగలతో పాటు కోటీ 40 లక్షల నగదును దోచుకుని నిమిషాల వ్యవధిలో అక్కడి నుంచి పారిపోయారు.

# క్రాస్ బోర్డర్ ఉగ్రబాధితులకు రెండునెలల్లోపు పరిహారం చెల్లించాలి

### కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు జమ్ము కాశ్మీర్ హైకోర్టు ఆదేశాలు

**శ్రీనగర్, సెప్టెంబరు 17:** సరిహద్దు కాల్పులు, ఉగ్రవాద బాధితులకు పరిహారం కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను నాలుగేళ్ల తర్వాత జమ్ము కశ్మీర్ హైకోర్టు ముగించింది. రెండు నెలల్లోపు బాధితులకు సహాయ ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వానికి ఆదేశించింది. పరిహారాన్ని నిర్దిష్ట సమయంలోగా నిర్ణయించాలని పేర్కొంది. 2021లో ఉరి ఫౌండేషన్ ఈ పిటిషన్‌ను దాఖలు చేసింది. సివిలియన్ విక్టిమ్స్ ఆఫ్ టెరరిస్ట్, కమ్యూనల్ అండ్ లెఫ్ట్ వింగ్ ఎక్స్‌ట్రీమిజం వైలెన్స్ అండ్ క్రాస్‌బోర్డర్ ఫైరింగ్ అనే కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పథకం అమలులో జరుగుతన్న జాప్యాన్ని సవాలు చేసింది. ఈ పథకం ఉగ్రవాద బాధితులకు ఆర్థిక సహాయం అందించడానికి తీసుకొచ్చింది. కొన్ని సంవత్సరాలుగా కేంద్రం, కేంద్రపాలిత ప్రభుత్వాన్ని అఫిడవిట్లును సమర్పించాలని కోర్టు ఆదేశించింది. కానీ బాధితులు సాయం కోసం ఎదురచూస్తునే ఉంటడంతో కేసు నిలిచిపోయింది. సెప్టెంబర్ ప్రారంభంలో పథకం కింద ఇంకా పరిహారం రాని వారు అర్హత ఉన్నా చెల్లింపులు నిరాకరించిన వారిపై పూర్తి వివరాలతో కూడిన అఫిడవిట్ ఇవ్వాలని ప్రత్యేకంగా ఆదేశించింది. ప్రభుత్వం తరఫున హాజరైన సీనియర్ అదనపు అడ్వకేట్ జనరల్ మోహ్సిన్ ఖాదిరీ మాట్లాడుతూ, పిటిషన్‌లో పేర్కొన్న 71 కేసులు విచారణలో ఉన్నాయని కోర్టుకు తెలిపారు.

## ఉగ్రదాడుల వెనుక మసూద్ హస్తం నిజమే: జైషే



**ఇస్లామాబాద్, సెప్టెంబరు 17:** భారత పార్లమెంట్‌పై జరిగిన ఆత్మాహుతి దాడి, 26/11 ముంబయి మారణకాండ వెనుక జైషే అధినేత మసూద్ అజర్ హస్తం ఉందని ఆ సంస్థ టాప్ కమాండర్ అంగీకరించాడు. తాజాగా దీనికి సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. ఇటీవల ఆ సంస్థకు చెందిన మసూద్ ఇలియాస్ కశ్మీరి ఓ బహిరంగ సభలో మాట్లాడుతూ 'అమిర్ ఉల్ ముజాహిద్దీన్ మౌలానా మసూద్ అజర్ భారత్ జైలు నుంచి బయటపడి పాకిస్థాన్ వచ్చాక బాలాకోట్‌లో ఆయనకు ఆశ్రయం లభించింది.' అని పేర్కొన్నాడు. పాకిస్థాన్‌లో ఉగ్రవాదులు ఆశ్రయం పొంది భారత్‌పై దాడులు చేస్తున్నారనటానికి ఈ ప్రకటన బలమైన ఆధారంగా నిలిచింది. ఇలియాస్ కశ్మీరీ చెప్పిన దాని ప్రకారం మసూద్ అజార్ బాలాకోట్‌ను అడ్డాగా చేసుకొని ఎప్పటినుంచో భారత్‌పై ఉగ్రకుట్రలు పన్నుతున్నట్లు తేలింది.

## పాక్ నకిలీ ఫుట్‌బాల్ జట్టు..వచ్చింది చొరబడేందుకు



**టోక్యో, సెప్టెంబరు 17:** పాకిస్థాన్ ఫెడరల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎఫ్ఐఎ) ప్రొఫెషనల్ ఫుట్‌బాల్ జట్టు పేరుతో జపాన్‌లోకి అక్రమంగా ప్రవేశించిన పాక్ పౌరులను ఆ దేశం ఎయిర్‌పోర్టు నుంచే డిపోర్టు చేసింది. అంతర్జాతీయ మీడియా వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం దేశంలో జరుగుతున్న ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొనడానికి పాక్ నుంచి వచ్చినట్లుగా చెప్పుకుంటూ ఇటీవల 22 మంది వ్యక్తులు జపాన్‌కు వెళ్లారు. పాక్ విదేశాంగ మంత్రిత్వశాఖ జారీ చేసిన నకిలీ నో–అబ్జెక్షన్ సర్టిఫికెట్లు (ఎన్ఒసిలు) కూడా వారి వద్ద ఉండడంతో ఫుట్‌బాల్ నిర్వాహకులకు వారిపై ఎటువంటి అనుమానం రాలేదు. జపాన్‌లోని విమానాశ్రయానికి చేరుకున్న తర్వాత విచారణ సమయంలో ఇమ్మిగ్రేషన్ అధికారులకు వారిపై అనుమానం రావడంతో దర్యాప్తునకు ఆదేశించారు. తర్వాత వారిని నకిలీ జట్టుగా గుర్తించిన జపాన్ అధికారులు విమానాశ్రయం నుంచే వెనక్కి పంపేశారు. అయితే వీరు పాకిస్థాన్ విమానాశ్రయం అధికారుల నుంచి ఎలా తప్పించుకోగలిగారనే విషయంపై స్పష్టత రావాల్సి ఉందన్నారు.

# భారత్ కాన్సులేట్‌ను సీజ్ చేస్తాం

## ఖలిస్థానీల బెదరింపులు




**ఒట్టావా, సెప్టెంబరు 17:** కెనడాలోని ఖలిస్థానీ ఉగ్రవాదులు మరోసారి రెచ్చిపోయారు. వాంకోవర్‌లోని భారత్ కాన్సులేట్‌ను సీజ్ చేస్తామంటూ బెదరింపులకు పాల్పడ్డారు. ఖలిస్థానీ సిఖ్స్ ఫర్ జస్టిస్ (ఎస్ఎఫ్ఐ) సంస్థ ఈ బెదరింపులకు దిగింది. వాంకోవర్‌లోని భారత్ కాన్సులేట్‌ను ముట్టడిస్తామని పేర్కొంది. ఈ నెల 18న (గురువారం) దీన్ని స్వాధీనం చేసుకుంటామని, ఆ సమయంలో ఇక్కడికి ఎవరూ రావొద్దంటూ హెచ్చరికలు చేసింది. ఈ సందర్భంగా భారత హైకమిషనర్ దినేశ్ కె. పట్నాయక్‌ను లక్ష్యంగా చేసుకుని ఉన్న పోస్టర్లను కూడా విడుదల చేసింది. దీంతో ఇది కాస్తా తీవ్ర కలకలం రేపింది. 'రెండేళ్ల క్రితం సెప్టెంబరు 18న హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్యలో భారత ఏజెంట్ల పాత్ర ఉందని దర్యాప్తులో వెల్లడైన విషయాన్ని నాటి ప్రధాని జస్టిన్ ట్రూడో పార్లమెంటులో పేర్కొన్నారు. ఇప్పుడు కూడా భారత కాన్సులేట్లు ఖలిస్థానీలను లక్ష్యంగా చేసుకుని నిఘా నెట్‌వర్క్‌ను నడుపుతోంది. మాపై గూఢచర్యం కొనసాగిస్తూనే ఉంది' అని ఆరోపించింది. కెనడా గడ్డపై భారత్ చేస్తున్న నిఘా, బెదరింపుల నేపథ్యంలో కాన్సులేట్‌ను ముట్టడి చేస్తున్నట్లు తెలిపింది. ఈ బెదరింపులపై వాంకోవర్‌లోని భారత్ కాన్సులేట్ ఇప్పటివరకు స్పందించలేదు. ఖలిస్థానీ ఉగ్రవాదులకు తమ దేశం నుంచే నిధులు అందుతున్నాయని ఇటీవల కెనడా ప్రభుత్వం ఒక సంచలన నివేదికను విడుదల చేసిన సంగతి తెలిసిందే. భారత్‌లోని పంజాబ్‌లో స్వతంత్ర దేశస్థాపన కోసం హింసాత్మక మార్గాలకు మద్దతు ఇచ్చే ఖలిస్థానీ ఉగ్రమూకలు కెనడా సహా అనేక దేశాల్లో నిధులు సేకరిస్తున్నట్లు నివేదికలో వెల్లడించింది.

అప్పట్లో ట్రూడో ఆరోపణలతో భారత్–కెనడా సంబంధాలు దెబ్బతిన్నాయి. ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్యలో భారత్ హస్తం ఉందంటూ ఆయన ఆరోపించారు. ఈ ఆరోపణలను భారత్ ఎప్పటికప్పుడు ఖండిస్తూ వచ్చింది. ఇరుదేశాలూ పరస్పరం దౌత్యవేత్తలను వెనక్కి పంపించాయి. ఇటీవల కెనడాలో జరిగిన ఎన్నికల్లో మార్క్ కార్నీ విజయంతో ఇరుదేశాల మధ్య సంబంధాల పునరుద్ధరణకు కృషి జరిగింది. ఈ క్రమంలోనే ఇరుదేశాలు పరస్పరం దౌత్యవేత్తలను కూడా పునర్నియమించాయి.

18-09pg6exHMNWJQE 10_18-09pg6exHMNWJQE.qxd 9/18/2025 12:55 AM Page 1



# శ్రీకాళహస్తిలో ప్రధాని జన్మదిన వేడుకలు

## బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ సారథ్యంలో మెగా రక్తదాన శిబిరం



ప్రధాని జన్మదిన సందర్భంగా రక్తదానంచేస్తున్న బిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 17 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో బారత ప్రధాని నరేంద్రమోదీ 75వ సంవత్సర జన్మదిన వేడుకలు రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ పారధ్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి యువకులు,బిజెపి కార్యకర్తలు,విద్యార్థుల నుంచి విశేష స్పందన వచ్చింది.ఈ శిబిరాన్ని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి ఓ.బాలకృష్ణ పర్య వేక్షించి అభినందించారు. శ్రీకాళహస్తిలో ఇప్పటి వరకు నిర్వహించిన రక్తదాన శిబిరాల్లో ఎప్పుడూ లేని విధంగా బుధవారం కోలా ఆనంద్ తరపున నిర్వహించిన రక్తదాన శిబిరంలో 217 మంది రక్తదానం చేసారు.తిరుపతి జిల్లాలోని బిజెపి నాయకులు కదలి వచ్చారు.ఈ సందర్భంగా తిరుపతి రుయా ఆసుపత్రి ప్రసంశాపత్రాలను అందించారు. శ్రీకాళహస్తిలోని సరస్వతి ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన భారత ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన సందర్భంగా 75కిలోల కేక్‌ను కోలా ఆనంద్‌కుమార్ జిల్లా బిజెపి అధ్యక్షులు సామంచి శ్రీనివాసులు ద్వారా కట్ చేయించి సమావేశానికి హాజరైన వారికి పంచిపెట్టారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సభాధ్యక్షులు కోలా ఆనంద్‌కుమార్ మాట్లా డుతూ దేశ వ్యాప్తంగా ప్రధాని జన్మదిన వేడుకలను పక్షోత్సా వాలుగా నిర్వహించుటకు నిర్ణయించినట్లు వివరించారు. రాష్ట్ర అధ్యక్షులు పివియన్ మాధవ్ పిలుపు మేరకు 15రోజుల పాటు వివిధ కార్యక్రమాలను నిర్వహణకు ప్రణాళికలు రూపొందించామన్నారు. భారత దేశాన్ని ప్రగతి పథంలో 12 సంవత్సరాలుగా నడుపుతున్నారన్నారు. ప్రపంచమే భారత దేశం వైపు దృష్టి మరల్చటానికి నరేంద్రమోదీ పాలన ఎంతో ఆకర్షణీయంగా మారిందన్నారు. ప్రపంచానికి సంబంధించిన ఎన్నో కీలక నిర్ణయాల్లో మోదీ నిర్ణయమే కీలకమైందన్నారు. అందరిని ఆకట్టుకుంటూ పరిపాలన సాగించే సత్తా ఒక్క నరేంద్రమోదీకే దక్కిందన్నారు. ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధికి ఇతోధిక సహాయ సహకారాలను అందిస్తున్నారు. అమరావతి రాజధాని నిర్మాణానికి అలాగే పోలవరం పూర్తికి ప్రత్యేక నిధులు అందిస్తూ రాష్ట్రాభివృద్ధికి సహకరిస్తున్నారన్నారు.రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ నిధులు అందిస్తున్నారని కోలా ఆనంద్‌కుమార్ అన్నారు.ఈ సందర్భంగా మొదటి 'రక్తదాతగా కోలా ఆనంద్' అందించారు.

### విద్యార్థిని పుర్రె ఎముకకు గాయమయ్యేలా కొట్టడంపై విచారం వ్యక్తం చేసిన డిసిఎం పవన్

**విజయవాడ,సెప్టెంబరు 17,ప్రభాతవార్తప్రతినిధి:** చిత్తూరు జిల్లా పుంగనూరులోని భాష్యం స్కూల్ లో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థిని సాత్విక నాగశ్రీ తలపై ఉపాధ్యాయుడు కొట్టడం మూలంగా పుర్రె ఎముక చిట్లిందని తెలిసి ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు విచారం వ్యక్తం చేశారు. పుర్రె ఎముక చిట్లడం మూలంగా తీవ్ర సమస్యలు తలెత్తిన విషయం ఉప ముఖ్యమంత్రివర్యులు దృష్టికి వచ్చింది. ఈ ఘటన వివరాలు తెలుకోవాలని తన కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. తరగతి గదిలో అల్లరి చేస్తుందనే కారణంతో స్కూల్ బ్యాగ్ తో విద్యార్థిని తలపై ఉపాధ్యాయుడు కొట్టారని, ప్రస్తుతం ఆ బాలికకు బెంగళూరులో కుటుంబ సభ్యులు వైద్యం చేయించి ఇంటికి తీసుకువచ్చినట్టు అధికారులు తెలిపారు. ఆరు నెలలపాటు బాలిక ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తూ ఉండాలని వైద్యులు సూచించినట్లు కుటుంబ సభ్యులు తెలిపినట్లు వివరించారు. ఈ ఘటన ఎంతో బాధాకరమైనదని, పాఠశాలల్లో విద్యార్థులను పాతకాలం మాదిరి దండించే విధానాన్ని విద్యావేత్తలు, మానసిక శాస్త్రవేత్తలు అంగీకరించడం లేదని ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు అభిప్రాయపడ్డారు. స్కూల్లో అయినా, ఇంట్లో అయినా అల్లరి చేయడం లాంటివి చోటు చేసుకొంటే... అదుపు చేసేటప్పుడు కూడా పిల్లల మానసిక ధోరణులను ఉపాధ్యాయులు, తల్లితండ్రులు అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

## దసరామహోత్సవాలకు ముస్తాబౌతున్న దక్షిణ కైలాసం



**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 17 ప్రభాతవార్త** తిరుపతిజిల్లా శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో దసరా మహోత్సవాలకు ముస్తాబౌతుంది.ఈ నెల 22 నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలకు ఓ వైపు దేవస్థానం మరో వైపు ప్రైవేటు వ్యక్తులు వివిధ దేవి దేవాలయాల్లో నిర్వహణకు సిద్దం చేస్తున్నారు. పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో దసరా ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించటం ఆనవాయితి.ఈ నేపధ్యంలో శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి గోడపత్రికలను ఆవిష్కరించారు. ఆర్యవైశ్య సంఘం పట్టణం,బహదూరుపేటల్లో పాలకమండలి సమావేశాలు నిర్వహించారు.ఈ ఏడాది గతంలోఎన్నడూ లేని విధంగా అమ్మవారి నవరాత్రి ఉత్సవాలను నిర్వహించాలని తీర్మానించారు. దేవస్థానం సారథ్యంలో ఆలయంలో వెలసిన జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారి ఆలయంలోనూ, ఎదురుగా బొమ్మల కొలువు ఏర్పాటు చేయం ఆనవాయితి. అలాగే బాల జ్ఞానాంబ ఆలయంలో ఉత్సవాలు నిర్వహిస్తారు.ఇక మహిళా భక్తుల భాగస్వామ్యంతో కనకాచలంపై వెలసిన దుర్గమ్మ ఆలయంలో భారీ ఎత్తున నిర్వహించటం ఆనవాయితి. ఇక్కడ అమ్మవారికి పూజలు అభిషేకాలతో పాటు పొంగళ్ళు పెట్టే సంప్రదాయం అమలులో ఉంది. అలాగే ఆలయానికి అనుబంధంగా ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో భారీ ఎత్తున అలంకారాలు, పూజలు నిర్వహిస్తారు. ఇందుకు ఆలయాన్ని శనివారం నుంచే ఏర్పాట్లు చేపట్టారు.కాగా పట్టణ నడిబొడ్డులోని కొత్తపేట శీతలాంబ ఆలయం వద్ద పది రోజుల పాటు రాష్ట్ర స్థాయి కళాకారులను ఆహ్వానించి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుంది.ఈ మేరకు ఇక్కడ భారీ ఎత్తున సెట్టింగ్‌లు ఏర్పాటు చేసారు.ఇక పట్టణానికి దక్షిణాన వెలసిన దక్షిణ కాళి మాత ఆలయంలో పూజలతో పాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఇందుకు దక్షిణ కాళి మాత ఆలయం ముస్తాబౌతుంది.పుణ్యక్షేత్రంలో వినాయక చవితి ఉత్సవాలను 12రోజులు నిర్వహిస్తే దసరా మహోత్సవాలను 9 రోజుల పాటు నిర్వహిస్తారు. ఎటు చూసినా చక్కటి చలువ పందిళ్ళతో ముస్తాబు చేసారు.

## ప్రధాని మోడీతో దేశానికి ఒరిగింది ఏమీలేదు

### - మాజీ మంత్రి చింతామోహన్



**కుప్పం, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త** 11ఏళ్లుగా దేశ ప్రధాని నరేంద్ర మోడీతో దేశానికి ఒరిగింది ఏమీ లేదని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ పేర్కొన్నారు. బుధవారం చిత్తూరు జిల్లా కుప్పం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో పలు అంశాలపై ఆయన మాట్లాడారు. 75ఏళ్ల పూర్తయ్యాయని ఆద్వానీని పక్కన పెట్టిన వారు ఇప్పుడు ప్రధాని మోడీని ఏం చేస్తారని ప్రశ్నించారు. రష్యా వద్ద రూ30లకు లీటర్ పెట్రోల్, రూ 28ల.కు లీటర్ ముడి చమురు కొనుగోలు చేసి 50వేల కోట్ల లాభం కోటీశ్వరులకు ఇస్తున్నారని విమర్శించారు. దేశంలో వంద కోట్లకు పైబడి అప్పులు ఉన్న ధనవంతులకు ఏకంగా 14.50లక్షల కోట్ల రూపాయల రుణమాఫీ చేశారని పేర్కొన్నారు. వీరిలో గుజరాత్‌లో ఎంతమంది, ఎపిలో ఎంత మంది ఉన్నారో తెలపాలని డిమాండ్ చేశారు. యూరియా కొరత పాపం కేంద్రానిదేనన్నారు. రైతులు క్యూలో ఉంటున్నారన్నారు. కాంగ్రెస్ పాలనలో ఇలాంటి స్థితి రాలేదన్నారు. ఆ ంధ్రప్రదేశ్‌లో వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం తగదని పేర్కొన్నారు. సిఎం చంద్రబాబునాయుడు రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణతో దళితుల్ని విభజించరాదన్నారు. యుపి, తమిళనాడులో వర్గీకరణ చేయలేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యావిధానం లోపభూయిష్టంగా మారిందని ప్రభుత్వ పాఠశాలలు మూసేస్తున్నారని ఆరోపించారు. సిఎం చంద్రబాబునాయుడు చిత్తూరు జిల్లా అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేష్, మైనార్టీ సెల్ నేత సమీ ఉల్లా పాల్గొన్నారు.

### రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యదర్శిగా తిరుపతి రావు



**కుప్పం, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త** రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యదర్శిగా ద్రవిడ వర్సిటీలో ఆంగ్ల విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న బి.తిరుపతి రావును నియమిస్తూ ఉన్నత విద్యామండలి ప్రభుత్వ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రొఫెసర్ తిరుపతి రావు 2006నుంచి ఆంగ్లశాఖ మరియు కమ్యూనికేషన్స్ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. అలాగే 1991లో తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ నుంచి పిహెచ్‌డి పొందారు. ఈయన నేతృత్వంలో పలు వర్క్‌షాప్‌లు, సెమినార్లు జరిగాయి. సిఎం చంద్రబాబునాయుడు సొంత నియోజకవర్గం కుప్పంలోని ద్రవిడ వర్సిటీ నుంచి రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యదర్శిగా ప్రొఫెసర్ తిరుపతి రావు నియమితులైన నేపథ్యంలో ద్రవిడ వర్సిటీ మున్ముందు మరింత అభివృద్ధి పథంలో పయనిస్తోందనడంలో సందేహం లేదు.

### ప్రతి ఒక్కరికి సంక్షేమపథకాలు అందడమే మా ఉద్దేశం : ఎమ్మెల్యే సోమిరెడ్డి

**మనుబోలు (నెల్లూరు), సెప్టెంబరు 17, ప్రభాతవార్త :** పార్టీలకు కతీతంగా సంక్షేమ పథకాలు ప్రతి పేదవారికి అమలు చేస్తామని సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు.బుధవారం నాడు మనుబోలు మండలం పిడూరు గ్రామంలో టిడిపి నాయకులు తిక్కవరపు శ్రీదర్‌రెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి ఆద్వర్యంలో పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంబించారు. 20 లక్షలతో పిడూరు నుండి ఎల్ఎన్‌పురం వరకు తారురోడ్డు మంజూరు. పిడూరు యాచవరం మధ్యలో 40 లక్షలతో నిర్మించిన బ్రిడ్జిని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతు పేదలకు పార్టీలతో సంబంధం లేకుండా సంక్షేమపథకాలు అమలు చేస్తామని అన్నారు. త్వరలో మనుబోలులో నూతన ప్రభుత్వ వైద్యశాల భవనాన్ని మంత్రుల చే ప్రారంభిస్తామన్నారు. ఈకార్యక్రమంలో టిడిపినాయకులు పొన్నూరు రామకృష్ణయ్య, గాలి రామకృష్ణారెడ్డి, వర్ధినేని మస్తాన్‌నాయుడు, చేరెడ్డి రామిరెడ్డి,సాని వెంకటరమణయ్య,శివుడు రాజగౌడ్ ,పచ్చిపాల రామిరెడ్డి, రాయపాటి కిరణ్‌కుమార్, లాయర్ కిష్టయ్య, సురేష్‌రెడ్డి, అమీర్‌బాషా, బాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గోన్నారు.

## డెంగ్యూ వ్యాధితో చిన్నారి మృతి



చిన్నారి హర్షిత్ (ఫైల్‌ఫోటో)

**గుత్తి, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త** అనంతపురం జిల్లా గుత్తి మున్సిపాలిటీ వరిధిలోని గుత్తి ఆర్ఎస్ లో నివాసముంటున్న వెంకటరమణ, మౌనిక దంపతుల కుమారుడు హర్షిత్ (2) బుధవారం డెంగ్యూ వ్యాధితో మృతి చెందాడు. వారం రోజుల క్రితం చిన్నారికి జ్వరం రావడంతో ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స అనంతరం అతడిని కర్నూల్‌కు తరలించగా డెంగ్యూగా నిర్ధారణ అయింది. తదుపరి హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ ఆ చిన్నారి అక్కడే మృతి చెందాడు.

కాగా ఇప్పటిదాకా ముగ్గురు చిన్నారులు ఈ వ్యాధి బారిన పడి మరణించినట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు దోమల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని, వైద్య సేవలను అందుబాటులో వుంచాలని ప్రజలు కోరుతున్నారు.

### క్రీడల ద్వారా పర్యాటకానికి ప్రచారం, రాష్ట్ర సంస్కృతిని ప్రపంచానికి చాటి చెప్పేందుకు నిర్ణయం: ఎపిటిడిసి ఎండి ఆమ్రపాలి

విజయవాడ, సెప్టెంబర్ 17,ప్రభాతవార్తప్రతినిధి: క్రీడల ద్వారా రాష్ట్ర సంస్కృతిని ప్రపంచానికి చాటి చెప్పేందుకు ఇండియా ఖేలో ఫుట్ బాల్ తో ఏపీ పర్యాటక శాఖ భాగస్వామ్యం కుదుర్చుకుందని, ఇదొక మైలురాయిగా ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి కాట పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్‌లో క్షేత్రస్థాయి యువ ప్రతిభను వెలికితీయడం, సాధికారత కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ, ఇండియా ఖేలో ఫుట్‌బాల్ (ఐకెపి )తో కలిసి "టైగర్ క్యాపిటల్ ఐకెపి స్కాట్ ఆన్ వీల్స్" కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనుంది. ఈ కార్యక్రమంలో భాగంగా ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి కాట పర్యవేక్షణలో 45 రోజులపాటు ఫుట్‌బాల్ రోడ్‌షో జరుగనుంది. విశాఖపట్నం, రాజమండ్రి, సత్తెనపల్లి, విజయవాడ, కర్నూలు, అనంతపురం, తిరుపతి వంటి ఏడు ప్రధాన నగరాలకు చేరుకోనున్న రోడ్ షోలో పదికి పైగా చిన్న పట్టణాల్లో ఫుట్‌బాల్ ట్రయల్స్, క్లినిక్స్, పేరెంట్ వర్క్‌షాప్‌లు, బాలికలకు సాధికారత కల్పించే సెషన్స్‌ను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి కాట మాట్లాడుతూ పర్యాటకం అంటే కేవలం ప్రదేశాలు చూడటమే కాదు, ప్రజల కథలను, వారి సంస్కృతిని గొప్పగా చాటి చెప్పడమన్నారు. స్కాట్ ఆన్ వీల్స్ కు మద్దతు ఇవ్వడం ద్వారా తాము ఫుట్‌బాల్‌తో పాటు యువ సాధికారతను, ఆత్మగౌరవాన్ని ఆంధ్రప్రదేశ్ నలుమూలలకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు.ఫుట్‌బాల్ ద్వారా ఆంధ్రాను కనుగొనండిఖి అనే నినాదంతో రాష్ట్రానికి ఉన్న పర్యాటక అవకాశాలకు, సంస్కృతికి, యువ శక్తికి కేంద్రంగా నిలుపుదాం" అని పిలుపునిచ్చారు.టైగర్ క్యాపిటల్ వ్యవస్థాపకుడు, ఎండీ, సీఈఓ గౌరవ్ గుప్తా మాట్లాడుతూ,స్కాట్ ఆన్ వీల్స్ టైటిల్ పార్టనర్‌గా ఉండటం తమకు గర్వకారణం అన్నారు. ఒక ఎన్ బీఎఫ్ సీగా, ఆర్థిక స్వేచ్ఛతో కమ్యూనిటీలకు సాధికారత కల్పించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా తమ 27 బ్రాంచ్‌ల వాలంటీర్లు తల్లిదండ్రులు,

క్రీడాకారులతో నేరుగా కలిసి వారికి ఆర్థిక అక్షరాస్యతను, యువతకు అప్రెంటిస్ షిప్‌లను, కుటుంబాలకు ఉద్యోగ అవకాశాలను కల్పించనున్నారని పేర్కొన్నారు. ఇది కేవలం రుణాలు ఇవ్వడం కాదు, కుటుంబాలకు కలలు కనే స్వేచ్ఛను ఇవ్వడం

కూడా అని ఆయన వెల్లడించారుఐకెపి వ్యవస్థాపకుడు ఫణి భూషణ్ మాట్లాడుతూ ఫుట్‌బాల్ భారతదేశంలోని ప్రతి ఇంటికీ చెందాలని తాము నమ్ముతామన్నారు. స్కాట్ ఆన్ వీల్స్‌ను ఆంధ్రప్రదేశ్‌కు తీసుకురావడం ద్వారా, ఫుట్‌బాల్ అవకాశాలు కొన్ని రాష్ట్రాలకే పరిమితం కాదని మేము నిరూపిస్తున్నామన్నారు.

# దసరా ఏర్పాట్లపై మంత్రి సమీక్ష



గవర్నర్‌కు దసరా ఆహ్వానపత్రిక అందించిన నిర్వాహకులు

**ఇంద్రకీలాద్రి, సెప్టెంబర్ 17, ప్రభాతవార్త :** అమ్మల గన్న అమ్మ బెజవాడ దుర్గమ్మ వారి ఆలయంలో ఈ నెల 22 నుండి ప్రారంభమయ్యే దసరా ఉత్సవాల ఏర్పాట్లపై మంత్రి ఆనం రామనారాయణరెడ్డి బుధవారం సమీక్షించారు. దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరి జవహర్‌లాల్, కమీషనర్ రామచంద్ర మోహన్, ఇఓ వికె శీనా నాయక్ తదితర అధికారులు పాల్గొన్నారు. ఆహ్వాన పత్రికను బుధవారం రాష్ట్ర గవర్నర్ కు దేవదాయ శాఖ కమీషనర్ రామచంద్రమోహన్, ఇఓ శీనానాయక్‌లు అందించారు.

– ప్రముఖులకు ఆహ్వానం:
అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, డిప్యూటి స్పీకర్ రఘురామకృష్ణంరాజు,
హోంమంత్రి అనిత, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి లకు బుధవారం దసరా ఆహ్వాన పత్రికను అందించారు. దుర్గమ్మ వారి ఆలయంలోజరిగే నిత్యాన్నదాన పథకానికి రు.1,00,116ల విరాళాన్ని విజయవాడకు చెందిన శ్రీవేంకట యశస్వి పేరిట బుధవారం అందించారు.





రఘురామకృష్ణరాజుకు దసరా ఆహ్వానపత్రిక అందిస్తున్న దృశ్యం, అసెంబ్లీస్పీకర్‌కు ఆహ్వానపత్రిక అందిస్తున్న దృశ్యం

# మీరంతా నాలెడ్జ్ ఉన్నవాళ్లు కదా.. అసెంబ్లీకి రండి : మంత్రి సవిత



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత

**సచివాలయం, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త :** మీరంతా ఫుల్లు నాలెడ్జ్ కలిగిన వాళ్లే కదా... సోషల్ మీడియాలో మార్ఫింగ్ ఫోటోలు పోస్టు చేయడం, అబద్దపు ప్రచారాలు చేయడమేందుకు? అసెంబ్లీకి రండి యూరియా, ఉల్లి, మెడికల్ కాలేజీలు ఏ అంశంపైనైనా చర్చిద్దాం అని జగన్ సహా వైసీపీ నాయకులకు రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత ఎద్దేవ చేస్తూ సవాల్ విసిరారు. తన ఫోటోను మార్ఫింగ్ చేస్తూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టడంపై ఆమె తీవ్ర ఆగ్రహ ం వ్యక్తంచేశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మెగా డిఎస్సీలో బిసి స్టడీ సర్కిళ్ళ ద్వారా శిక్షణ పొందిన 246మంది బిసి అభ్యర్థులు టీచర్ పోస్టులకు ఎంపిక కావడంపై మంత్రి సవిత హర్షం వ్యక్తంచేశారు. రాష్ట్ర సచివాలయం పబ్లిసిటీ సెల్లో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్దిని సంక్షేమాన్ని చూసి జగన్ ఓర్వలేక విషం కక్కుతున్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాలు సూపర్ అబద్దాలంటూ ఫేక్ ప్రచారాలు చేస్తున్నాడన్నారు. తల్లికి వందనం, స్త్రీశక్తి, ఉచిత ఆర్టీసీ ప్రయాణం, మహిళలకు మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, తదితరాలు ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీ సీఎం నెరవేర్చుతున్నారన్నారు. తనపై వైసీపీ నాయకులు రోజా, ఉషశ్రీ చరణ్ చేసిన విమర్శలపై మంత్రి తీవ్రంగా స్పందించారు. రోజా, విడదల రజనీ సహా ఎందరో వైసీపీ వలస నాయకులు టిడిపిలోనే రాజకీయ ఏబిసిడీ నేర్చుకున్న వాళ్ళే నన్నారు. టిటిడి లెటర్లు అమ్ముకున్నదెవరో నగరి, కళ్యాణదుర్గంలో ఎవరినడిగినా చెబుతా రన్నారు. చెరువులను మాయం చేసి లేఅవుట్లు వేసుకున్నదెవరో అందరికి తెలుస న్నారు. మెడికల్ కాలేజీలపై నిజం చెబితే భయమెందుకు అని ప్రశ్నించారు. తోటి మహిళ అని చూడకుండా నోటికొచ్చినట్లు మాట్లాడడం సరికాదన్నారు. ఐదేళ్లలో మీ నియోజకవర్గాల్లో చేసిన అభివృద్ధి పైనా, 15నెలల కాలంలో పెనుకొండలో తాను చేసిన అభివృద్ధిపైన చర్చకు సిద్దం అని రోజాకు, ఉషశ్రీ చరణ్‌కు మంత్రి సవాల్ చేశారు. తన ఫోటోను మార్ఫింగ్ చేస్తూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన వారిపై సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేసినట్లు మంత్రి సవిత తెలిపారు. మహిళలను కించపరచడం మానుకోవాలని వైసీపీ నాయకులకు,

కార్యకర్తలకు హితవు పలికారు. సీఎం చంద్రబాబు నిర్మించిన సచివాలయంలోనే జగన్ పాలించిన విషయాన్ని మంత్రి సవిత గుర్తు చేశారు.

## మాజీ సిఎం జగన్‌కు రాజకీయ భవిష్యత్తు లేదు : హోం మంత్రి అనిత

### విజయవాడలో వైసిపి నుంచి టిడిపిలో చేరిన వారితో హోం మంత్రి



**విజయవాడ,సెప్టెంబరు 17,ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు రాజకీయ భవిష్యత్తు లేదని హోం మంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు.అయిదేళ్ళ పాటు రాష్ట్రాన్ని విధ్వంసం చేసిన జగన్ ప్రజలు ఎన్నటికి ఆదరించరన్నారు.రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం పట్ల ప్రజలు అత్యంత విశ్వసనీయత్తో ఉన్నారు.కేవలం 16 నెలల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి గాడిలో పెట్టిన ఘనత సీఎం చంద్రబాబుదన్నారు. విజయవాడలోని ఓ కన్వెన్షన్ హాల్ లో హోం మంత్రి వంగలపూడి అనిత సమక్షంలో టీడీపీలో పాయకరావుపేట నియోజకవర్గం యస్ రాయవరం మండలం వైసీపీ శ్రేణులు చేరారు. వారిని కండువాలు కప్పి పార్టీలోకి అనిత ఆహ్వానించారు తెలుగుదేశం పార్టీలో చేరిన మాజీ ఎం.పి.పి, వైస్ ఎం.పి.పి బొలిశెట్టి గోవిందరావు, మాజీ ఎం.పి.పి బొలిశెట్టి సారదాకుమారి, ప్రస్తుతం యస్ రాయవరం ఎం.పి.పి కేశిబోయిన వెంకటలక్ష్మి,వైసిపీ జిల్లా కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు. యస్ రాయవరం సర్పంచ్ భూపతి అప్పారావు ఒమ్మవరం సర్పంచ్ పాలపర్తి పాపారావు, కర్రివాణిపాలెం సర్పంచ్ కర్రి వరహాలురావు యస్ రాయవరం మాజీ ఎం.పి.పి కోనా లోవలక్ష్మీ, ఒమ్మవరం బాలం సూరిబాలు యస్ రాయవరం బైపా శ్రీను, సీనియర్ నాయకులు కోంకుపూడి రామకృష్ణ,వెలగా శ్రీనివాసరావు, కందికొండ నాగేశ్వరరావు,శిగిరెడ్డి అప్పారావు, కాసపు అప్పన్న,వైదర్భి సురేష్,వీర్ల ప్రకాష్, మురికుర్తి గంగరాజు,దుబాసి సన్యాసిరావు చేరారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ పార్టీ బలోపేతం ఒకవైపులోకల్ ఎన్నికలు మరోవైపు అందరు దృష్టిలో గత ఎన్నికల్లో 44 వేల మేజార్టీతో గెలిచామన్నారు. రానున్న లోకల్ ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థులు గెలవడమే తన లక్ష్యమన్నారు. టీడీపీ పనితీరు నచ్చి, నమ్మి వచ్చిన వారితో కలిసి మరింత కష్టపడదామన్నారు మరో 20 సంవత్సరాలు పాయకరావు పేట నియోజకవర్గం ఎన్డియే కూటమే గెలవాలి పార్టీలో గౌరవం ఎప్పుడు ఉంటుందన్నారు.

### రంగనాయకస్వామి ఆలయ భూముల ఆరోపణలపై విచారణకు సిద్ధం మాజీ మంత్రి: పేర్ని నాని

**విజయవాడ,సెప్టెంబరు 17,ప్రభాతవార్త ప్రతినిధి:** మచిలీపట్నం లోని రంగనాయకస్వామి ఆలయ భూములు విషయంలో తనపై వస్తున్న ఆరోపణలపై విచారణకు సిద్దంగా ఉన్నా.నేనే తప్పు చేసినట్లు తేలితే జైల్లో పెట్టండి.వేలం రద్దు చేసి భూములు వెనక్కు తీసుకోండి. 2020 నుంచి టిడిపి నేతలు నాపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారు. మరి ఎందుకు వాటిని నిరూపించి నన్ను జైల్లో వేయట్లేదు. మీది చేతగాని ప్రభుత్వమా? అని వైకాపా నేత,మాజీ మంత్రి పేర్ని నాని సవాల్ చేశారు. మచిలీపట్నం లోని తన నివాసంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'దేవుడి భూములు అన్యాక్రాంతం కారణంతో అప్పటి దేవాదాయ శాఖ అధికారులు బహిరంగ వేలం పెడితే...అన్ని పార్టీల వారు వేలంలో పాల్గొన్నారు. భూములు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. నేను దేవుడి భూములు కొట్టేశారని ఆరోపిస్తున్న గొర్రెపాటి గోపీచంద్ 2007తన భార్య పేరుతో అదే వేలంలో పాల్గొనలేదా?ఆలయ రికార్డులు తనిఖీ చేసేందుకు సిద్దమా? నా భార్య పేరున 500 గజాలు..ఆమె తండ్రి పేరున 500 గజాలు...గజం రూ.11,500 చట్ట ప్రకారమే కొనుగోలు చేశాం. 2024 ఎన్నికల్లో నా కుమారుడు కిట్టు అఫిడవిట్‌లో వాటి వివరాలు చూపించాం' అని పేర్కొన్నారు.

## కలకలం రేపిన తాటిపర్తి బావిలో మృతదేహాలు

**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బ్యూరో సెప్టెంబర్17** (ప్రభాతవార్త): బావిలో తేలియాడుతూ రెండు మృతదేహాలు లభ్యమైన సంఘటన బుధవారం గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామ శివారు పొలాల్లో చోటుచేసుకుంది.రెండు మృతదేహాలు బావిలో లభ్యం కావడం చుట్టూ పక్కల ప్రాంతాల్లో కలకలం రేపింది.ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు.డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ బృందాలను రంగంలోకి దింపారు.కాకినాడ జిల్లా ఏఎస్పీ దేవరాజ్ మనీష్ పాటిల్, పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్సై రామకృష్ణ, సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.ప్రాథమిక అంచనా మేరకు స్థానికుల వివరాల ప్రకారం తాటిపర్తి గ్రామానికి చెందిన తోలాటి సూరిబాబు, రంపం శ్రీను లను మృతులుగా గుర్తించారు.ఈ సంఘటన పై పిఠాపురం సిఐ శ్రీనివాస్ మాట్లాడుతూ
ఆర్థిక లావాదేవీల కారణంగా ఇద్దరు వ్యక్తులను నూతిలో పడవేసి హత్య చేసారని,మరొకరి పై హత్యాయత్నం పై కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. కుంపట్ల సూరిబాబు తెలిపిన వివరాలు ప్రకారం 16 వ తేదీ రాత్రి సుమారు 8 గంటల సమయంలో ముద్దాయి రంపం గంగాధర్ తాను అతని బంధువులైన రంపం శ్రీనివాస్, తోరాటి సూరిబాబు అను వ్యక్తులకు ఇవ్వవలసిన బాకీలు నిమిత్తం మాట్లాడాలని పథకం ప్రకారం వారిని ఊరి శివారు బావి వద్దకు తీసుకుని వెళ్లి అక్కడ వారిద్దరిని నూతిలో పడేసి హతమార్చారు.

## మరో 20యేళ్లు పాయకరావుపేట మనదే !స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చూపించాలి: హోం మంత్రి అనిత

**(నక్కపల్లి ,ప్రభాతవార్త), సెప్టెంబర్ 17:** రానున్న స్థానిక ఎన్నికల్లో పాయకరావుపేట నియోజకవర్గంలో అన్ని స్థానాల్లో టిడిపి విజయం సాధించాలని, ఆ విధంగా ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేయాలని ,మరో 20 ఏళ్ల పాటు పాయకరావుపేటలో టిడిపి జెండా ఎగరాలని, అందుకు అందరు కష్టపడి పని చేయాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పిలుపునిచ్చారు. బుధవారంవిజయవాడలోని ఎస్ఎల్‌వీ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో పాయకరావుపేట నియోజకవర్గానికి చెందిన వైసీపీ కీలక నేతలు, ప్రజాప్రతినిధులు హోం మంత్రి వంగలపూడి అనిత సమక్షంలో కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానం ఆహ్వానించారు.వైసీపీని వీడి టిడిపిలో చేరాలని ముందుకు వచ్చిన మాజీ ఎం.పి.పి బొలిశెట్టి గోవిందరావు, మాజీ వైస్ ఎం.పి.పి బొలిశెట్టి సారదాకుమారి, ప్రస్తుత యస్. రాయవరం ఎం.పి.పి కేశిబోయిన వెంకటలక్ష్మి, వైసీపీ జిల్లా కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు టీడీపీ లతోపాటు యస్. రాయవరం, ఒమ్మవరం, కర్రివాణిపాలెం గ్రామాల సర్పంచులు, పలువురు ఎంపీటీసీలు, సీనియర్ నాయకులు టిడిపిలో చేరారు.ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూపార్టీ బలోపేతం ఒకవైపు – రానున్న లోకల్ ఎన్నికలు మరోవైపు అని అన్నారు.గత ఎన్నికల్లో 44 వేల మెజార్టీతో గెలిచాం. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థుల విజయం నా లక్ష్యమన్నారు. ప్రతి ఒక్కరూ కష్టపడాలని చెప్పారు. ఇంకో 20 ఏళ్ల పాయకరావుపేటలో ఎన్డీయే విజయం సాధించాలన్నారు., తెలుగుదేశం పార్టీలో గౌరవం, ప్రాధాన్యత ఉంటుందని, నియోజకవర్గ అభివృద్ధే ముఖ్యలక్ష్యమని హోం మంత్రి స్పష్టం చేశారు. సందర్భంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని టిడిపిలో చేరిన బొలిశెట్టి గోవిందు మాట్లాడుతూ25 సంవత్సరాలు పని చేసిన పార్టీలో నాకు గౌరవం దక్కలేదని, తెలుగుదేశంలో చేరడం నాకు సంతోషంగా ఉందని బొలిశెట్టి గోవిందరావు అన్నారు.

## ఏసిబి వలలో తహశీల్దార్, గిర్దావర్, ఆపరేటర్

**తల్లాడ, సెప్టెంబర్ 17, ప్రభాతవార్త** 15 కుంటల భూమి రిజిస్ట్రేషన్ కోసం రూ. 10 వేలు డిమాండ్ చేయడంతో ఇష్టం లేని రైతు ఏసిబిను ఆశ్రయించడంతో ముగ్గురిని ఏసిబి డిఎస్పి ఆధ్వర్యంలో సిబ్బంది పట్టుకుని కేసు నమోదు చేశారు. ఏసిబి డిఎస్పి వై. రమేష్ వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన రైతు ఇటీవల ప్రభుత్వం భూ భారతి కార్యక్రమంలో భాగంగా పట్టా కోసం దరఖాస్తు చేయగా పాస్‌బుక్ కోసం రెవెన్యూ అధికారులను సంప్రదించగా రూ. 12 వేలు డిమాండ్ చేయగా అంత ఇవ్వలేనని చెప్పి రూ. 10 వేలకు ఒప్పుకోగా బుధవారం సాయంత్రం రూ. 10 వేలకు రూ. 200 తగ్గించి ఇస్తుండగా తహశీల్దార్ వి. సురేష్‌కుమార్, గిర్దావర్ భాస్కర్, ధరణి ఆపరేటర్ రాథోడ్‌ను పట్టుకుని రిమాండ్‌కు తరలించడం జరుగుతుందని తెలిపారు. రైతులు ప్రభుత్వ కార్యాలయాల్లో లంచం డిమాండ్‌చేస్తే తమను సంప్రదించాలని కోరారు. అయితే రైతు ప్రభుత్వ కార్యాలయాల్లో డబ్బులు డిమాండ్ చేస్తే టోల్ ఫ్రీ 1064కు ఫిర్యాదు చేయాలని కోరారు.

18-09Pg7exHMNWJQE 11_18-09Pg7exHMNWJQE.qxd 9/18/2025 1:01 AM Page 1



## స్థానిక సంస్థల ఎన్నికలు ఆలస్యానికి కెసిఆర్ కారణం

### ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 17,ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రెజర్వేషన్ల కు కెసిఆర్ క్యాప్ విధించడం వల్లనే ఎన్నికలు లేటు అవుతున్నాయని ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. గాంధీభవన్‌లో బుధవారం విలేఖరులతో మాట్లాడుతూ కాలేజిలకు ఫీజు రియంబర్స్‌మెంట్ 1200కోట్లు బకాయిలు మీరు ఎగ్గొట్టం వల్లే వచ్చాయని కెటిఆర్‌కు సమాధానం చెప్పారు. కెటిఆర్ ఉద్దేశం ఏంటి?తెలంగాణ ప్రజలు ఎవరు బాగుపడొద్దని ఉద్దేశమా?గ్రూప్1 అభ్యర్థుల తల్లిదండ్రులు ఒక్కో పోస్ట్ కు 3కోట్లు ఇచ్చారని కేటిఆర్ అంటుండు533 మంది గ్రూప్1 విద్యార్థుల మీద విషం కక్కుతుండు, అవమానిస్తున్నారని ఆయన ఆరోపించారు. కెటిఆర్‌పై ఖచ్చితంగా ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని సిఎం రేవంత్ రెడ్డిని కొరతా అని అన్నారు. మాకు ఓటు వేయలేదు మీరు అనుభవించండి అని కెసిఆర్ శాపాలు పెట్టారు అందుకే ఆరోజే అర్థం అయిందని వివరించారు. అధికారంలో ఉండి తెలంగాణ ను కూల్చారు ప్రతి పక్షం లో ఉండి కూడా కూల్చాలనీ చూస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి ఎక్కడికి పోయిండు అని కెటిఆర్ అంటుండు ఈరోజు ముఖ్యమంత్రి సచివాలయంలో ఉండు ప్రతి పక్ష నేత మీ నాయన ఎక్కడికి పోయిండు అని అన్నారు. కెటిఆర్ ఎనిమిది మంది ఎంపీల గురించి బేస్ లెస్ ఆరోపణలు చేస్తున్నాడని అన్నారు.ఎల్ అండ్ టి నష్టా గురించి మాట్లాడుతున్నారు కానీ మెట్రో ఎవరి హాయంలో వచ్చింది అని ప్రశ్నించారు. మీ పదేళ్ళ హాయంలో ఎల్ అండ్ టి నష్టాల్లోకి పోయిందని ఆరోపించారు. 2010 మెట్రో 2వ స్థానంలో ఉందని అన్నారు. 2014 తర్వాత 20వ స్థానానికి పడి పోయిందని చెప్పారు. కెటిఆర్ 12వేల కోట్ల డ్రగ్స్ గురించి మాట్లాడుతున్నారనీ మేము వచ్చాక నే విచ్చల విడిగా కేసులు పెరుగుతున్నాయనీ ఆరోపించడం అవాస్తవం అని అన్నారు. మీ హయాంలో దందా చేశార అందువల్ల కేసులు పెరగలేదు మా హాయంలో కేసులు పెడుతున్నాం అందులవల్ల కేసులు పెరుగుతున్నాయని తెలిపారు రాజాకార్లను తరిమి కొట్టిన రోజున కేటిఆర్ ఏమి ప్రచారం చేయదల్చుకున్నారని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి నియంత పాలన అంటుండు మరీ కెటిఆర్ మీ హాయంలో మీ అయ్య నియంత పాలన చేసింది గుర్తుకులేదా అని నిలదీశారు.

# బిజెపికి చరిత్ర తెలియదు.. దాన్ని తిరగరాయడమే తెలుసు!



### వీళ్లకు గాంధీ అంటే పడదు.. ఆయనను హత్య చేసిన గాడ్సే దేవుడు

### నెహ్రూ ఆదేశాలతోనే 'పోలో' ఆపరేషన్‌తో హైదరాబాద్ సంస్థానాన్ని విలీనం చేసిన పటేల్

### ఇప్పుడు ఉన్నది పాత బిజెపి కూడా కాదు.. 2014 నుంచి పుట్టిన మోడీ-షా బిజెపి

### తెలంగాణ విలీనదినోత్సవం సందర్భంగా పిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** బిజెపికి భారత స్వాతంత్ర్య సమరం చరిత్ర తెలియదుకానీ చరిత్రను వక్రీకరణలతో తప్పుగా తిరగ రాయడం మాత్రమే తెలుసని వీళ్లకు సత్యాగ్రహం అనే ఆయుధంతో దేశంకు స్వాతంత్ర్యం ప్రసాదించిన గాంధీ అంటే పడదు ఆయనను హత్యచేసిన గాడ్సేను దేవుడుగా కొలుస్తారని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్ విమర్శించారు. గాంధీభవన్‌లో హైదరాబాద్ విలీన దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకం ఆవిష్కరించి అనంతరం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర విలీనానికి కాంగ్రెస్ పార్టీ చేసిన త్యాగాలు, పోరాటాలను ఈ రోజున స్మరించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. విలీనం కోసం అహర్నిశలు కృషి చేసిన రామనంద తీర్థ, జమాల పురం కేశవరావు, బూర్గు ల రామ కృష్ణారావు, పివి నరసింహారావు వంటి మహా నీయులను, నిజాం వ్యతిరేకంగా పోరాడిన కొమురం భీమ్, దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, షేక్ బందగి, కమ్యూనిస్టు యోధులను స్మరించడం ప్రతి తెలంగాణ వాసి బాధ్యత అన్నారు. బిజెపి మాతృసంస్థ జనసంఘ్ ఏనాడు దేశస్వాతంత్రం కోసం పాటుపడలేదని అందులోంచి బిజెపి పార్టీ 1980లో పుట్టిందని, స్వాతంత్రం, తెలంగాణ విలీన పోరాటాలకు సంబంధం లేనిదని మహేష్‌కుమార్ ఎద్దేవా చేశారు. ఇది పాత బిజెపి కూడా కాదు, 2014లో పుట్టిన మోడీ,షాలకు పుట్టిన కొత్త బిజెపి అని అభివర్ణించారు. వీరికి చరిత్ర తెలియదు, చరిత్రను వక్రీకరించడం మాత్రమే తెలుసు. గాంధీని గౌరవించని, గాడ్సేను దేవుడిగా చూసే వారి నుండి దేశభక్తి ఆశించడం వృథా ప్రయాసగా అభివర్ణించారు.1948లో సర్దార్ వల్లభాయ్ పటేల్ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆపరేషన్ పోలో" ద్వారా నాలుగు రోజుల్లో హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసిందని గుర్తుచేశారు. కానీ, నేడు అదే పటేల్ పేరుతో రాజకీయాలు చేస్తున్న బిజెపి ఆయన చేసిన విలీనాన్ని విమోచనంగా పిలవడం పటేల్ ను అవమానించడం కాదా అని ప్రశ్నించారు.ప్రస్తుతం అన్ని రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేస్తూ, ఎన్నికల సంఘాన్ని లొంగదీసుకుని మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ పాలనను ఆయన తీవ్రంగా విమర్శించారు. బీహార్‌లో ఓటు దోపిడీ ప్రయత్నాలు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తున్నారని ఆరోపించారు. రాహుల్ గాంధీ నడిపిస్తున్న ఓటు చోరీ ఉద్యమం" బిజెపి గుండెల్లో వణుకు పుట్టిస్తున్నదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ త్యాగ స్వరూపమని, స్వాతంత్రం కోసం అనేక మంది నాయకులు జైలు పాలయ్యారని... సోనియా గాంధీ, రాహుల్ గాంధీలు ప్రధాని అయ్యే అవకాశమున్నా ఆర్థిక నిపుణుడు డా. మన్మోహన్ సింగ్‌ను రెండుసార్లు ప్రధాని చేశారు అనేది కాంగ్రెస్ త్యాగానికి నిదర్శనం అన్నారు.రాష్ట్రంలో ప్రస్తుతం రేవంత్ రెడ్డి నేతృత్వంలో అద్భుతమైన ప్రజా పాలన కొన సాగుతోందని, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం నుంచి సన్నబియ్యం వరకు అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

## హైదరాబాద్ భూములు అమ్ముకొన్నది ఎవరో ప్రజలకు తెలుసు

### ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్

**హైదరాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో భూములు అమ్ముకుంది ఎవరో తెలంగాణ ప్రజలకు తెలుసనీ,ఎకరం వంద కోట్లకు అమ్మామని గొప్పలు చెప్పుకుంది మీరు కాదా? అనిప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. హైదరాబాద్ సిఎల్‌పి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కెటిఆర్ చిట్ చాట్ పేరుతో చెత్త అంతా వాగుతున్నాడని దుయ్యబట్టారు. పని పాటా లేక సోది పోగిసి మాట్లాడుతున్నాడని ఎద్దేవా చేశారు. మా ముఖ్య మంత్రి పైన పడి ఏడవడం తప్ప కెటిఆర్ కు పనిలేకుండా పోయిందని విమర్శించారు. చిట్ చాట్ లో చెల్లెలు కవిత గురించి మాత్రం నోరు మెదపడం లేదని అన్నారు. కవిత అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పే దమ్ము ,ధైర్యం లేదని విమర్శించారు. కవితపైన కనీసం చిట్ చాట్ లో కూడా మాట్లాడే ధైర్యం చేయడం లేదు.మా ముఖ్యమంత్రి సెక్రటేరియట్ కు రావడం లేదని కెటిఆర్ అంటున్నాడుకానీ కెటిఆర్ చిట్ చాట్ చేసే టైం కి మా సిఎం రేవంత్ రెడ్డి తెలంగాణ నూతన విద్యా విధానంపైన సెక్రటేరియట్ లో సమావేశం నిర్వహిస్తున్నారని తెలిపారు. కెటిఆర్ కళ్ల కాకులు ఎత్తుకుపోను, మీది ఫాంహౌస్ పాలన మాది ప్రజా పాలన అని ఆయన అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి బెదిరింపుల వల్లనే మెట్రో నుంచి ఎల్ అండ్ టీ తప్పుకుంటుందని కెటి ఆర్ చెత్త వాగుడు వాగుతున్నాడని ఆయన ఆరోపించారు. హైదరాబాద్ మెట్రో నిర్వహించలేమని చాలా కాలం నుంచి ఎల్అండ్‌టీ కేంద్రానికి, రాష్ట్రానికి లేఖలు రాస్తోంది.. గతంలో బేగంబజారు నుంచి మెట్రో లైన్ వేయకుండా ఎల్ అండ్ టీ ని బెదిరించింది కెసిఆరే అని గుర్తుకు చేశారు. మా ముఖ్యమంత్రి హైదరా బాద్‌లో మెట్రోను నాలుగు వైపులకు విస్తరి స్తున్నారని తెలిపారు. ఎల్అండ్‌టీ ని ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. తన నీచ రాజకీ యాల కోసం హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీయడమే కెటిఆర్ లక్ష్యంగా మారిందన్నారు.

## తగ్గనున్న పాల ఉత్పత్తుల ధరలు: మదర్ డెయిరీ

**హైదరాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త :** పాలు, ఇతర ఆహార ఉత్పత్తుల కొత్త ధరలను మదర్ డెయిరీ ప్రకటించింది. జీఎస్టీ సంసరణలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నది. ఈ కొత్త ధరలు ఈనెల 22నుంచి అమల్లోకి వస్తాయని వెల్లడించింది. ఈ మేరకు ఒక ప్రకటనలో వినియోగదారులు ఎకువగా కొనుగోలు చేసే పనీర్, వెన్న, చీజ్, నెయ్యి, మిల్‌షేక్‌లు, ఐస్‌క్రీమ్స్ ధరలు తగ్గాయని వివరించింది. సాధారణ పాల ప్యాకెట్ ధరల్లో ఎలాంటి మార్పు ఉండదని పేర్కొన్నది. తమ ఉత్పత్తులు జీఎస్‌టీ తీసుకొచ్చిన సంస్కరణల్లో భాగంగా జీరో ట్యాక్స్ లేదా 5శాతం పన్ను పరిధిలోకి వస్తుందని చెప్పింది. దీంతో వినియోగదారులు ఎక్కువగా కొనుగోలు చేసే పనీర్, వెన్న, చీజ్, గీ, మిల్క్‌షేక్‌లు, ఐస్‌క్రీమ్స్ ధరలు తగ్గాయని మదర్ డెయిరీ తెలిపింది. 500 గ్రాములు వెన్న ప్యాకెట్ ధర రూ.305గా ఉండేది. ఇప్పుడు రూ.285కు చేరింది. అలాగే బటర్ స్కాచ్ కోన్ ఐస్‌క్రీమ్ ధర రూ.35 నుంచి రూ.30కి తగ్గింది. ఇక రోజువారీ పాలప్యాకెట్ల ధర కూడా తగ్గింది. ఒక లీటర్ టోన్డ్ టెట్రా ప్యాక్ ధర రూ.77గా ఉండేది. ప్రస్తుతం రూ.75కు చేరింది. అయితే, సాధారణ పాలీ ప్యాక్ మిల్క్ ధరల్లో మార్పు ఉండదని మదర్ డెయిరీ తెలిపింది. ఫుల్ క్రీమ్, టోన్డ్, ఆవుపాలు వంటి అన్ని పాలీ ప్యాక్ పాలు ఎప్పటినుంచో జీఎస్‌టీ మినహాయింపులో ఉన్నాయని, వాటి ధరలపై ఎటువంటి ప్రభావం లేదని కంపెనీ విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

## పోలీసు శాఖలో ఖాళీల భర్తీపై హైకోర్టులో పిటిషన్

**హైదరాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** తెలంగాణ పోలీసు శాఖలో మంజూరైన పోస్టులను సర్కారు భర్తీ చేయడం లేదని హైకోర్టులో బుధవారం పిటిషన్ దాఖలయ్యింది. గత మూడేళ్లుగా పోలీసు శాఖలో ఎలాంటి భర్తీలు జరగలేదని, పోలీసు శాఖలో ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేయాలని సుప్రీం కోర్టు ఆదేశించినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పిటిషనర్ తెలిపారు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన హైకోర్టు దీనిపై ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. దీనిపై విచారణను హైకోర్టు రెండు వారాలు వాయిదా వేసింది.

## అసెంబ్లీ ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరించిన స్పీకర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 17:** తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా బుధవారం శాసనసభ ఆవరణలో జాతీయ జెండాను రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ఆవిష్కరించారు. ముందుగా రాజ్యాంగ నిర్మాత డా. బిఆర్ అంబేద్కర్, జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహాలకు సభాపతి ప్రసాద్ కుమార్ పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, లెజిస్లేటివ్ సెక్రటరీ డా. వి నరసింహాచార్యులు, శాసనసభ అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకు ముందు



తెలంగాణ శాసనమండలి ప్రాంగణంలో జాతీయ పతాకాన్ని మండలి చైర్మన్ గుత్తా సుఖేం దర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు బోగ రపు దయానంద్, తక్కెళ్ల పల్లి రవీందర్‌రావు, శ్రీపాల్‌రెడ్డి, లెజిస్టేటివ్ సెక్రటరీ డా.వి. నరసింహాచార్యులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డిజిపి కార్యాలయంలో ప్రజాపాలన దినోత్సవం

**హైదరాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** సెప్టెంబర్ 17వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ విలీన దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర వ్యహించిన ప్రజా పాలన దినోత్సవాన్ని బుధవారం నాడు డిజిపి కార్యాలయంలో పోలీసు శాఖ ఘనంగా నిర్వహించింది.
ఈ సందర్భంగా రైల్వేస్, రో డ్ సేఫ్టీ ఐజి రమేష్ నాయుడు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కో..ఆర్డినేషన్ ఐజి ఎం. శ్రీనివాసులు, లీగల్ ఎస్‌పి సతీష్, శాంతి భద్రతల ఏఐజి రమణ కుమార్, డిజిపి కార్యాలయ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ యోగేశ్వరరావు, డిఎస్‌పి ఉదయ భాస్కర్ తదితరులు, డిజిపి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మోడీ జన్మదిన వేడుకలు

**హైదరాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** ప్రధాని నరేంద్ర మోడీ 75వ జన్మదినం సందర్భంగా బిజెపి తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్‌రావు ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. సేవా పక్వాడలో భాగంగా పార్టీ ఆఫీసులో రక్తదానం శిబిరాన్ని ప్రారంభించారు. ప్రధాని మోడీ ఆయు రారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకుంటూ, దేశసేవలో నిరంతరం ముందుకు సాగాలని హృదయపూర్వకంగా ఆకాంక్షించారు. వికసిత భారత్ నిర్మాణంలో ప్రధానమంత్రి మోడీ నాయకత్వం మార్గదర్శకంగా నిలు స్తుందని అన్నారు.

# మోడీ నేతృత్వంలో అవినీతిరహిత, సుపరిపాలన



### బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవాలు

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**హైదరాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి, రాష్ట్ర సంఘటన మంత్రి చంద్రశేఖర్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గౌతమ్ రావు, వీరేందర్ గౌడ్, వేముల అశోక్, బిజెపి తమిళనాడు, కర్ణాటక ఇంచార్జ్ సుధాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజి రెడ్డి, వివిధ మోర్చాల అధ్యక్షులు, ఇతర సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు మాట్లాడుతూ దేశంలో ప్రతి సంవత్సరం మనం 15 ఆగస్టు స్వాతంత్ర దినోత్సవంగా జరుపుకుంటాం. కానీ మనకు స్వా తంత్రం వచ్చినప్పుడు, నాడు హైదరాబాద్ సంస్థానంలో 1948 సెప్టెంబర్ 17 వరకు స్వాతంత్రం రాలేదన్నారు. ఆ రోజు ఆపరేషన్ పోలో ద్వారా నియంత నిజాంకు వ్యతిరేకంగా భారత ప్రభుత్వంలో హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ నేతృత్వంలో చరిత్రాత్మక పోలీస్ యాక్షన్ ద్వారా తెలంగాణను భారతదేశంలో అంతర్భాగంగా చేసుకోవడం జరిగిందని, ఈ విజయం వెనుక అనేక మంది త్యాగాలు ఉన్నాయన్నారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసి, కాసిం రజ్వీ ఏర్పాటు చేసిన రజాకార్ల సైన్యం హైదరాబాద్ సంస్థానంలో అనేకమంది అమాయకులను వేధించారు, మహిళలపై అత్యాచారాలకు ఒడిగట్టారన్నారు. అనేకమంది ప్రాణాలు బలితీసుకున్నారు. బైరాన్ పల్లి, పరకాల, గుండ్రాంపల్లి, నిర్మల్ వంటి అనేక ప్రదేశాల్లో రజాకార్లు మహిళలపై వేధింపులు జరిగాయి. దాడులు చేశారు. రజాకార్లపై ఈ ప్రాంతాల్లో అనేకమంది పోరాటం చేశారు.ఈ చరిత్ర మనందరికీ గుర్తుగా నిలిచిపోవాలని, అప్పుడు జరిగిన సంఘటనలు మనం ఎప్పటికీ మరచిపోకూడదని అన్నారు.
మనం గుర్తించు కోవాల్సింది ఏమిటంటే నియంత నిజాం వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు చేసిన పోరాటం, హైదరాబాద్ స్టేట్ అప్పట్లో మన ప్రజలు నిరంకుశ నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడి, స్మరించుకోదగిన త్యాగాలు చేశారని అన్నారు. గత 25 సంవత్సరాలుగా మన భారతీయ జనతా పార్టీ ఆ పోరాటయోధులను స్మరించుకునేలా, తెలంగాణ లిబరేషన్ డే ని అధికారికంగా జరుపు కోవాలని నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. ప్రతి ఏడాది 17 సెప్టెంబర్ రోజును తెలంగాణ ప్రజల హృదయాలను కదిలించే, గౌరవింపదగిన దినంగా గుర్తించాలని, సర్దార్ వల్లభాయి పటేల్ ఆపరేషన్ పోలో ద్వారా పోలీస్ యాక్షన్ సిన కీలక పాత్ర లేకపోతే, ఈ ప్రాంతం పాకిస్తాన్ లేదా మరో స్వతంత్ర దేశంగా ఉండే పరిస్థితి ఏర్పడేదని అన్నారు. పోరాటయోధుల త్యాగాన్ని మర్చిపోకుండా, రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా జరుపుకోవాలన్నారు. కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత , కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రేరణతో హోంశాఖ మంత్రి అమిత్ షా ఈ వేడుకలను అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించారని, మన భారత సైనిక, కేంద్ర బలగాలు సైతం ఈ సెప్టెంబరు 17 తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలను గత మూడు సంవత్సరాలుగా నిర్వహించుకోవడం జరుగు తుందన్నారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో, అవినీతి రహిత, సుపరిపాలనతో భారత్ దేశం వికసిత్ భారత్ గా ఎదుగుతుందని, ఈ రోజు విశ్వకర్మ దినోత్సవం కావడంతో, దేశ నిర్మాణం కోసం కృషి చేస్తున్న శ్రామికుల సేవలను గుర్తు చేసుకుంటూ, విశ్వకర్మ మహర్షిని స్మరించుకోవాలన్నారు. ఇన్ని కార్యక్రమాల మధ్య కూడా తెలంగాణ విమోచన దినోత్సవాన్ని విజయవంతంగా జరుపుకునేందుకు పార్టీ కార్యకర్తలు, నాయకులు ముందుకొచ్చి భాగస్వామ్యం కావడం అభినందనీయమన్నారు.

## 14 లక్షల మంది విద్యార్థులకు 8 వేల కోట్ల బకాయిలు చెల్లించాలి

### దసరా తర్వాత వినూత్న పద్ధతిలో ఉద్యమం: ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (సైఫాబాద్), సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** కళాశాలల బంద్ విరమణ సందర్భంగా ప్రభుత్వం చర్చలు జరిపి కేవలం 600 కోట్లు బడ్జెట్ విడుదల చేస్తామనడం సరి కాదని, 8 వేల కోట్లు బకాయిలు ఉంటే, 600 కోట్లు ఏ మూలకు సరిపోతాయని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ప్రశ్నించారు. ప్రభుత్వం ఒక్కొక్క కాంట్రాక్టర్‌కు 6, 7 కోట్లు ఏక కాలంలో చెల్లిస్తూ, చదువుకునే 14 లక్షల మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజుల రీయింబర్స్‌మెంట్ బకాయిలు 8 వేల కోట్లు ఇవ్వడానికి అవరోధం ఏమిటని ఆయన నిలదీశారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిరుద్యోగ జెఎసి ఛైర్మన్ నీల వెంకటేష్, బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పగిళ్ల సతీష్ అధ్యక్షత జరిగిన మీడియా సమావేశంలో ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. అనేక ఇతర పథకాలకు ఉదారంగా బడ్జెట్ కేటాయిస్తూ రాష్ట్ర భవిష్యత్తును తీర్చిదిద్దే ఈ పథకాలకు బడ్జెట్ కేటాయించకపోవడం దుర్మార్గమైన చర్యని విమర్శించారు. ఫీజుల బడ్జెట్ చెల్లించకపోతే రాష్ట్రంలో యుద్ధమే కొనసాగుతుందని, దసరా తరువాత విన్నూత పద్ధతిలో ఆందోళనలు కొనసాగిస్తామని, బడ్జెట్ విడుదల చేసేంతవరకు ఉద్యమాలు ప్రతిరోజు కొనసాగుతాయని ఆర్.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య. చిత్రంలో నీల వెంకటేశ్, పగిళ్ళ సతీష్ తదితరులు

కృష్ణయ్య హెచ్చరించారు. 22 నెలల క్రితం అధికారంలోకి వచ్చన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు 20 రూపాయలు కూడా విడుదల చేయలేదని, ఈ పథకం అమలుకు నాలుగు శాఖల ద్వారా బడ్జెట్‌లో 5 వేల కోట్లు కేటాయించి, ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని, కేంద్ర ప్రభుత్వం కూడా ఎస్సీ, ఎస్టీలకు ఈ పథకం కింద వేల కోట్లు కేటాయిస్తున్నదని, వీటిని ఎం చేస్తున్నారని ఆర్.కృష్ణయ్య ప్రశ్నించారు. ఈ సమావేశంలో బిసి నాయకులు మణికంఠ, రాందేవ్ మోదీ, రవియాదవ్, నిఖిల్ పటేల్, లీలా తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ స్థాయి నుంచి సంస్థాగతంగా కాంగ్రెస్ బలోపేతానికి కృషి

### ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** గ్రామీణ స్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడానికి టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్ కార్యకర్తలకు ప్రభుత్వాన్ని అనుసంధానం చేయాడానికి వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, టిపిసిసి ఉపాధ్యక్షురాలు ఝాన్సిరెడ్డి అన్నారు. బుధవారం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ టిపిసిసి చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించి తొలిసంవత్సరం కావడంతో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టిపిసిసి ఉపాధ్యక్షురాలు ఝాన్సి రెడ్డి స్వగృహానికి అహ్వానించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ"మహేష్ కుమార్ గౌడ్ ఒక సంవత్సర కాలంలో పార్టీని బలపర్చడంలో కార్యకర్తలను ఉత్తేజపరచడంలో విశేష పాత్ర పోషించారు. గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కాంగ్రెస్‌ను మరింత చైతన్య వంతం చేసే దిశగా ఆయన కృషి అభినందనీయమైనదన్నారు.

## రేపు పశువైద్య విశ్వవిద్యాలయం ఐదో స్నాతకోత్సవం

### రైతులకు సేవ చేయడంలో వర్సిటీ ముందంజ

### వర్సిటీ ఉపకులపతి జ్ఞానప్రకాష్

**హైదరాబాద్ (అత్తాపూర్) సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** విద్యార్థులకు విద్యతో పాటు రైతులకు సేవ చేయడంలో పివి నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం ముందుందని విశ్వవిద్యాలయం 5వ స్నాతకోత్సవ ఈ నెల 19న నిర్వహించనున్నట్లు ఉపకులపతి జ్ఞాన ప్రకాష్ పేర్కొన్నారు. బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకులపతి జ్ఞానప్రకాష్ మాట్లాడుతూ.. ఈనెల 19న పశువైద్య విశ్వవిద్యాలయం 5వ స్నాతకోత్సవాన్ని ఉదయం 10 గంటలకు ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర విశ్వ విద్యాలయం ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ స్నాత కోత్సవానికి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ హాజరు కానున్నారని, అతిథులుగా జాతీయ డెయిరీ అభివృద్ధి బోర్డు ఆనంద్ గుజరాత్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మీనేష్ షా హాజరై ప్రసంగిస్తారని పేర్కొన్నారు. అదేవిధంగా బోర్డు ఆఫ్ మేనేజ్‌మెంట్ సభ్యులు, అకాడమిక్ కౌన్సిల్ సభ్యులు, పూర్వ ఉపకుల పతులు, పశువైద్య విభాగంలో నిష్ణాతులు పాల్గొననున్నారని ఆయన అన్నారు. ఈ స్నాతకోత్సవంలో 2023 జనవరి 1 నుండి 2024 డిసెంబరు 31 వరకు పట్టభద్రులైన మొత్తం 524 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేయబడతాయి. వీరిలో 16 మంది పిహెచ్.డి. పట్టభద్రులు, 69 మంది మాస్టర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ (ఎస్‌బిఎస్‌సీ) పట్టభద్రులు, 345 మంది బాచిలర్ ఆఫ్ వెటర్నర్ సైన్ అండ్ యానిమల్ హస్బెండరీ (బివిఎస్‌సి, ఎహెచ్) పట్టభద్రులు, 54 మంది బిటెక్ (డెయిరీ టెక్నాలజీ, పట్టభద్రులు, 40 మంది బాచిలర్ ఆఫ్ ఫిషరీ సైన్స్ పట్టభద్రులు, వివిధ విభాగాలలో విశిష్ట ప్రతి కనబరిచిన ప్రతిభావంతులైన విద్యార్థులకు 25 బంగారు పతకాలను ప్రధానం చేయనున్నామని ఉత్తమ అధ్యాకులకు రెండు అవార్డులు అంద జేయనున్నట్లు తెలిపారు. పివి నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం రైతులకు క్షేత్రస్థాయిలో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నమని




సమావేశంలో మాట్లాడుతున్న ఉపకులపతి జ్ఞాన ప్రకాష్ ,రిజిస్ట్రార్ శరత్ చంద్ర, ఉదయకుమార్ తదితరులు

రైతులకు అత్యాధునిక టెక్నాలజీతో కూడిన సేవలను అందజేస్తున్నామని పేర్కొన్నారు.

## ఆర్టీసీలో డ్రైవర్లు, శ్రామిక్ 1,743 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

**హైదరాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** ఆర్టీసీలో డ్రైవర్లు, శ్రామిక్ పోస్టుల భర్తీకి తెలంగాణ పోలీసు నియామక మండలి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆర్టీసీలో 1000 డ్రైవర్, 743 శ్రామిక్ పోస్టులు భర్తీ చేయనున్నట్టు నోటిఫికేషన్లో పేర్కొన్నారు. అక్టోబరు 8 నుంచి 28 వరకు దరఖాస్తు గడువు తేదీగా నిర్ణయించారు. డ్రైవర్ పోస్టులకు 22 నుంచి 35 ఏళ్లు. శ్రామిక్ పోస్టులకు 18 నుంచి 30ఏళ్ల వయసు వారు అర్హులని తెలిపింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, కేటగిరి వారికి 5 ఏళ్లు, ఎక్స్ సర్వీస్ మెన్ అయితే 3ఏళ్లు వయో పరిమితి సడలింపు ఉంటుందని బోర్డు తెలిపింది. స్కిల్ టెస్ట్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపిక చేయనున్నట్లు పేర్కొంది. పూర్తి వివరాల కోసం డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. టిజిపిఆర్‌బి.ఐఎన్‌లో చూడాలని పోలీసు నియామక మండలి తెలిపింది.

MN 12 GNT_18-09pg10exH.qxd 9/18/2025 12:13 AM Page 1



# వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్.. ఫైనల్స్‌కు నీరజ్, సచిన్




**న్యూఢిల్లీ:** ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2025, జావెలిన్ ఫైనల్‌కు నీరజ్, సచిన్ అర్హత సాధించగా, అనిమేష్ కుజుర్, రోహిత్, యష్ వీర్ ఓటమితో టోర్నీ నుండి నిష్క్రమించారు. ప్రవీణ్ చిత్రవెల్, అబ్దుల్లా అబూబకర్ కూడా ట్రిపుల్ జంప్ ఫైనల్‌కు చేరుకోలేకపోయారు. గ్రూప్ ఎలో అర్హత రౌండ్‌ను ప్రారంభించిన చోప్రా, ప్రత్యక్ష అర్హత మార్కు 84.5 మీటర్లు కాగా, కేవలం ఒకే ఒక్క త్రోతో 84.85 మీటర్ల దూరం నమోదు చేసి ఫైనల్‌కు చేరాడు. 2025 ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో చోప్రా కేవలం ఒక త్రోతో ఫైనల్‌కు అర్హత సాధించిన ఐదవ వరుస ప్రపంచ ఈవెంట్‌గా నిలిచాయి. ఇక పోటీలో ఉన్న ఇతర భారతీయ జావెలిన్ త్రోయర్లలో, ఫైనల్‌కు చేరుకున్న ఏకైక వ్యక్తి సచిన్ యాదవ్. అర్హత రౌండ్‌లో సచిన్ వరుసగా 80.16 మీ, 83.67 మీ, మరియు 82.63 మీ.తో మూడు త్రోలు వేశాడు. ఆటోమేటిక్ క్వాలిఫికేషన్ మార్కుకు తక్కువ అయినప్పటికీ, అతని ఉత్తమ ప్రయత్నం 83.67 మీటర్లు, టాప్ 12లో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించడానికి సరిపోయింది. అతను గ్రూప్ ఎ లో ఆరవ స్థానంలో మరియు మొత్తం మీద పదవ స్థానంలో నిలిచాడు. రోహిత్ యాదవ్ 77.81 మీటర్లతో మొత్తం మీద 28వ స్థానంలో, యశ్వీర్ సింగ్ 77.51 మీటర్లతో 30వ స్థానంలో నిలిచాడు





# వరల్డ్ రెజ్లింగ్‌లో వైష్ణవి, ప్రియాపైనే ఆశలు

**న్యూఢిల్లీ:** ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్-2025లో మహిళల జట్టు భారత పతక ఆశలను సజీవంగా ఉంచుతుండగా, పురుషుల ఫ్రీస్టైల్ సుజీత్, విక్కీ తదితర రెజ్లర్లు తమ రిపీచేజ్ బౌట్‌లలో ఓడిపోయి ఖాళీ చేతులతో తిరిగి వచ్చారు. 65 కిలోల మహిళల విభాగంలో వైష్ణవి లాట్వియాకు చెందిన ఎల్మా జైడ్లెరేపై 3-1 తేడాతో విజయంతో తన ప్రచారాన్ని ప్రారంభించింది. ఆ తర్వాత ఆమె క్వార్టర్ ఫైనల్స్‌లో మంగోలియాకు చెందిన ప్రపంచ ఐదవ ర్యాంకర్ ఎంఖ్జిన్ తువ్షింజార్గల్ చేతిలో 2-4 తేడాతో ఓడిపోయింది. తువ్షింజార్గల్ ఫైనల్‌కు చేరుకుంటేనే పాటిల్‌కు రెపిచేజ్‌లోకి ప్రవేశించే అవకాశం ఉండటంతో ఆమె పతకం ఆశలు సజీవంగా ఉంటాయి. ఇక 76 కిలోల విభాగంలో, ప్రియా మాలిక్ 1/8 రౌండ్‌లో ఈక్వెడార్‌కు చెందిన జెనెసిస్ రియాస్కో వాల్డెజ్ చేతిలో 2-4 తేడాతో ఓడిపోయింది. వాల్డెజ్ ఫైనల్‌కు చేరుకుంటేనే మాలిక్‌కు రెపెచేజ్‌లో పోటీ పడే అవకాశం లభిస్తుంది. మహిళల జట్టులోని ఇతర సభ్యులు ముందుగానే నిష్క్రమించారు. కాగా భారత పురుషుల ఫ్రీస్టైల్ రెజ్లర్లు తమకు లభించిన రిపీచేజ్ అవకాశాలను సద్వినియోగం చేసుకోలేకపోయారు. 65 కిలోల విభాగంలో సుజీత్ కల్కల్ 5-7 తేడాతో అమెరికన్ రియల్ మార్షల్ రే వుడ్స్ చేతిలో ఓడిపోయాడు. 97 కిలోల విభాగంలో విక్కీ, బల్గేరియాకు చెందిన అఖ్మద్ మగమాయేవ్ చేతిలో పతనంలో నిష్క్రమించాడు. ఈ ఓటములతో, భారత పురుషుల ఫ్రీస్టైల్ జట్టు ఎటువంటి పతకాలు లేకుండా ఛాంపియన్‌షిప్‌ను ముగించింది.

## ఆసియా టెన్నిస్ ఛాంపియన్‌షిప్.. మీనాకు కాంస్యం



**న్యూఢిల్లీ:** ఆసియా సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లలో పతకం గెలుచుకున్న తొలి భారతీయుడిగా జే మీనా నిలిచాడు. గత సంవత్సరం, మీనా ఆద్య తివారీతో కలిసి ప్రపంచ సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో భారత దేశానికి తొలి పతకాన్ని గెలుచుకున్నాడు. బుధ వారం జరిగిన ఆసియా సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్ షిప్‌లో పతకం గెలుచుకున్న దేశం నుండి తొలి అథ్లెట్‌గా నిలిచి భారత క్రీడా చరిత్రలో తన పేరును లిఖించుకున్నాడు. జే చైనాకుచెందిన లి రన్ చెంగ్‌ను 4-1 తేడాతో ఓడించి సెమీఫైనల్స్‌కు చేరుకుని చారిత్రాత్మక పతకాన్ని ఖాయం చేసుకున్నాడు. ఆ తర్వాత జరిగిన సెమీఫైనల్లో చైనీస్ తైపీకి చెందిన చెన్ పో యి చేతిలో 1-4 తేడాతో ఓడిపోయి కాంస్య పతకంతో సరిపెట్టుకున్నాడు.

# 416 రన్స్‌తో వెనుకబడిన భారత్

## తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 532 రన్స్




**న్యూఢిల్లీ:** జోష్ ఫిలిప్ అద్భుతమైన సెంచరీతో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 532 పరుగులు చేసింది. భారతదేశం కేవలం ఒక వికెట్ కోల్పోయి 416 పరుగులు వెనుకబడి ఉంది. ఇండియా, ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న తొలి అనధికారిక టెస్ట్ రెండో రోజు బుధవారం ఆట ముగిసింది. ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 532 పరుగులు చేసి, 6 వికెట్లు మాత్రమే కోల్పోయి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. ఇక భారత్ ఒక వికెట్ నష్టానికి 116 పరుగులు చేసింది. భారత్ తరపున అభిమన్యు ఈశ్వరన్ 44 పరుగులు చేసినా చివరికి లియామ్ స్కాట్ చేతిలో ఔటయ్యాడు. ప్రస్తుతం, ఎన్. జగదీశన్ మరియు సాయి సుదర్శన్ ఇద్దరూ వరుసగా 50 మరియు 20 పరుగులతో క్రీజులో ఉన్నారు. అయితే, టీం ఇండియా ఇంకా 416 పరుగులు వెనుకబడి ఉంది. రెండో రోజు ఆస్ట్రేలియా 5 వికెట్లు కోల్పోయి 337 పరుగులతో ఆలౌటైంది. వారు 25 ఓవర్లలో మరో 195 పరుగులు చేశారు. జోష్ ఫిలిప్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడి సెంచరీ సాధించాడు. జగదీసన్ 55 బంతుల్లో తన 50 పరుగులు చేశాడు. హర్ష్ దుబే వేసిన ఒక ఓవర్‌లో 19 పరుగులు చేశాడు. మరో ఎండ్‌లో బార్ట్‌లెట్ అతనికి మద్దతు ఇచ్చాడు. ఆల్ రౌండర్ 24 బంతుల్లో 39 పరుగులు చేశాడు. ఆ ఆల్ రౌండర్ 62 బంతుల్లో ఆరో వికెట్‌కు 118 పరుగుల భాగస్వామ్యాన్ని పంచుకున్నారు. భారతదేశం తరపున ఏకైక పురోగతి హర్ బ్రార్ నుండి వచ్చింది. అతను 81 పరుగుల వద్ద ఉన్న స్కాట్‌ను అవుట్ చేశాడు. భారత జట్టుకు ఈశ్వరన్, జగదీసన్ మంచి ఆరంభాన్ని అందించారు. వారు 88 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యాన్ని పంచుకున్నారు.

## చైనా మాస్టర్స్ 16వ రౌండ్‌లో

# సాత్విక్, చిరాగ్ జోడీ

## లక్ష్యసేన్, కపిల, తనీషా ఓటమి




**న్యూఢిల్లీ:** చైనా మాస్టర్స్ 2025లో భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదుర య్యాయి. సాత్విక్ చిరాగ్ జోడీ 16వ రౌండ్‌లోకి ప్రవేశించగా, లక్ష య్సేన్ నిష్క్రమించాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిలతనీషా క్రాస్టో జోడీ కూడా చైనా చేతిలో ఓడిపోయింది. బుధవారం జరిగిన బిడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్ 750 ఈవెంట్ అయిన చైనా మాస్టర్స్‌లో రాంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్-శెట్టి చిరాగ్ వరుస గేమ్‌ల విజయంతో రౌండ్ ఆఫ్ 16లో తమ స్థానాన్ని బుక్ చేసుకున్నారు. రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్‌షిప్ కాంస్య పతక విజేతలు సాత్విక్, చిరాగ్ 42 నిమిషాల్లో మలేషియా ద్వయం జునైది ఆరిఫ్-రాయ్ కింగ్ యాప్‌ను 24-22, 21-13 తేడాతో ఓడించారు. గత వారం జరిగిన హాంకాంగ్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్స్‌లో కూడా ఈ రెండు జంటలు తలపడ్డాయి, అక్కడ భారతీయులు మూడు ఆటల్లో గెలిచారు. పురుషుల సింగిల్స్‌లో, హాంకాంగ్ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచిన లక్ష య్ సేన్, మొదటి రౌండ్‌లో అరగంటలో ఫ్రెంచ్‌కు చెందిన టోమా జూనియర్ పోపోవ్ చేతిలో 21-11, 21-10 తేడాతో ఓడిపోయాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల, తనీషా క్రాస్టో జోడీ కూడా 21-19, 21-13 తేడాతో చైనాకు చెందిన ఫెంగ్ యాన్ జెహువాంగ్ డాంగ్ పింగ్ చేతిలో ఓడిపోయింది.

# శాఫ్ ఛాంపియన్‌షిప్‌లో.. భారత్ తొలి విక్టరీ




**న్యూఢిల్లీ:** శాఫ్ అండర్ 17 ఛాంపియన్‌షిప్ 2025 ఫుట్‌బాల్ టోర్నీ ఓపెనర్‌లో భారత్ జట్టు తొలి మ్యాచ్‌లో 6-0 తేడాతో మాల్దీవులను ఓడించింది. శ్రీలంకలోని కొలంబోలో రేస్‌కోర్స్ ఇంటర్నేషనల్ స్టేడియంలో బుధవారం జరిగిన తమ తొలి గ్రూప్ బి మ్యాచ్‌లో భారత జట్టు మాల్దీవులను ఓడించి ఛాంపియన్‌షిప్ 2025 టైటిల్ పోరును ప్రారంభించింది. బ్లూ కోల్ట్స్ మొదటి నుంచే అద్భుత ప్రదర్శన చేశారు. దల్లాల్ముల్మువాన్ గాంగ్టే రెండుసార్లు కొట్టాడు. హృషికేశ్ చరణ్ మనవతి, కమ్‌గౌహావో డౌంగెల్, వాంగ్‌ఖైరక్‌పమ్ గున్‌లీబా, అజీమ్ పర్వీజ్ నాజర్ పిచ్ రెండు చివర్లలో పూర్తి ప్రదర్శనతో స్కోర్‌షీట్‌లో చేరారు. దీంతో బిబియానో ఫెర్నాండెజ్ జట్టు అధిక వత్తిడికి గురయ్యారు. ముఖ్యంగా వాంగ్‌ఖైరక్‌పమ్ గున్లీబా ఎడమ వింగ్‌లో చివరి మూడవ భాగం 12వ నిమిషంలో భారత్ ఆధిక్యంలోకి వెళ్లింది. వాంగ్‌ఖైరక్‌పమ్ తన మార్కర్‌ను దాటి దూసుకెళ్లి బంతిని ముందుకు నడిపించాడు. 29వ నిమిషంలో భారత్ తమ ఆధిక్యాన్ని రెట్టింపు చేసుకుంది. బ్లూ కోల్ట్స్ జట్టు రెండో అర్ధభాగం 49వ నిమిషంలో మరింత పెంచుకుంది. ఆ తర్వాత 58వ నిమిషంలో వాంగ్‌ఖైరక్‌పమ్ అద్భుతమైన ప్రదర్శనతో గోల్‌ను నమోదు చేశాడు. 68వ నిమిషంలో, వేధింపులకు గురైన అవ్సామ్ అబ్దుల్లా రహాన్ అహ్మద్‌ను బాక్స్‌లోనే పడగొట్టాడు. గాంగ్టే తన రెండవ గోల్ సాధించి మ్యాచ్‌ను 5-0తో ముగించాడు. అజ్లాన్ షా కుడివైపు నుండి టీజింగ్ క్రాస్ కొట్టాడు. దానిని ఆజిమ్ పర్వీజ్ నజార్ ఎదుర్కొన్నాడు. దీంతో 86వ నిమిషంలో భారత్ మరో గోల్ చేసి 6-0తో విక్టరీ సాధించింది.

వాణిజ్యం

# ఇండిగో డైరెక్టర్ల బోర్డులోకి నీతిఆయోగ్ మాజీ సిఇఒ




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 17:** చౌకధరల విమానయానసంస్థ ఇండిగో మాజీ నీతి ఆయోగ్ సిఇఒ, జి20 షెర్పా అమితాబ్‌కాంత్‌ను తమ బోర్డులో అదనపు డైరెక్టర్‌గా నియమించుకుంది. నాన్‌ఎగ్జిక్యూటివ్; నాన్ ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా ఆయన సంస్థలో కొనసాగుతారని ఇండిగో తెలిపింది. ఇందుకు సంబంధించి పౌరవిమానయానశాఖ కూడా ఆమోదం తెలిపింది. అంతకుముందే ఎయిర్‌లైన్స్ జులై 3న కాంత్‌నియామకాన్ని ప్రకటించింది. ఇండిగో మాతృసంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ ఒక ప్రకటన విడుదలచేస్తూ తాము విమానయాన మంత్రిత్వశాఖనుంచి ఇతర సంస్థలనుంచి ఆమోదం పొందామని తదనుగుణంగానే కాంత్ నియామకం ఈనెల 15నుంచి అమలులోకి వచ్చిందని తెలిపింది. అలాగే హెచ్‌సిఎల్ టెక్ కూడా అమితాబ్‌కాంత్‌ను తన డైరెక్టర్లబోర్డులో నియమించుకుంది. నాన్ ఎగ్జిక్యూటివ,ఇ oడిపెండెంట్ డైరెక్టర్‌గా ఐదేళ్లకాంపాటు కొనసాగుతారని హెచ్‌సిఎల్‌టెక్‌ప్రకటించింది. కాంత్ నియామకంపై సెబీ కూడా సానుకూలంగానే స్పందించింది. 69 ఏళ్ల అమితాబ్‌కాంత్ జి20 షెర్పాగా ఈ ఏడాది జూన్‌నెలలోనే వైదొలిగారు లింక్డ్‌ఇన్‌లో 45 ఏళ్ల ప్రభుత్వ సర్వీసుల్లో కొనసాగినతర్వాత కొత్త అవకాశాలు, కొత్త అధ్యాయం ప్రారంభించబోతున్నట్లు ఆయన తెలిపారు. 2023లో జి20ని భారత్ నిర్వహించడంలో కాంత్ కీలకపాత్రపోషించారు. అంతకుముందు నీతి ఆయోగ్ సిఇఒగా కూడా పనిచేసి స్ఫూర్తిదాయక జిల్లాల పథకం అటల్ ఇన్నొవేషన్ మిషన్, డిజిటల్ ఇన్‌ఫ్రా, గ్రీన్‌హైడ్రోజెన్ వంటి కీలక కార్యాచరణలను అమలులోకి తెచ్చారు. అంతకుముందు కేంద్ర పారిశ్రామికవిధానాలు, ప్రోత్సాహకాల వ్యవస్థ డిప్‌ను పర్యవేక్షించారు. కాంత్‌చేపట్టిన కార్యాచరణ వల్లనే భారత్‌ప్రపంచ బ్యాంకు ర్యాంకింగ్స్‌లో 79 స్థానాలు ఎగబాకింది.

# డాలర్ వర్సెస్ రూపాయి 87.84

**ముంబయి, సెప్టెంబరు 17:** డాలరుతోరూపాయి మారకం విలువల్లో రూపాయి కొంతమేర పటిష్టం అయింది. 25 పైసలు పెరిగి 87.84 వద్ద నడిచింది. బుధవారం ఇంటర్ బ్యాంకు ఫారిన్ కరెన్సీ మార్కెట్లలో డాలరుతో రూపాయి మారకం విలువలు 87.84గా నడిచాయని తేలింది. దీనితో దేశీయ ఈక్విటీ మార్కెట్లకు అండ లభించింది. విదేశీ ట్రేడర్లు చెలామణీలో వరుసగా నాలుగో రోజు కూడా రూపాయి పటిష్టం కావడం కనిపించింది. అమెరికా ఫెడ్‌రిజర్వు ఫండ్‌రేట్లను కుదిస్తే నగదు మార్కెట్లలోని పెట్టుబడులన్నీ కూడా ఈక్విటీ, బంగారం మార్కెట్లవైపు వెళతాయన్నది తెలిసిందే. వడ్డీరేట్లు తగ్గింపును జీర్ణించుకోరు అందువల్లనే ఈ పెట్టుబడులు దేశీయ ఈక్విటీల్లోకి వస్తాయి. ఫలితంగా రూపాయి మారకం విలువలు గణనీయంగా పెరుగుతాయి. ఫెడ్‌రిజర్వు 25 బేసిస్ పాయింట్లు రేట్ కుదిస్తుందని అంచనాలతో ఉన్నారు. అందువల్లనే ఇన్వెస్టర్లు ఫెడ్‌రిజర్వు ఛైర్మన్ ప్రసంగంపైనే ఫోకస్ పెట్టారు. రూపాయి ప్రారంభంలో 87.84వద్ద కొనసాగి చివరకు 87.71వద్దకు చేరింది. మళ్లీ పెరిగి 87.86వద్దకు చేరింది. దేశీయంగా డాలరుతోరూపాయి చివరకు 87.84వద్దనే ముగిసింది. దీనితో 25 పైసలు ముందురోజుకంటే బలపడిందని ట్రేడర్లు తెలిపారు. ముందురోజు రూపాయి ఏడుపైసలు పెరిగి 88.09పైసలుగా ఉంది. ఇదిలా ఉంటే బ్రెంట్ ముడిచమురు 0.66శాతం దిగువన బ్యారెల్‌కు 68.02వద్ద ముగిసింది. దేశీయ ఈక్విటీ మార్కెట్లలో సెన్సెక్స్ 313.02 పాయింట్లుపెరిగి 82,693.71 పాయింట్లవద్దస్థిరపడితే నిఫ్టీ 91.15 పాయింట్లుపెరిగి 25,330.25 పాయింట్లవద్ద స్థిరపడింది. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు 308.82కోట్ల మేర ఈక్విటీల్లో కొనుగోళ్లుజరిపారు. దీనికితోడు భారత్ అమెరికాలమధ్య నడుస్తున్న వాణిజ్యసంప్రదింపులు సానుకూలదిశగా కొనసాగుతున్నట్లు బ్రెండన్ లించ్ వెల్లడించడం కూడా మార్కెట్లకు కలిసొచ్చింది.



# నిఫ్టీలో దుమ్ములేపిన పిఎస్‌యు బ్యాంక్ సూచీ

## లాభాల్లో ముగిసిన సెన్సెక్స్ నిఫ్టీ




**ముంబయి,సెప్టెంబరు 17:** దేశీయ స్టాక్ మార్కెట్‌సూచీలు బుధవారం కూడా లాభాల్లోనే ముగిసాయి. భారత్ అమెరికా వాణిజ్య సంప్రదింపుల్లో సానుకూలత, ఫెడ్‌రిజర్వు రేట్‌కట్ వంటి అంశాలు సెన్సెక్స్ నిఫ్టీలకు కలిసొచ్చాయి. నిఫ్టీ 25,300 స్థాయిలో ట్రేడింగ్ నిలిపివేసింది. ఎస్‌అండ్‌పి బిఎస్‌ఇ సెన్సెక్స్ 313.02 పాయింట్లు లాభపడి 82,693.71 పాయింట్లవద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సూచీ 91.15 పాయింట్లు లాభంతో 25,330.25 పాయింట్లవద్ద నిలిచిపోయింది. ఈ రెండు సెషన్లలోను సెన్సెక్స్ 1.11శాతం, నిఫ్టీ 1.04శాతం పెరిగాయి. ఎస్‌అండ్‌పి బిఎస్‌ఇ మిడ్‌క్యాప్‌సూచీ 19శాతంపెరిగితే బిఎస్‌ఇ స్మాల్‌క్యాప్‌సూచీ 0.51శాతంపెరిగింది. మార్కెట్లధోరణులు ఆసాంతం సాను కూలంగానే కొనసాగాయి. ఇక విభాగ సూచీల్లో నిఫ్టీ పిఎస్ యుబ్యాంకు సూచీ 2.61శాతం, నిఫ్టీ ఐటిసూచీ 0.65శాతం, నిఫ్టీ ఆయిల్ గ్యాస్‌సూచీ 0.63 శాతం పెరుగుదల నమోదుచేసాయి. ఇక నిఫ్టీ మెటల్‌సూచీ 0.59శాతం, మిడ్ స్మాల్ హెల్త్‌కేర్‌సూచీ 0.44శాతం, కన్సూమర్ డ్యూరబుల్స్ 0.30శాతం నిఫ్టీలో క్షీణించాయి. పదేళ్ల బెంచ్‌మార్క్ ఫెడ్ రిజర్వు బాండ్లు 0.28శాతం తగ్గి 6.472గా ముగిసాయి. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో భారత్‌రూపాయి 87.8450 వంతునట్రేడ్ అయిందని సమాచారం. ఎంసిఎక్స్‌లో గోల్డ్‌ఫ్యూచర్స్ అక్టోబరు 3వ తేదీనాటిధరలు 0.71శాతంపెరిగి 1,09,370 రూపాయలుగా కొనసాగింది. ఇక కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్‌ముడిచమురు మార్కెట్ 41సెంట్లు తగ్గి బ్యారెల్‌కు 68.06 డాలర్లుగా నడించింది. యూరోపియన్ మార్కెట్లు కూడా పెరిగాయి. యుకె ద్రవ్యోల్బణం గణాంకాలు ఆగస్టునెలకుగాను 3.8శాతంగా ఉన్నాయి. ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ఉన్నాయి. వాల్‌స్ట్రీట్ కొంతమేర ఫెడ్‌రిజర్వు రేట్ల కోతల అంచనాలతో దిగజారాయి. జపాన్ ఎగుమతులు కూడా 0.1శాతం తగ్గాయి. ఎస్‌అండ్‌పి 500 సూచీ 0.13శాతందిగువస్థాయిలోనే ముగి సింది. నాస్‌డాక్ కాంపోజిట్ 0.07శాతంగా క్షీణించింది. డౌజోన్స్ పారిశ్రా మిక సగటు 125.55 పాయింట్లు క్షీణించింది.

Urban Company

# ప్రీమియం ధరలకు అర్బన్ కంపెనీ షేర్లు!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 17:** యాప్ ఆధారిత బ్యూటీ, గృహసేవలసంస్థ అర్బన్ కంపెనీ బుధ వారం ప్రీమియం ధరలకు అమ్ముడుపోయింది. ఇష్యూధరకంటే 62శాతం అధికంగా కొనుగోళ్లు జరిగాయి. అంటే షేరుధర 103గా కొనసాగింది. కంపెనీస్టాక్స్ ట్రేడింగ్161వద్ద ప్రారంభం అయి 56.31శాతం పెరుగుదలను నమోదు చేసింది. ఐపిఒలో ఇష్యూధరకంటే అధికంగా వెళ్లియింది. ఒకదశలో 73.78శాతంపెరిగి 179 రూపాయలకు కూడా వెళ్లింది. కంపెనీచివరకు 167.05వద్ద ట్రేడింగ్‌ముగించింది. ఎన్‌ఎస్‌ఇలో కూడా కంపెనీ షేర్లు 57.52 ప్రీమియంకు 162.25కు వెళ్లాయి. నిఫ్టీలో అర్బన్ కంపెనీ షేర్లు 166.83వద్ద ముగిసాయి. 61.97 శాతం ప్రీమియంకు విక్రయించారు. కంపెనీమార్కెట్ విలువలు 23,986.74కోట్లుగా వెల్లడించింది. ఐపిఒ జారీచేసిన తర్వాత ఇప్పటివరకూ 149.88 లక్షల షేర్లు ట్రేడ్ అయ్యాయి. ఎన్‌ఎస్‌ఇలో అయితే 1960.31 లక్షల షేర్లు కొనుగోళ్లుజరిగాయి. కంపెనీ జారీచేసినైపిఒకు మంచి స్పందన లభించింది. మొత్తం 103.63 రెట్లు బిడ్డింగ్ జరిగింది. 1900 కోట్ల ఐపిఒకు ఇష్యూధర 98 నుంచి 103 రూపాయలుగా నిర్ణయించారు.

# ఎస్‌బ్యాంకులో ఎస్‌బిఐ వాటా అమ్మకం

## రూ.8889కోట్లకు జపాన్ ఎస్‌ఎంబిసి కొనుగోలు




**న్యూఢిల్లీ,సెప్టెంబరు 17:** ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ ఎస్‌బ్యాంకులోని తన వాటాను జపాన్‌కు చెందిన ఎస్‌ఎంబిసికి విక్రయించింది. ప్రతి వాటాకు 21.50 రూపాయలు చొప్పున మొత్తం 8889 కోట్లు ఈషేర్లు విత్‌డ్రాద్వారా రాబడిసాధించింది. మొత్తంఎస్‌బ్యాంకులో ఎస్‌బిఐకి 413.44 కోట్ల ఈక్విటీ వాటాలున్నాయి. జపాన్‌కు చెందిన సుమితోమో మిత్సుయి బ్యాంకింగ్ కార్పొరేషన్ (ఎస్‌ఎంబిసి)కి తన వాటాలను విక్రయించింది. రెండోత్రైమాసికంలో ఈ రాబడులు బ్యాంకు ఇతర ఆదాయవనరులకింద వచ్చినట్లయింది. షేర్ల విత్‌డ్రా తర్వాత ఎస్‌బిఐ ఎస్‌బ్యాంకులో వాటా దారుగా కూడా కొనసాగుతుంది. విత్‌డ్రాచేసిన తర్వాత కూడా 108శాతం వాటాతో ఉంది. 2020 మార్చినెలలో ఎస్‌బిఐ ఎస్‌బ్యాంకులో అతిపెద్ద వాటాదారుగా ఉంది. ఎస్‌బ్యాంకు పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియలోభాగంగా బ్యాంకులోని అదనపు షేర్లను ఎఫ్‌పిఒద్వారా 2020 జులైలో కొనుగోలు చేసింది. ఇపుడు ఈ మొత్తంలో కొన్ని షేర్లను ఎస్‌ఎంబిసికి విక్రయించింది. ఇందుకుసంబంధించి ఎస్‌బ్యాంకు వాటాను కొనుగోలుచేసేందుకు ఎస్‌ఎంబిసి రిజర్వుబ్యాంకునుంచికూడా అనుమతి సాధించింది. జపాన్‌లో 14వ అతిపెద్ద ప్రపంచస్థాయి ఆర్థికసేవల బ్యాంకింగ్‌గ్రూప్‌గా ఎస్‌ఎంఎఫ్‌జి ఉంది. రెండు లక్షలకోట్ల డాలర్ల స్థిరాస్థి విలువలతో కొనసాగుతోంది. ఈ ఏడాది మేనెలలో ఎస్‌బ్యాంకు ఎక్ఛేంజిలకు ఈ ఎస్‌ఎంబిసి కొనుగోలు గురించి కూడా తెలియజేసింది. ఈకొనుగోలు 13.19 శాతం వాటా ఎస్‌బిఐనుంచి, 6.81శాతం ఏడుగురు ఇతర ఆటాదారులనుంచి కొనుగోలుచేస్తున్నట్లు వెల్లడించింది. యాక్సిస్ బ్యాంకు, బంధన్ బ్యాంకు, ఫెడరల్ బ్యాంకు, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, ఐసిఐసిఐ బ్యాంకు, ఐడిఎఫ్‌సి ఫస్ట్‌బ్యాంకు, కోటక్ మహీంద్ర బ్యాంకులకు ఇందులో వాటాలున్నాయి. ఈ కొనుగోలుతో ఇతరదేశాల్లోని బ్యాంకుల్లో అతిపెద్ద వాటా చేజిక్కించుకన్నసంస్థగా ఎస్‌ఎంబిసి నిలిచింది. నెలరోజులముందే ఆర్‌బిఐ, కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియాలనుంచి అనుమతులు పొందింది.

# ఉద్యోగులతో హుండయి మోటార్స్ ఒప్పందం

## రూ.31వేల వంతున వేతనాల్లో పెరుగుదల




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 17:** ఆటోమొబైల్‌రంగంలోని హుండయి మోటార్స్ ఇండియా ఉద్యోగులతో దీర్ఘకాలిక వేతన ఒప్పందంచేసుకుంది. యునైటెడ్ యూనియన్ ఆఫ్ హుండయి ఎంప్లాయీస్‌తో మూడేళ్ల కాలానికి చెల్లుబాటయ్యేవిధంగా ఈ వేతన ఒప్పందం జరిగింది. ఈ కొత్త వేతనాలు పెరిగి పరిశ్రమలోనే అత్యుత్తమ వేతన ప్యాకేజిగా నిలుస్తుంది కొత్తగా ఉద్యోగులకు 31 వేల రూపాయలు వంతున పెరుగుతుంది. మూడేళ్లకాలం పాటు మొదటి విడత 55శాతం, 25శాతం, 20శాతంగా ఉంటుంది. వేతన పెంపుతోపాటు కార్మిక సంక్షేమానికి కూడా అదనంగా ఖర్చుచేస్తామని ప్రకటించింది. వెల్‌నెస్ కార్యాచరణల్లో పరిశ్రమలోనే బెస్ట్‌ఇన్‌క్లాస్ సేవలు అందచేస్తామని తెలిపింది. 2024 ఏప్రిల్ ఒకటవ తేదీనుంచే ఈ ఒప్పందం అమలులోకి వస్తుంది. 2027 మార్చి 31వరకూ కొనసాగుతుంది. పరిశ్రమ పీపుల్‌స్ట్రాటజీ హెడ్ యంగమ్యూంగ్‌పార్క్ మాట్లాడుతూ మా ఉద్యోగులే మా విజయానికి కారకులని, ప్రస్తుత ఒప్పందం పరస్పర నమ్మకం, గౌరవంతో నిర్మాణాత్మకచర్చలతోముగిసిందని అన్నారు. 2011లో రిజిస్టరు అయిన యునైటెడ్ యూనియన్ ఆఫ్ హుండయి ఎంప్లాయీస్ మేనేజ్‌మెంట్ గుర్తించిన అధికారిక యూనియన్‌గా నిలిచింది. మొత్తం 1981 మంది ఉద్యోగులు అంటే 90శాతం మంది ఈయూనియన్‌లోనే ఉన్నారు. ఉద్యోగుల హక్కులు, సంక్షేమం, యాజమాన్యంతో సామరస్య పూర్వక సంప్రదింపులు వంటివి కొనసాగిస్తోంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14